

www.andhrajyothy.com
విజయవాడ సిటీ
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 66
సంచిక (Issue) : 134
శుక్రవారం | 29-8-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం, తిథి: షష్ఠి రా.8.22 తదుపరి సప్తమి, నక్షత్రం: స్వాతి ఉ.11.39 తదుపరి విశాఖ, వర్జ్యం: సా.5.56-7.44, దుర్ముహూర్తం: ఉ.8.33-9.22, మ.12.40-1.30, అమృతఘడియలు: తె. 4.43 మొదలు, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 6.04, సూర్యాస్తమయం: 6.27

మహిళలకు భరోసా మన విశాఖ

దేశంలోనే సురక్షిత నగరంగా విశాఖపట్నం

మరో ఆరు నగరాలతో కలిసి మొదటి ర్యాంకు

జాతీయ వార్షిక నివేదిక, ఇండెక్స్ సర్వేలో వెల్లడి.. దక్షిణ భారతం నుంచి విశాఖకే చోటు

13



విజయవాడలో ఏర్పాటు చేసిన 72 అడుగుల భారీ మట్టి వినాయక విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేసిన సీఎం చంద్రబాబు



కాకినాడ కార్పొరేషన్‌లోని సురేశ్‌నగర్‌లో ఉన్న పార్కు ఇది. ఈ పార్కు పూర్తిగా ప్రభుత్వ స్థలంలోనే ఉంది. పార్కు అభివృద్ధికి వైసీపీ హయాంలో కార్పొరేషన్ నిధులు కూడా వెచ్చించింది. కానీ పార్కు స్థలం తనది అంటూ ఓ వ్యక్తి దొంగ డాక్యుమెంట్లు సృష్టించారు. ఈ వ్యక్తికి మద్దతుగా అప్పటి వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి రంగంలోకి దిగారు. ఈ స్థలాన్ని తిరిగి కార్పొరేషన్ పార్కు కోసం తీసుకోవడానికి ఆ వ్యక్తి సమ్మతించేలా చేసి ...ఆ స్థలానికి ధర కట్టించారు. నగదుకు బదులు టీడీఆర్ బాండ్లు జారీ చేశారు. అంటే.. ప్రభుత్వ భూమిని ప్రభుత్వమే ప్రైవేటు వ్యక్తికి డబ్బులిచ్చి కొనుగోలు చేసిందన్నమాట! ఈ వ్యవహారంలో రూ.160 కోట్ల అక్రమాలు జరిగాయని ప్రాథమికంగా తేలింది.

'బాండ్ల'పై బండ!

వేల కోట్ల టీడీఆర్ బాండ్ల స్కామ్
నత్తనడకన సాగుతున్న విచారణ

వైసీపీ హయాంలో అడ్డగోలుగా జారీ

నకిలీలు, దళారులకే అప్పట్లో అత్యధిక లబ్ధి

రూ.కోట్లు జేబులో వేసుకున్న వైసీపీ నాయకులు

కూటమి రాగానే విజిలెన్స్ విచారణకు నిర్ణయం

'దొంగలు దొరికినా' ఇంతవరకు చర్యల్లేవు!

ఒక్క తిరుపతిలోనే రూ.4 వేల కోట్ల కుంభకోణం!

కాకినాడ, తణుకులోనూ భారీగా అక్రమాలు

గుంటూరులో బాధిత రైతుల గగ్గోలు

మంత్రి నారాయణ ప్రకటనతో మళ్లీ తెరపైకి వివాదం

(ఆంధ్రజ్యోతి- న్యూస్ నెట్‌వర్క్)

వైసీపీ హయాంలో పలు వివాదాలు.. చిత్రవిచిత్ర నిర్ణయాలకు కేంద్రంగా నిలిచిన టీడీఆర్ బాండ్ల స్కామ్ వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ స్కామ్‌పై విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. శాఖాపరమైన విచారణను జరిపించాలని ఉత్తర్వులు ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా అప్పట్లో రూ.వందల కోట్ల విలువైన టీడీఆర్ బాండ్లు జారీ అయ్యాయి. వీటి లబ్ధిదారుల్లో నకిలీలు, దళారులే అత్యధికమని కూటమి ప్రభుత్వం గుర్తించింది. అయితే, అక్రమాలను నిగ్గుతేల్చేపనిని విజిలెన్స్ ఆశించినంత వేగంగా చేపట్టడం లేదనే అభిప్రాయం ఉంది. మరోవైపు, ఇద్దరు మంత్రులు టీడీఆర్ బాండ్లపై భిన్నంగా చేసిన ప్రకటనలు ఈ వ్యవహారాన్ని మరోసారి చర్చనీయాంశంగా మార్చింది. టీడీఆర్ బాండ్ల (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) అవకతవకలపై విచారణ లోతుగా జరుగుతోందని తిరుపతి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలపగా, టీడీఆర్‌కు సంబంధించి తిరుపతిలో పెద్దగా అవినీతి జరగలేదని పురపాలక శాఖ మంత్రి నారాయణ వ్యాఖ్యానించారు. టీడీఆర్ బాండ్లను ఈ శాఖే జారీచేస్తుంది. అయితే, నారాయణ వ్యాఖ్యలను

మిగతా 2వ పేజీలో...

తిరుపతిలో కొల్లగొట్టారు..!

తణుకు, కాకినాడ, గుంటూరు, తిరుపతిలో భారీగా టీడీఆర్ బాండ్ల కుంభకోణం జరిగినట్టు వైసీపీ హయాంలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. నెల్లూరుకు చెందిన టీడీపీ నేత ఆనం వెంకటరమణారెడ్డి గతంలో తిరుపతిలో ప్రెస్‌మీట్ పెట్టి టీడీఆర్ బాండ్ల స్కాంపై ఆరోపణలు చేశారు. రూ.4 వేల కోట్ల మేర కుంభకోణం

మిగతా 2వ పేజీలో...

ఒక్క అర్హుడికీ అన్యాయం జరగదు

దివ్యాంగుల పింఛన్లపై సీఎం భరోసా

వైసీపీ హయాంలో అనర్హులకు పెన్షన్లు

దివ్యాంగులకు ఒక్క రూపాయైనా పెంచలేదు

దానిపై మాట్లాడే అర్హతే వారికి లేదు

అనర్హుల గుర్తింపులో పొరపాట్లు గుర్తించండి

అధికారులు తప్పు చేస్తే సరిదిద్దండి

ఎంతో చేస్తున్నాం.. చేసింది చెప్పుకొందాం

పింఛన్ల పంపిణీకి ఇంటింటికీ వెళ్లండి

13

జిల్లా కమిటీలను త్వరలో ప్రకటిస్తాం

రాష్ట్ర కమిటీ కూర్పుపై కసరత్తు: సీఎం

టీడీపీ ముఖ్య నేతలతో టెలీ కాన్ఫరెన్స్

ప్రతి కుటుంబానికీ 'ఫ్యామిలీ కార్డు'

ప్రభుత్వ పథకాల వివరాలన్నీ అందులో నిక్షిప్తం

కుటుంబంలోని వారందరికీ ఆధార్ తరహాలో కార్డు

సంతృప్త స్థాయిలో సంక్షేమ పథకాలు అందాలి

అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించాలి

పథకాల కోసం కుటుంబాలు విడిపోకూడదు

స్కిల్ రీడిజైన్.. త్వరలో పాపులేషన్ పాలసీ: సీఎం

1,129 కోట్లతో విలేజ్ హెల్త్ క్లినిక్స్

4,472 గ్రామాల్లో నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్

13

డేటా సిటీ విశాఖ



నగరంలో మూడు డేటా సెంటర్ల ఏర్పాటు!

మొత్తం రూ.82 వేల కోట్ల పెట్టుబడులు

51 వేల కోట్లతో గూగుల్ డేటా సెంటర్

అంతకుముందే అదానీతో ఒక ఒప్పందం

నెల కిందట సిఫీ టెక్నాలజీస్‌తోనూ చర్చలు

సాగర నగరం విశాఖపట్నం డేటా సెంటర్లకు కేంద్రంగా మారనుంది. గూగుల్, అదానీ డేటాసెంటర్లతో పాటు... సిఫీ టెక్నాలజీస్ కూడా తన డేటా సెంటర్ ఏర్పాటుకు విశాఖ నగరాన్నే ఎంచుకుంది. ఈ మూడు వచ్చేస్తే... విశాఖ ఆసియాలోనే అతి పెద్ద డేటా సెంటర్ సిటీగా ఆవిర్భవిస్తుంది. వీటి ద్వారా రూ.81 వేల కోట్లకు పైబడి పెట్టుబడులు వస్తాయి. ప్రత్యక్షంగా కొన్ని వేల మందికి... పరోక్షంగా లక్ష మందికి పైగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అంచనా!

(విశాఖపట్నం - ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలో డేటా సెంటర్ ఏర్పాటుపై గూగుల్ ఆసక్తి ప్రదర్శిస్తోంది. సంస్థ ప్రతినిధులు ఇందుకు అవసరమైన భూములను కూడా వచ్చి చూసుకున్నారు. భీమిలి నియోజకవర్గం ఆనందపురం మండలం తర్లువాడలో గూగుల్‌కు 200 ఎకరాలు ఇవ్వడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రెండు నెలల క్రితం వెల్లడించారు. ఇదే అంశాన్ని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ ఇటీవల పార్లమెంటు సమావేశాల్లో ప్రస్తావించారు. 'విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు వాస్తవమేనా? ఏపీ ప్రభుత్వం ఎటువంటి ప్రతిపాదనలు ఇచ్చింది?' అని ప్రశ్నించగా... కాపీ రైట్‌కు

మిగతా 13వ పేజీలో...

రాష్ట్రంలో మరో 53,922 కోట్ల పెట్టుబడులు

83,437 మందికి ఉద్యోగాలు

27 సంస్థల ప్రతిపాదనలకు ఎస్‌ఐపీబీ ఆమోదం

క్లీన్ ఎనర్జీ రంగంలో అత్యధిక పెట్టుబడులు

నెల్లూరులో 578 కోట్లతో అదాని విల్‌మార్


రెండు ప్రైవేట్ మెగా ఇండస్ట్రియల్ పార్కులు

ఐఫోన్ చాసిస్.. మేడిన్ కుప్పం

ముడి సరుకు తయారీ ప్లాంట్‌కు ఎస్‌ఐపీబీ ఓకే

రూ. 586 కోట్లతో హిండాల్కో యూనిట్

13



నేను రిటైర్ కాను.. రిటైర్ అవమని ఎవరికీ చెప్పను

బీజేపీతో సంఘర్షణే తప్ప తగాదాల్లేవ్

2

సంఘ్ సలహాలిస్తుంది, ప్రభుత్వాన్ని నడపదు

రిజర్వేషన్లకు పూర్తి సమర్థన

చొరబాట్లు, బలవంతపు మతమార్పిళ్లు ఆపాలి

ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో మోహన్ భాగవత్

మరో 15 ఏళ్లు కూటమే!

రాష్ట్రం నిలకడగా అభివృద్ధి చెందాలంటే సుస్థిర ప్రభుత్వం కావాలి

మూడు పార్టీలూ కలిసే ఉంటాయి: పవన్ కల్యాణ్

అనుమానమేమీ పెట్టుకోవద్దని జనసేన నేతలకు స్పష్టీకరణ

విశాఖలో 'సేనతో సేనాని' సమావేశాలకు హాజరు

సోషల్ మీడియాలో మహిళలపై జుగుప్సాకర వ్యాఖ్యలు, దుష్ప్రచారం కట్టడికి చట్టం అవసరమని ఉద్ఘాటన

12

నేడు ప్రత్యేక ఆహ్వానితులతో భేటీ.. రేపు విస్తృత సమావేశం



సమావేశంలో పవన్ అభివాదం

యూరియా వచ్చింది

గంగవరం పోర్టుకు చేరిన 10,350 టన్నులు

వచ్చే వారం మరో 25 వేల టన్నులు: మంత్రి అచ్చెన్న

అమరావతి, శ్రీకాకుళం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా కొరతను తీర్చడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సెప్టెంబరు 6న రావాల్సిన 10,350 టన్నుల యూరియాను సీఎం చంద్రబాబు చొరవతో కేంద్ర ప్రభుత్వం వారం ముందే రాష్ట్రానికి పంపింది. ఐపీఎల్(ఇండియన్ పొటాష్ లిమిటెడ్) కంపెనీ

మిగతా 12వ పేజీలో...





ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే.. ఎన్డీయేకు 324 సీట్లు!

ఇండీ కూటమికి 208 మాత్రమే

ఇండియా టుడే-సీ ఓటర్ సర్వే

బిహార్‌లో ఎన్డీయేదే విజయం

2

టైమ్స్ నా- జేవీసీ సర్వేలో వెల్లడి

అమెరికా విద్యార్థి వీసా గడువు నాలుగేళ్లే!

జర్నలిస్టులకు 240 రోజుల పరిమితి

ట్రంప్ యంత్రాంగం ప్రతిపాదనలు

2

ఎలా ఎదుర్కొందాం?



ట్రంప్ సుంకాలపై కేంద్రం కసరత్తు

అమెరికాయేతర మార్కెట్లకు విస్తరణ

40 కీలక దేశాల గుర్తింపు.. భారతీయ ఉత్పత్తుల ఎగుమతుల పెంపునకు కార్యాచరణ

ఎగుమతిదార్లను ఆదుకోవడం కోసం రూ. 25 వేల కోట్లతో మిషన్

స్టాక్‌మార్కెట్లపై సుంకాల ప్రభావం.. రెండు రోజుల్లో రూ. 9. 6 లక్షల కోట్ల నష్టం

న్యూఢిల్లీ, ఆగస్టు 28: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలతో.. ఇప్పటి వరకూ ఆ దేశానికి భారత్ నుంచి వెళ్తున్న దాదాపు 4,820 కోట్ల డాలర్ల (రూ.4,22,384 కోట్ల) విలువైన ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడనుంది. సుంకాల వల్ల అమెరికా మార్కెట్లలో భారతీయ సరుకుల ధరలు భారీగా పెరిగిపోవటంతో.. ఇతర దేశాల (సుంకం పోటు తక్కువగా ఉన్న దేశాల) సరుకులతో పోటీ పడలేని పరిస్థితి. మరి, ఇంత భారీ నష్టాన్ని భర్తీ చేసుకునేదెలా? ప్రస్తుతం కేంద్ర సర్కారు దీనిపైనే తీవ్రంగా కసరత్తు జరుపుతోంది. ఇందులో భాగంగా, ఇక మీదట అమెరికాయేతర

మిగతా 2వ పేజీలో...

ఉల్లి రైతు కన్నీరు!

ధర భారీగా పతనం

క్వింటా కనిష్ఠంగా రూ.500

అధిక వర్షాలకు తగ్గిన దిగుబడి

పెరిగిన పెట్టుబడి.. దక్కని గిట్టుబాటు



కర్నూలు యార్డులో ఉల్లి నిల్వలు

అన్నదాత నష్టపోకూడదు

12

తక్షణమే క్వింటా 1,200కు కొనండి

మార్కెటింగ్ శాఖకు సీఎం ఆదేశాలు



అమెరికా విద్యార్థి వీసా గడువు నాలుగేళ్లే!

» ట్రంప్ యంత్రాంగం నూతన ప్రతిపాదనలు

» అమెరికా ఉన్నత విద్యా వ్యవస్థకు దెబ్బ: నిపుణులు



న్యూఢిల్లీ, ఆగస్టు 28: అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకొనే విదేశీ విద్యార్థులకు మరో షాక్ ఇచ్చేందుకు ట్రంప్ సర్కారు సిద్ధమైంది. అంతర్జాతీయ విద్యార్థులతో పాటు ఎక్స్ఛేంజ్ విజిటర్లు, విదేశీ మీడియా ప్రతినిధుల వీసాలకు పరిమిత కాల గడువు విధించేందుకు బుధవారం నూతన నిబంధనలను ప్రతిపాదించింది. దీనిప్రకారం విద్యార్థి, ఎక్స్ఛేంజ్ వీసాలను నాలుగేళ్లకు పరిమితం చేస్తారు. విదేశీ మీడియా ప్రతినిధులకు ఇచ్చే ఐ-వీసాలను 240 రోజులకు జారీ చేస్తారు. జర్నలిస్టు వీసాపై ఉన్న చైనీయులకు 90 రోజుల పరిమితిని కఠినంగా అమలు చేయనున్నారు. ఈ గడువును మించి నివాసం ఉండాలనుకునేవారు అమెరికా పౌరసత్వం, ఇమిగ్రేషన్ సేవల (యూఎస్‌సీఐఎస్) విభాగానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దీనిద్వారా వారి దరఖాస్తులను సమీక్షించడానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్)కు తగినంత వెసులుబాటు లభిస్తుందని భావిస్తున్నారు. తాజాప్రతిపాదనలు అమలులోకి వస్తే 1978 నుంచి అమలులో ఉన్న 'డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్' విధానం స్థానంలో పరిమిత కాల నివాస అనుమతులతో కూడిన వీసా మంజూరు చేస్తారు. ప్రస్తుతం ఎఫ్-1, జే-1 వీసాదారులు తమ కోర్సు మొత్తం పూర్తయ్యే వరకూ అమెరికాలో నివసించే అవకాశం ఉంది. కొంతమంది ఈ నిబంధనను దుర్వినియోగం చేస్తూ శాశ్వత విద్యార్థులుగా మారిపోతున్నారని, ఎప్పటికప్పుడు తమ నివాస అనుమతులను పొడిగించుకుంటున్నారని అధికారులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో వీసా గడువును పరిమితం చేయాలని డీహెచ్ఎస్ ఇటీవల ప్రతిపాదించింది. కొత్త ప్రతిపాదనలతో కొన్ని రకాల వీసాదారుల నివాస అనుమతులపై పరిమితి తీసుకొస్తున్నామని, ఇది వీసా దుర్వినియోగానికి చెక్ పెడుతుందని డీహెచ్ఎస్ అధికార ప్రతినిధి ఒకరు వెల్లడించారు. కొత్త ప్రతిపాదనలపై 30 రోజుల పాటు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి తుది నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. కాగా, ఈ ప్రతిపాదనలు అమెరికా ఉన్నత విద్యావ్యవస్థను దెబ్బతీస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2024లో దాదాపు 16లక్షల మంది ఎఫ్-వీసా విద్యార్థులతో పాటు 3,55,000మంది ఎక్స్ఛేంజీ విజిటర్లు, 13వేల మంది విదేశీమీడియా ప్రతినిధులు అమెరికాలో ఉన్నారు.

లోకం తీరు



సుప్రీం కోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్‌లు అరాధే, పంచోలీ

» పదోన్నతులపై కొలీజియం సిఫారసుకు కేంద్రం ఆమోదం



న్యూఢిల్లీ, ఆగస్టు 28: బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ విపుల్ మనుభాయి పంచోలికు సుప్రీం కోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి లభించింది. వీరి పదోన్నతులకు సంబంధించి సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫారసును కేంద్రం ఆమోదించింది. ఇందుకు సంబంధించి కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ మేఘావల్.. ఎక్స్‌లో బుధవారం పోస్టు చేశారు.

పుట్టినరోజు వేడుక జరుగుతుండగా కుప్పకూలిన భవనం.. 17 మంది దుర్మరణం

పాల్ఘర్, ఆగస్టు 28: అది నాలుగు అంతస్తుల భవనం. మంగళవారం అర్ధరాత్రి దాటింది.. సమయం 12:05 గంటలు. నాలుగో అంతస్తులోని ఓ ఫ్లాట్‌లో గొప్ప సందడిగా ఉంది. తమ బిడ్డ ఉత్కర్ష (1) తొలి పుట్టినరోజు వేడుక కోసం దంపతులు ఓంకార్ జోవిల్ (25), ఆరోహీ ఓంకార్ (24) బంధువులు, మిత్రులను పిలుచుకున్నారు. గడియారం సరిగ్గా 12 గంటలు కొట్టగానే.. ఓంకార్, ఆరోహీ కలిసి పాప ఉత్కర్ష చేతులు పట్టుకొని, కేక్ కట్ చేయించారు. చుట్టూ చేరిన అతిథిగణం 'హేపీ బర్త్ డే డియర్ ఉత్కర్ష' అని చప్పట్లతో అభినందిస్తోంది. అయితే ఆ సమయంలో వారి కాళ్లకింద నేల కదిలిపోయింది.. కళ్లుమూసి తెరిచేలోగా ఘోరం జరిగింది! ఆ ఫ్లాట్ సహా.. భవనంలోని ఓ భాగం కుప్పకూలిపోయింది. తెల్లవారితే వినాయక చవితి పండుగ అనగా మహారాష్ట్ర పాల్ఘర్ జిల్లా విరార్‌లోని నారంగిలో ఈ విషాద ఘటన జరిగింది. పాప ఉత్కర్ష, తల్లిదండ్రులు ఓంకార్, ఆరోహీ సహా మొత్తం 17 మంది శిథిలాల కింద చిక్కుకొని మృతిచెందారు. ఎనిమిది మంది గాయపడ్డారు. 15 మృతదేహాలను బుధవారం, మరో రెండు మృతదేహాలను గురువారం వెలికితీశారు. శిథిలాల కింద చిక్కుకొని 9మంది గాయపడ్డారు. వారిని బయటకు తీసి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. రమాబాయి అపార్ట్‌మెంట్ పేరుతో ఉన్న ఈ నాలుగు అంతస్తుల భవనాన్ని 2011లో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించారు. భవనంలో 50 ఫ్లాట్లు ఉన్నాయి. అందులో 12 ఫ్లాట్లు ఉన్న ఓ భాగం పూర్తిగా పక్కనున్న ఓ ఇంటిపై కూలిపోయింది. అదృష్టవశాత్తు ఆ ఇల్లు ఖాళీగా ఉండటంతో అక్కడ ఉండేవారికి ముప్పు తప్పింది. సమాచారం అందడంతో ఎన్డీఆర్ఎఫ్ వెంటనే అక్కడికి చేరుకొని సహాయక చర్యలకు దిగింది. శిథిలాలు తొలగించే పని కొనసాగుతోంది. బిల్డర్ నిట్టల్ సానేపై కేసు నమోదు చేసిన పోలీసులు, అతడిని అరెస్టు చేశారు. ఘటనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడణవీస్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు.

'బాండ్ల'పై బండ!

(మొదటి పేజీ తరువాయి)

అవకాశంగా తీసుకుని ఐఏఎస్ శ్రీలక్ష్మిపై తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలోని పలు నగరాలు, పట్టణాల్లోనూ అప్పట్లో భారీగా బాండ్ల దోపిడీ కొనసాగింది. గుంటూరు శివార్లలో రెండున్నర కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణను వైసీపీ హయాంలో చేపట్టారు. కానీ, ఈ భూములకు కమర్షియల్‌కు సంబంధించిన డోర్ నంబర్ వేసి ఆస్తి రేట్లు పెంచేసి.. టీడీఆర్ బాండ్లను అధికారులు జారీచేశారు. వాటిని పొందినవారినుంచి ఆ తర్వాత భారీగా కమీషన్లు పుచ్చుకున్నారు. రోడ్లు భవనాల శాఖ విశ్రాంత ఇంజనీర్‌ను మధ్యవర్తిగా పెట్టుకుని అధికారులు, నేతలు ఈ తతంగం నడిపించారు. సుమారు రూ.100 కోట్ల టీడీఆర్ బాండ్ల కుంభకోణం జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. విషయం బయటకుపొక్కడంతో అప్పట్లోనే ఈ ప్రక్రియను నిలిపివేశారు. అప్పటికే డబ్బులు ఇచ్చుకున్న నిజమైన లబ్ధిదారులు మూడేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు మునిసిపాలిటీ పరిధిలో 28 ఎకరాలు పురపాలక శాఖ సేకరించేలా అప్పట్లో అధికారులపై వైసీపీ నేతలు ఒత్తిడి తెచ్చారు. అందుకోసం రూ.900 కోట్ల విలువైన టీడీఆర్ బాండ్లు జారీ చేయించారు. ఈ భూమికి గజాల లెక్కన బాండ్లు జారీ చేయగా, ఆయా భూముల యజమానులకు బదులు మధ్యదళారులు ఈ లబ్ధిని పొందారు. ఈ వ్యవహారంలో అప్పటి జిల్లా మంత్రికి రూ.కోట్ల ముడుపులు ముట్టినట్టు ఆరోపణలు వచ్చాయి. విజయనగరం జిల్లా బొబ్బిలి పట్టణంలో రోడ్డు విస్తరణలో భాగంగా అప్పట్లో టీడీఆర్ బాండ్లు జారీ చేశారు. అయితే, ఈ ప్రక్రియలో రూ.కోట్లలో అవినీతి చోటు చేసుకున్నదని ఆనాడే ఆరోపణలు వచ్చాయి. కాకినాడ కార్పొరేషన్‌లో గత ప్రభుత్వ హయాంలో జారీ చేసిన రూ.411కోట్ల విలువైన టీడీఆర్ బాండ్ల గుట్టు రట్టయినా చర్యలు లేవు. పరిశ్రమల అవసరాల కోసం కాకినాడ సమీపంలోని దుమ్ములపేటలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించాలని ట్రాన్స్‌కో నిర్ణయించింది. దీనికి అవసరమయ్యే స్థలం చాలా తక్కువ. పైగా ఈ స్థలాన్ని ట్రాన్స్‌కో స్వయంగా సమకూర్చుకోవాలి. కానీ, కార్పొరేషన్‌ను తెరపైకి తెచ్చి ఓ ప్రైవేటు వ్యక్తి నుంచి నాలుగున్నర ఎకరాలు కొనిపించారు. సుమారు రూ.251కోట్ల విలువైన టీడీఆర్ బాండ్లను జారీ చేసేశారు. కాకినాడ కార్పొరేషన్ పరిధిలోని పార్కు స్థలం వ్యవహారంలో మరో రూ. సుమారు 160 కోట్ల విలువైన టీడీఆర్ బాండ్లు జారీచేశారు.

టీడీఆర్ బాండ్ అంటే....

పట్టణాల్లో రోడ్ల విస్తరణ, అభివృద్ధి కార్యక్రమాలకు భూసేకరణక్రమంలో పురపాలక శాఖ మున్సిపల్‌శాఖ ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) బాండ్లను జారీ చేస్తుంది. భూమి సేకరించే ప్రాంతంలో మార్కెటు రేటు ఎంత ఉంటుందో దాని కంటే ఎక్కువ విలువ కలిగిన బాండ్లను స్థలం కోల్పోయిన యజమానులకు కేటాయిస్తారు. ముఖ్యంగా రోడ్ల విస్తరణ, పార్కుల అభివృద్ధి, కంపోస్టు యార్డ్‌కు సంబంధించి స్థలాలను సేకరించేందుకు పురపాలక శాఖ ఈ బాండ్లను జారీచేస్తుంది. ఎవరికైనా ఈ బాండ్లను విక్రయించుకునే వెసులుబాటును కల్పిస్తుంది.

తిరుపతిలో కొల్లగొట్టారు..!

(మొదటి పేజీ తరువాయి)

అక్కడ జరిగిందని ఆయన విమర్శించారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్మించిన రోడ్లతో స్థలాలు కోల్పోయిన వారికి మొత్తం 1417 బాండ్లు జారీచేయాలని వైసీపీ నాడు నిర్ణయించింది. అయితే, ఇందులో 380 బాండ్లకు అర్హత లేదని తాజాగా తేలింది. కానీ, అక్రమాలకు పాల్పడిన వారిపై కూటమి ప్రభుత్వం పెద్దగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవనే అభిప్రాయం వ్యక్తంఅవుతోంది. విజిలెన్స్ విచారణ కూడా తూతూ మంత్రంగా సాగుతోందన్న విమర్శలు వస్తున్నాయి. తప్పుచేసిన అధికారులు, వైసీపీ నేతలపై చర్యలు తీసుకోకపోగా, అక్రమాలే జరగలేదన్న వ్యాఖ్యలపై సొంత పార్టీనేతలే అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

ట్రంప్ సుంకాలను.. ఎలా ఎదుర్కొందాం?

(మొదటిపేజీ తరువాయి)



దేశాల మార్కెట్లపై ఎక్కువగా దృష్టి సారించాలని నిర్ణయించింది. వీటిలో బ్రిటన్, జపాన్, దక్షిణ కొరియా, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్, నెదర్లాండ్స్, పోలండ్, కెనడా, మెక్సికో, రష్యా, బెల్జియం, టర్కీ, యూఏఈ, ఆస్ట్రేలియా తదితర 40 దేశాలున్నాయి. ఈ దేశాల్లో ఇతర సరుకులతోపాటు వస్త్ర పరిశ్రమ ఎగుమతులకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని ప్రభుత్వం భావిస్తోంది (అమెరికా సుంకాలతో తీవ్రంగా నష్టపోతున్నది వస్త్ర పరిశ్రమనే). దీనిపై ఓ అధికారి మాట్లాడుతూ, 'ప్రతీ దేశంలోనూ లక్ష్యిత వ్యూహంతో ముందుకెళ్లాలని అనుకుంటున్నాం. నాణ్యమైన, వినూత్నమైన ఉత్పత్తులను ఎగుమతి చేయటమేకాదు.. ఆయాదేశాలు ఆధారపడతగిన, విశ్వసించదగిన సరఫరాదారుగా పేరు తెచ్చుకునేలా కృషి చేస్తాం. ఈ కార్యాచరణలో ఆయాదేశాల్లోని భారతీయ రాయబార కార్యాలయాలతోపాటు 'ఎగుమతి ప్రోత్సాహక మండళ్లు' కూడా కీలకపాత్ర పోషించనున్నాయి' అని వెల్లడించారు.

220 దేశాలకు ఎగుమతులు

భారత్ ప్రపంచవ్యాప్తంగా 220కిపైగా దేశాలకు ఎగుమతులు చేస్తోంది. వీటిలో బ్రిటన్, జపాన్, దక్షిణ కొరియాలతో కూడిన 40 దేశాలు అత్యంత కీలకమైనవి. ఈ దేశాలు ఏటా 59,000 కోట్ల డాలర్ల (రూ.51,70,000 కోట్లు) విలువైన జౌళి ఉత్పత్తులు, వస్త్రాలను దిగుమతి చేసుకుంటున్నాయి. ఇంతటి భారీ మార్కెట్లో మనదేశం వాటా 5-6% మాత్రమే. అంటే, ఈ దేశాల్లో మన మార్కెట్ వాటాను పెంచుకోవటానికి పుష్కలమైన అవకాశాలున్నాయి. దీని వల్లే ట్రంప్ సుంకాల నేపథ్యంలో.. వీటిపై కేంద్రం దృష్టి పెట్టింది. ఈ కార్యాచరణలో కీలకంగా భావిస్తున్న ఎగుమతి ప్రోత్సాహక మండళ్లు.. ఆయా దేశాల్లో మార్కెట్ మ్యాపింగ్, అధిక డిమాండ్ ఉన్న ఉత్పత్తుల గుర్తింపు మీద నిశితమైన అధ్యయనం జరిపి మార్గదర్శకాలను వెలువరిస్తాయి. అంతర్జాతీయ ట్రేడ్‌ఫెయిర్లలో, ఎగ్జిబిషన్లలో, కొనుగోలు-అమ్మకందారు సమావేశాల్లో భారత్ బ్రాండ్‌ను బలంగా ముందుకు తీసుకెళ్తాయి. భారత ఎగుమతిదారులు అంతర్జాతీయ ప్రమాణాలను పాటించేలా చేయటం, ఆయాదేశాల మార్కెట్లలోకి వెళ్లటానికి అవసరమైన పత్రాలను సంపాదించుకోవటంలో దిశానిర్దేశం చేస్తాయి. మరోవైపు, భారతీయ ఎగుమతిదారులను రక్షించటానికి రూ.25 వేల కోట్లతో 'ఎగుమతి ప్రోత్సాహక మిషన్'ను ఏర్పాటు చేయనున్నట్లు సంబంధిత అధికార వర్గాలు తెలిపాయి. కాగా, ట్రంప్ సుంకాలతో వస్త్రాలు, ముత్యాలు, ఆభరణాలు, రొయ్యలు, లెదర్ పరిశ్రమలపై ముఖ్యంగా.. ఎక్కువ మంది కార్మికులు పని చేసే రంగాలపై తీవ్రంగా ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలో, ఆయా రంగాలకు చెందిన ఎగుమతిదారులతో ఈ వారంలో కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ సమావేశం కానుంది. ప్రత్యామ్నాయాల అన్వేషణ, అమెరికాయేతర మార్కెట్లకు ప్రాధాన్యం, కొత్త మార్కెట్లలోకి వెళ్లటం తదితర అంశాలను సమగ్రంగా చర్చించనున్నట్లు సమాచారం. ప్రస్తుతానికైతే, అమెరికా సుంకాలకు పోటీగా ఆ దేశంపై ప్రతీకార సుంకాలు విధించే యోచన ఏమీ లేదని అధికారవర్గాలు తెలిపాయి.

పరిశ్రమల్ని ఆదుకోండి: స్టాలిన్

చెన్నై, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అమెరికా విధించిన సుంకాల ప్రభావం తమిళనాడులోని సముద్ర ఉత్పత్తులు, వస్త్ర పరిశ్రమపై తీవ్రంగా పడే సూచనలు కనిపిస్తున్నాయి. తూత్తుకుడిలోని సీఫుడ్స్ సంస్థల్లో 50%ఉత్పత్తి నిలిచిపోయింది. తిరుప్పూరులో 35 లక్షల బనియన్లు కర్మాగారాల్లో పేరుకుపోయాయి. అమెరికా దిగుమతి చేసుకునే సీఫుడ్స్‌లో 26.5% దాకా భారత్ నుంచే వెళుతుంది. తమిళనాడులో 25 దాకా సీఫుడ్స్ ఎగుమతి సంస్థలుండగా, వీటిల్లో 11 సంస్థలు తూత్తుకుడిలోనే నడుస్తున్నాయి. ఈ సంస్థల నుంచే అమెరికాకు చేపలు, రొయ్యలు, పీతలు ఎగుమతి చేస్తున్నారు. అమెరికా సుంకాలదెబ్బతో ప్రస్తుతం 50% దాకా ఎగుమతి నిలిపేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రాన్ని ఆదుకోవాలంటూ ప్రధాని మోదీని సీఎం స్టాలిన్ కోరారు. గత ఏడాది భారతదేశం నుండి రూ.60 వేల కోట్ల విలువైన సీఫుడ్స్ అమెరికాకు ఎగుమతి అయ్యాయి.

స్టాక్‌మార్కెట్ల పతనం

అమెరికా 50% సుంకాల ప్రభావం తీవ్రంగానే ఉంటోంది. మంగళ, గురువారాల్లో స్టాక్‌మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. ఫలితంగా, మదుపరులు రూ.9.6 లక్షల కోట్ల మేర నష్టపోయినట్లు మార్కెట్ నిపుణులు అంచనా వేశారు.

డిసెంబరు 31 వరకు పత్తిపై దిగుమతి సుంకం మినహాయింపు

న్యూఢిల్లీ, ఆగస్టు 28: అమెరికా సుంకాలు అమల్లోకి వచ్చిన వేళ.. దేశీయ టెక్స్‌టైల్ పరిశ్రమకు ఊరట కల్పించే లక్ష్యంతో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది డిసెంబరు నెలాఖరు వరకూ పత్తిపై దిగుమతి సుంకం మినహాయింపును ఇవ్వనుంది. గతంలో సెప్టెంబరు నెలాఖరు వరకు ఇచ్చిన మినహాయింపు గడువును మరో మూడు నెలలు పొడిగిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ గురువారం ప్రకటించింది. దేశీయ వస్త్ర పరిశ్రమ రంగానికి సరిపడినంత ముడి పత్తి అందుబాటులో ఉంచడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. దేశీయ రంగాన్ని కాపాడేందుకు ఈ నిర్ణయం ఎంతో ఉపకరిస్తుందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ ఫౌండర్ అజయ్‌శ్రీవాత్సవ చెప్పారు.

అది మోదీ నడిపిస్తున్న యుద్ధం

» రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై శ్వేతసౌధం సలహాదారు పీటర్ నవారో వ్యాఖ్య

న్యూయార్క్/వాషింగ్టన్, ఆగస్టు 28: రష్యా-ఉక్రెయిన్ యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగేందుకు ఇండియానే కారణమని శ్వేతసౌధం వాణిజ్య సలహాదారు పీటర్ నవారో ఆరోపించారు. ఆ యుద్ధాన్ని 'మోదీ నడిపిస్తున్న యుద్ధం'గా అభివర్ణించారు. ఓ టీవీ చానల్ ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. 'భారత్ రష్యా నుంచి రాయితీపై చమురు కొంటోంది. దాన్ని భారత రిఫైనరీలు రష్యా రిఫైనరీల భాగస్వామ్యంతో ఇతర దేశాలకు అధిక ధరకు విక్రయిస్తున్నాయి. రష్యా అలా వచ్చిన డబ్బును ఉక్రెయిన్‌పై యుద్ధానికి, ఉక్రెయిన్ ప్రజలను చంపడానికి వాడుతోంద'ని నవారో ఆరోపించారు. రష్యా నుంచి భారత్ చమురు కొనడం ఆపేస్తే.. మరుసటి రోజు నుంచే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలను 25 శాతానికి తగ్గిస్తారని చెప్పారు. కాగా, భారత్‌పై ట్రంప్ సుంకాల బాదుడును పలువురు విపక్ష డెమోక్రాట్లు ఖండించారు.

చైనాలో మోదీ కీలక భేటీలు!

» 31న జిన్‌పింగ్ 1న పుతిన్‌తో ద్వైపాక్షిక చర్చలు

న్యూఢిల్లీ, ఆగస్టు 28: జపాన్, చైనా దేశాల్లో పర్యటనకు ప్రధాని మోదీ గురువారం బయలుదేరి వెళ్లారు. తన పర్యటన జాతీయ ప్రయోజనాలకు విశేషంగా ఉపకరించగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. చైనాలోని టియాంజిన్‌లో జరిగే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సులో ఆయన పాల్గొంటారు. ఈ నెల 31న చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, సెప్టెంబరు 1న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో వేర్వేరుగా భేటీ కానున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలును నిలిపివేయాలని తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇందుకోసం భారతీయ ఎగుమతులపై ఏకపక్షంగా సుంకాలను రెట్టింపు పెంచడంపైనే ప్రధానంగా చర్చించనున్నారు.

గవర్నర్లు జడ్జిలు కాదు!

» బిల్లులపై న్యాయ సమీక్ష వాళ్ల పని కాదు

» తమిళనాడు తరఫున అభిషేక్ సింఘ్వీ వాదనలు

న్యూఢిల్లీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఆమోదించిన బిల్లు రాజ్యాంగబద్ధమా, కేంద్ర ప్రభుత్వ చట్టానికి విరుద్ధమా? అని చూడాల్సిన బాధ్యత గవర్నర్‌కులేదని తమిళనాడు ప్రభుత్వం వాదించింది. గవర్నర్ రాజ్యాంగ ప్రతినిధి మాత్రమేనని, ఆయన సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తికాదని స్పష్టం చేసింది. ఆ అధికారాలు న్యాయస్థానాలకు మాత్రమే పరిమితమని గుర్తు చేసింది. శాసనసభ పంపిన బిల్లును గవర్నర్ ఆపితే తిరిగి శాసనసభకు పంపాలని, నిర్ణయం తీసుకోకుండా తన దగ్గర పెట్టుకోవడం కుదరదని చెప్పింది. శాసనసభ ఆమోదించిన ద్రవ్య బిల్లులను ఆమోదించకుండా గవర్నర్ నిలిపివేస్తే ఆయన సూపర్ చీఫ్ మినిస్టర్‌గా వ్యవహరిస్తున్నారని భావించవచ్చునని గురువారం సుప్రీంకోర్టు ముందు వాదనల్లో పేర్కొంది. రాజ్యాంగంలోని 143 అధికరణ కింద రాష్ట్రపతి, గవర్నర్ అధికారాలపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సుప్రీం ముందు లేవనెత్తిన ప్రశ్నలపై రాజ్యాంగ ధర్మాసనం ముందు జరుగుతున్న విచారణలో భాగంగా తమిళనాడు తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ద్రవ్య బిల్లులను కూడా గవర్నర్ నిరాకరించవచ్చునని మహారాష్ట్ర ప్రభుత్వం తరఫున హరీష్ సాల్వే, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చేసిన వ్యాఖ్యలకు సింఘ్వీ సమాధానమిచ్చారు. బిల్లులపై తుది నిర్ణయం ఎన్నికైన ప్రజా ప్రభుత్వానిదికాకుండా గవర్నర్‌దేనని రాజ్యాంగంలో ఎక్కడ పేర్కొన్నారో చూపాలని అడిగారు. తెలంగాణ, ఏపీ, తమిళనాడులో చాలాకాలం నిలిపివేసిన పలు ఉదంతాలను ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. గవర్నర్ అధికారాలకు సంబంధించిన 207 అధికరణలో చెప్పిన అంశాలు ప్రైవేటు సభ్యుల మనీ బిల్లులకే వర్తిస్తుందని, వాటిని నివారించేందుకే ఈ అధికరణను చేర్చారని ఆయన తెలిపారు. ఇతర అన్ని రకాల బిల్లుల విషయంలో గవర్నర్ మంత్రివర్గ ఆమోదంమేరకే నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. గవర్నర్, రాష్ట్రపతి లాంఛనప్రాయ రాజ్యాంగ అధినేతలని, కొన్ని సందర్భాల్లో తప్ప ప్రభుత్వ నిర్ణయాల్లో జోక్యం చేసుకునే అధికారం వారికి లేదన్నారు. 200 అధికరణ ప్రకారం.. గవర్నర్ తొలుత ఆమోదాన్ని నిలిపివేసినప్పుడు శాసనసభకు మాత్రమే తిరిగి పంపాలని తెలిపారు. శాశ్వతంగా ఏ బిల్లు నూ నిలిపివేసే అధికారం గవర్నర్‌కులేదన్నారు. విచారణ క్రమంలో ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ గవాయి వ్యాఖ్యానిస్తూ..సాధ్యమైనంత త్వరలో అంటేనే వేగంగా నిర్ణయం తీసుకోవాలనే రాజ్యాంగ లక్షాన్ని అది స్పష్టీకరిస్తోందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రభుత్వానికి, గవర్నర్‌కు మధ్య ఏర్పడిన వివాదం కేసులోనూ ఉన్నత న్యాయస్థానం ఈ విషయాన్ని స్పష్టీకరించిందని గుర్తు చేశారు. నిరవధికంగా బిల్లును ఆమోదించకుండా నిలిపివేసే హక్కు గవర్నర్‌కు లేదన్నారు.

ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే.. ఎన్డీయేకు 324 సీట్లు!

» ఇండియా టుడే-సీ ఓటర్ సర్వే

» బిహార్ ఎన్డీయేదే: టైమ్స్ నౌ సర్వే

న్యూఢిల్లీ, ఆగస్టు 28: ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే బీజేపీ సారథ్యంలోని ఎన్డీయేకు 324 సీట్లు వస్తాయని ఇండియా టుడే-సీ ఓటర్ 'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వే అంచనా వేసింది. ఇందులో బీజేపీ 260 స్థానాలు సాధిస్తుందని పేర్కొంది. గత ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కంటే బీజేపీకి స్థానాలు పెరిగినా... వచ్చేసారీ సొంతంగా ప్రభుత్వ ఏర్పాటుకు కావలసిన బలం (272) దక్కదని తెలిపింది. ఇక కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష ఇండీ కూటమికి 208 సీట్లు మాత్రమే లభిస్తాయని పేర్కొంది. గత ఎన్నికల్లో మొత్తం 543కు బీజేపీ కేవలం 240 స్థానాలే గెలుచుకుంది. ఇది సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు కావాల్సిన 272 స్థానాల కంటే 32 తక్కువ. అయితే భాగస్వామ్య పక్షాలతో కలిపితే ఎన్డీయేకు 293 స్థానాలు వచ్చాయి. ఇండి కూటమి 234 స్థానాలు గెలుచుకున్న సంగతి తెలిసిందే. హరియాణా, మహారాష్ట్ర, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయాలతో ఎన్డీయే పుంజుకున్నట్లు సర్వే పేర్కొంది. ఈ సర్వేను జూలై 1, ఆగస్టు 14 మధ్య నిర్వహించారు. అన్ని లోక్‌సభ స్థానాల్లోని 54,788 మంది అభిప్రాయాలను సేకరించారు. ఇంకోవైపు.. త్వరలో జరిగే బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే విజయం తథ్యమని టైమ్స్ నౌ-జేవీసీ సర్వే అంచనా వేసింది. మొత్తం 243 స్థానాలకు ఎన్డీయే 136 స్థానాలు గెలుచుకుంటుందని పేర్కొంది. ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలతో కూడిన మహాగఠ్‌బంధన్ 75 స్థానాలకే పరిమితమవుతుందని తెలిపింది. ఆర్జేడీ 52, కాంగ్రెస్ 10 స్థానాలకు పరిమితమవుతాయని సర్వే అంచనా వేసింది. గత ఎన్నికలతో పోలిస్తే ఆర్జేడీకి 23, కాంగ్రెస్‌కు 9 సీట్లు తగ్గుతాయని పేర్కొంది.

నేను రిటైర్ కాను.. రిటైర్ కావాలని ఎవరికీ చెప్పలేదు

» బీజేపీతో సంఘర్షణే.. తగాదాల్లేవ్: ఆరెస్సెస్ చీఫ్ భాగవత్

న్యూఢిల్లీ, ఆగస్టు 28: రిటైర్మెంట్‌కు సంబంధించి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 75 ఏళ్ల వయసులో తాను రిటైర్ అవుతానని కానీ లేదా ఇంకెవరినైనా రిటైర్ కావాలని కాని తానెప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు. సంఘ్ కోరుకున్నంత కాలం పనిచేయాల్సిందేనని, అప్పజెప్పిన పని చేస్తూ ఉండాల్సిందేనన్నారు. ఆరెస్సెస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా న్యూఢిల్లీలో మీడియాతో గురువారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. జూలై 9న నాగ్‌పూర్‌లో జరిగిన ఓ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో రిటైర్‌మెంట్‌కు సంబంధించి మోహన్ భాగవత్ మాట్లాడుతూ.. 75ఏళ్ల వయసు వచ్చిన వారికి శాలువా కప్పుతున్నారంటే మీరు తప్పుకుని మరొకరికి అవకాశం ఇవ్వండని అర్థమని చెప్పారు. అయితే సంఘ్ సీనియర్ నేత మోరోపంత్ పింగ్లే గతంలో చేసిన వ్యాఖ్యలను తాను ఉదహరించానని భాగవత్ స్పష్టం చేశారు. నాడు ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రధాని మోదీని ఉద్దేశించి చేసినవేనని మీడియాలో కథనాలు రావడంతో కలకలం రేగింది. ఈ నేపథ్యంలోనే భాగవత్ స్పష్టతనిచ్చినట్లు తెలుస్తోంది. కాగా బీజేపీతో సంఘర్షణ ఉండొచ్చని, తగాదాలు మాత్రం లేవని మోహన్ భాగవత్ స్పష్టం చేశారు. సంఘ్ సలహాలు మాత్రమే ఇస్తుందని, ప్రభుత్వాన్ని నడపదని ఆయన చెప్పారు. అక్రమ చొరబాట్లు ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. బలవంతపు మతమార్పిళ్లు ఆగాలన్నారు. రిజర్వేషన్లకు సంఘ్ పూర్తి మద్దతునిస్తుందని, రిజర్వేషన్లు కొనసాగాలని చెప్పారు.

పిల్లల ఆధార్ బయోమెట్రిక్స్ అప్‌డేట్ చేయండి

» 5, 15 సంవత్సరాల వయస్సులో ఇది తప్పనిసరి

» లేకుంటే భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవు: ఉడాయ్ చీఫ్

న్యూఢిల్లీ, ఆగస్టు 28: దేశవ్యాప్తంగా పాఠశాల విద్యార్థుల ఆధార్ వేలిముద్రలను అప్‌డేట్ చేయాలని యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) విజ్ఞప్తి చేసింది. ఈమేరకు సంస్థ చీఫ్ భువనేశ్ కుమార్.. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు లేఖ రాశారు. పాఠశాలల్లో ప్రత్యేక క్యాంపులను నిర్వహించాలని ఆయన తన లేఖలో కోరారు. ఎదిగే పిల్లల బయోమెట్రిక్స్‌లో మార్పులు చోటుచేసుకుంటాయి. అందుకు అనుగుణంగా ఐదు నుంచి ఏడు సంవత్సరాల వయస్సులో, 15-17 సంవత్సరాల వయస్సులోనూ బయోమెట్రిక్స్‌ను అప్‌డేట్ చేయడం తప్పనిసరి(ఎంబీయూ). ఈ రెండు సందర్భాల్లోనూ ఈ సర్వీసు పూర్తి ఉచితం. ఆధార్ అప్‌డేట్ చేయకపోతే నీట్, జేఈఈ, సీయూఈటీ పరీక్షలకు హాజరయ్యే, ప్రభుత్వ పథకాలను అందుకునే విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశం ఉందని ఉడాయ్ చీఫ్ హెచ్చరించారు.

కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు వరదలు



పంజాబ్‌లోని కపుర్తల ప్రాంతం నుంచి వరద బాధితులను తరలిస్తున్న దృశ్యం

న్యూఢిల్లీ, ఆగస్టు 28: భారతావనిపై 'మేఘ విస్ఫోటం' జరిగిందా..? అన్నట్లు దేశవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. నదులు, జలాశయాలు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో.. పరీవాహకాలు, లోతట్టు ప్రాంతాలు, రహదారులు నీటమునిగాయి. ఉత్తరాన కశ్మీర్ నుంచి దక్షిణాన కన్యాకుమారి వరకు.. పశ్చిమాన రాణ్ ఆఫ్ కచ్ నుంచి తూర్పున దీఫూపాస్ వరకు అంతటా భారీ వర్షాలు, వరద బీభత్సం కొనసాగుతుండగా.. రాబోయే రోజుల్లోనూ మోస్తరు నుంచి భారీ, అతిభారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) హెచ్చరికలు జారీ చేసింది. జమ్మూకశ్మీర్‌లో వైష్ణోదేవి ఆలయానికి వెళ్లే భక్తులపై వర్షాలు, వరదలు తీవ్రంగా ప్రభావం చూపగా.. ఆ రాష్ట్రంలో 41 మరణాలు నమోదయ్యాయి. హిమాచల్‌లో మరణాల సంఖ్య 300 దాటిందని అధికారులు ప్రకటించారు. కులు నుంచి చండీగఢ్ వెళ్లే జాతీయ రహదారిపై కొండచరియలు విరిగిపడడంతో 50 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. బిహార్‌లోని పట్నాలో భారీ వర్షాలతో ప్రజలు అతలాకుతలమవ్వగా.. ఉత్తరప్రదేశ్‌లో వారాణసీలోని మణికర్ణికా ఘాట్ వద్ద మెట్లపై వరకు గంగానది ప్రవహిస్తోంది.

తెలంగాణలో కుంభవృష్టి.. వరద బీభత్సం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



కామారెడ్డిలో వరద ఉధృతితో కొట్టుకుపోయిన హైవే

ఆకాశానికి చిల్లుపడిందా అన్నట్టు.. కుంభవృష్టి! తెలంగాణలో చాలా జిల్లాల్లో మంగళవారం సాయంత్రం పట్టిన ముసురు.. విడవకుండా గురువారం సాయత్రం దాకా అలాగే ఉంది!! కామారెడ్డి, మెదక్, నిర్మల్, రాజన్న సిరిసిల్ల తదితర జిల్లాల్లో కుండపోతగా కురిసిన వానకు చెరువులు నిండి కట్టలు తెగాయి. కల్వర్టులు కొట్టుకుపోయాయి. ఊళ్లకు ఊళ్లే జలదిగ్బంధమయ్యాయి. రహదారులు ధ్వంసమై వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో గంటలకొద్దీ ట్రాఫిక్ స్తంభించిపోయింది. పదుల సంఖ్యలో గ్రామాల్లో విద్యుత్ నిలిచిపోయి అంధకారం అలముకుంది. ముఖ్యంగా.. కామారెడ్డి జిల్లాను భారీ వర్షాలు, వరదలు అతలకుతలం చేశాయి. రాజంపేట మండలం ఆర్గొండలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు కేవలం 6 గంటల్లోనే 36.8 సెంమీల వర్షపాతం నమోదైంది. కామారెడ్డిలోని పెద్ద చెరువు ఉధృతంగా ప్రవహించడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. జిల్లా యంత్రాంగం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దింపి వరదల్లో చిక్కుకున్న 1071 మందిని కాపాడింది. తిప్పాపూర్- రామేశ్వర్‌పల్లి మధ్యలోని రైల్వే మార్గం వరదల తాకిడికి ట్రాక్ కొట్టుకుపోవడంతో రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. కొన్ని రైళ్లను దారి మళ్లించారు. మెదక్‌జిల్లాలో 48 గంటల వ్యవధిలో 55 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ర్మల్ మండలంలో అత్యధికంగా 33.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

అమెరికాలో మరో 'మ్యాచింగ్' స్కామ్

ఆస్టిన్ సాయిబాబా గుడిలో నిధుల గోల్‌మాల్.. రూ.17 కోట్లు తినేసిన ఆలయ పాలకవర్గం

- మ్యాచింగ్ గ్రాంట్ నిధులు డొల్ల కంపెనీలకు బదిలీ
- కుట్రలో ఇద్దరు ప్రవాసాంధ్రుల హస్తం
- 2010లో ఆంగ్ల జంట ఆధ్వర్యంలో గుడి ప్రారంభం
- కుంభకోణంతో ఉద్యోగాలు కోల్పోయిన 120 మంది భక్తులు
- బాధితుల్లో యాపిల్, వీసా, డెల్ కంపెనీల ఉద్యోగులు
- భారీగా నష్టపోయిన ప్రవాసాంధ్రుల కుటుంబాలు
- ఆర్థిక అవకతవకలపై రంగంలోకి ఫెడరల్ సంస్థలు

(డల్లాస్ నుంచి కిలారు గోకుల్‌కృష్ణ)

అమెరికాలో మరోసారి కార్పొరేట్ మ్యాచింగ్ గ్రాంట్ నిధుల అవకతవకలకు ప్రవాసాంధ్రులు బలయ్యారు. ఇప్పటి వరకు తెలుగు సంఘాలకే పరిమితమైన ఈ కుంభకోణం, ఇప్పుడు ఆలయాల్లో సైతం జరగడం గమనార్హం. తాజాగా టెక్సాస్ రాష్ట్రం ఆస్టిన్ సమీపంలోని సీడర్ పార్కులో గల శ్రీ షిర్డి సాయిబాబా టెంపుల్ ఆఫ్ ఆస్టిన్ (ఎస్ఎస్‌బీటీ)లో సుమారు రూ.17 కోట్లను కార్పొరేట్ మ్యాచింగ్ గ్రాంట్ పథకం ద్వారా సేకరించిన బోర్డు సభ్యులు.. సరైన ఆమోదం లేకుండా స్వలాభానికి వినియోగించుకున్నారు. ఈ సొమ్ములను రికవరీ చేసి కార్పొరేట్ సంస్థలకు తిరిగి చెల్లించాలని ప్రస్తుత కార్యవర్గం ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. మ్యాచింగ్ గ్రాంట్ నిధులను స్వలాభానికి వాడుకోవడమే గాక, డొల్ల కంపెనీలు ఏర్పాటు చేసి.. భక్తులు ఇచ్చిన విరాళాలను దారి మళ్లించారనే అభియోగాలపై దర్యాప్తు సంస్థలు దృష్టి సారించాయి.

కుంభకోణం బయటపడిందిలా..

2007లో హవాయి నుంచి ఆస్టిన్ వచ్చిన జిల్ ఎడ్వర్డ్స్, క్రెయిగ్ ఎడ్వర్డ్స్ దంపతులు సీడర్ పార్కులో 5 ఎకరాల భూమిని కొనుగోలు చేసి 2010లో బాబా ఆలయాన్ని ప్రారంభించారు. నాన్-మెంబర్ సంస్థగా మొదలైన ఈ ఆలయానికి క్రెయిగ్ చైర్మన్‌గా, జిల్ కార్యదర్శిగా వ్యవహరించారు. నాన్-మెంబర్ సంస్థ అయినప్పటికీ మెంబర్ సంస్థ రీతిలో ఒక్కో కుటుంబం నుంచి 10-20 వేల డాలర్లు వసూలు చేసి, సభ్యులను చేర్చుకున్నారు. అలా 150 మందిని ట్రస్టీలుగా ఏర్పాటు చేసుకున్నారు. 2010-14 మధ్య కాలంలో జిల్-క్రెయిగ్ దంపతులు ఆలయాన్ని తమ కనుసన్నల్లో నడిపించారు. వీరికి బాలాజీ, కిషోర్ అనే ఇద్దరు ప్రవాసాంధ్రులు సహకరించారు. వీరంతా కలిసి ఆలయ బోర్డుగా ఏర్పడి మ్యాచింగ్ గ్రాంట్స్ కుంభకోణానికి పాల్పడ్డారు. ఆలయ ప్రాంగణంలో 2015లో శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించాలని సంకల్పించారు. క్రెయిగ్ మృతితో ఇద్దరు ప్రవాసాంధ్రులు జిల్‌తో చేతులు కలిపి 2016 నుంచి మ్యాచింగ్ గ్రాంట్ల పథకం ద్వారా అడ్డదారిలో నిధులు పోగేసుకునేందుకు భక్తులను పావులుగా వాడుకున్నారు. ఆలయంలో వాలంటీరుగా పనిచేసే ఒక భక్తుడిని ఈ కార్యవర్గం మ్యాచింగ్ గ్రాంట్ల ద్వారా నిధులు తేవాలని కోరింది. ఆ భక్తుడు యాపిల్ సంస్థలో తనకిచ్చిన షేర్లలో కొన్నింటిని విక్రయించగా వచ్చిన 40 వేల డాలర్లతో పాటు తన ముగ్గురు సహోద్యోగుల ద్వారా మరో 80 వేల డాలర్లను కలిపి 1.20 లక్షల డాలర్ల మ్యాచింగ్ గ్రాంట్లను ఆలయ ఖాతాలో జమ చేశారు. అయినప్పటికీ ఆ భక్తుడికి తన మూలధనం 40 వేల డాలర్లు చెల్లించడానికి కూడా అప్పటి ఆలయ బోర్డు ఇబ్బంది పెట్టినట్లు సమాచారం. ఈ వ్యవహారం బయటకు రావడంతో ఆ నలుగురు యాపిల్‌లో ఉద్యోగాలు కోల్పోయారు. ఇలాగే మ్యాచింగ్ గ్రాంట్ల అవకతవకలకు పాల్పడిన 20 మందికి పైగా యాపిల్‌లో ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడ్డారు. వీసా సంస్థలో సీనియర్ డైరెక్టర్‌గా ఉన్న మరో వ్యక్తి ఇలాగే నిధుల సేకరణ జరిపి, ఆ వివరాలను సంస్థ అంతర్గత బృందాల్లో చాటింగ్ చేస్తూ పట్టుబడ్డాడు. అతని కారణంగా మరో 100 మందకిపైగా ఉద్యోగాలు కోల్పోయారని స్థానికులు చెబుతున్నారు. మొత్తంమీద 120 మంది ప్రవాసాంధ్రుల కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ సంఖ్య ఇంకా ఎక్కువగా ఉండే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. యాపిల్, వీసాతో పాటు డెల్ సంస్థ ఉద్యోగులు కూడా బాధితుల్లో ఉన్నట్లు చెబుతున్నారు. అక్రమంగా సేకరించిన రూ.17 కోట్లను అప్పటి కార్యవర్గం తమ అద్దెలు చెల్లించడానికి వాడారని, ఇండియాకు మనీ లాండరింగ్ చేశారని, డొల్ల కంపెనీ అయిన సాయి చారిటీస్‌కు బదలాయించారని అభియోగాలు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత కార్యవర్గం చేపట్టిన ఫోరెన్సిక్ ఆడిట్‌లో ఈ బాగోతం అంతా బయటపడింది. 40 వేల డాలర్లు కోల్పోయిన వ్యక్తి తన బాధను వెలిబుచ్చుతూ 2023 నవంబరులో ఆలయ ట్రస్టీలకు మెయిల్ పంపాడు. అప్పటి వరకు నాన్-మెంబర్ సంస్థ అనే భావనలో ఉన్న భక్తులు మెంబర్ సంస్థ పద్ధతిలో డబ్బులు సేకరించి ట్రస్టీలను ఏర్పాటు చేసినట్లు తెలుసుకొని, ఆలయ నాయకత్వంలో మార్పు కోసం తిరగబడ్డారు. చేసేది లేక శ్వేత జాతీయురాలితో పాటు ఇద్దరు ప్రవాసాంధ్రులు, వారి కుటుంబ సభ్యులు రాజీనామా చేశారు. అనంతరం కొత్త కార్యవర్గం జరిపిన ఫోరెన్సిక్ ఆడిట్‌లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆలయంలో పనిచేసేందుకు భారత్ నుంచి ఒక పూజారిని ఆర్1 వీసా మీద తీసుకొచ్చి, అతని జీతభత్యాల చెల్లింపుల పేరిట కూడా అవినీతికి పాల్పడినట్లు గుర్తించారు. అసలు అలాంటి అర్చకుడు ఆలయంలో ఎక్కడున్నాడని నూతన కార్యవర్గం ప్రశ్నించగా.. అతని చిరునామా కాలిఫోర్నియాలో ఉందని, బాధ్యతలను రిమోట్‌గా నిర్వహిస్తాడంటూ పాత కార్యవర్గం చెప్పడంతో అవాక్కయ్యారు. ఇదేగాక హుండీలో వచ్చే నగదును సైతం బ్యాంకులో సరిగ్గా జమ చేయలేదని, ఖర్చుల వివరాలు సరిగ్గా చూపలేదని, పొంతన లేని లావాదేవీలు జరిగాయని ఫోరెన్సిక్ ఆడిట్ నివేదికలో తేలింది.

ఆస్టిన్‌ను వీడిన జిల్..

క్రెయిగ్ మృతి తర్వాత జిల్ రెండో పెళ్లి చేసుకుంది. నూతన కార్యవర్గం 2024 అక్టోబరులో సమగ్ర దర్యాప్తును ప్రారంభించింది. 2025 జనవరిలో డొల్ల కంపెనీలను మూసేసిన జిల్.. ఆస్టిన్ నుంచి వెళ్లిపోయింది. ప్రస్తుతం ఫెడరల్ సంస్థలు ఆలయంలో జరిగిన ఆర్థిక అవకతవకలపై దర్యాప్తు చేస్తున్నాయి. ప్రస్తుత బోర్డు చైర్మన్, కోశాధికారి ఆయా సంస్థలతో కలిసి పనిచేస్తున్నారు.

మ్యాచింగ్ గ్రాంట్స్ అంటే..?

సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా అమెరికాలోని పెద్ద కంపెనీలు తమ ఉద్యోగులు విరాళం ఇచ్చే ప్రతి డాలరుకు వాటి అంతర్గత విధివిధానాలను అనుసరించి రెండింతలు జోడిస్తాయి. అంటే ఉద్యోగి 100 డాలర్లు ఇస్తే.. కంపెనీ 200 డాలర్లు ఇస్తుంది. మొత్తం 300 డాలర్లనూ సేవా కార్యక్రమాలకు వెచ్చించాలి.

ఆ విగ్రహాలను 4 వారాలపాటు ప్రారంభించవద్దు

పూర్తి వివరాలతో కౌంటర్ వేయండి.. హార్టికల్చరల్ వర్సిటీ అధికారులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చరల్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన రైతు దంపతుల విగ్రహాలను నాలుగు వారాల వరకు ప్రారంభించవద్దని వర్సిటీ అధికారులను హైకోర్టు ఆదేశించింది. వైఎస్ రాజశేఖరెడ్డి విగ్రహం ఏర్పాటు చేయడం లేదనే ఆరోపణలపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్, బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లను ఆదేశించింది. విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి గురువారం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చరల్ యూనివర్సిటీలో ధ్యాన ముద్రలో ఉన్న మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని మార్చుకోవడాన్ని సవాల్ చేస్తూ వైసీపీ నేత కొట్టు సత్యనారాయణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విగ్రహం ఏర్పాటుకు అధికారులు తన వద్ద నుండి రూ.4 లక్షలు డొనేషన్ స్వీకరించారని పిటిషన్‌లో పేర్కొన్నారు. గురువారం వ్యాజ్యం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది సి.సుమన్ వాదనలు వినిపించారు. వైఎస్ రాజశేఖరెడ్డి విగ్రహం ఏర్పాటు చేయాలని విశ్వవిద్యాలయం తీర్మానం చేసిందన్నారు. శిల్పికి యూనివర్సిటీ నుండి అడ్వాన్స్ కూడా ఇచ్చారన్నారు. రాజశేఖర్‌రెడ్డి విగ్రహం స్థానంలో మరో రెండు విగ్రహాలు ఏర్పాటు చేశారని, ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. వర్సిటీ తరఫు స్టాండింగ్ కౌన్సిల్ వాదనలు వినిపిస్తూ... ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ వేస్తామన్నారు. అందుకు సమయం ఇవ్వాలని కోరారు. ఇరువైపుల వాదనలు పరిగణనలో తీసుకున్న న్యాయమూర్తి కౌంటర్ వేసేందుకు సమయం ఇస్తూ... యూనివర్సిటీలో ఇప్పటికే ఏర్పాటు చేసిన విగ్రహాలను నాలుగు వారాలపాటు ప్రారంభించవద్దని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు.



శ్రీవారి ఆలయ ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న సీపీ రాధాకృష్ణన్

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

- సీపీ రాధాకృష్ణన్
- శ్రీవారిని దర్శించుకున్న ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థి

తిరుమల, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత వైపు నడవాలని, దాంతో మనసు ప్రశాంతంగా ఉండటంతో పాటు అన్ని లక్ష్యాలను చేరుకోగలమని మహారాష్ట్ర గవర్నర్, ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ అన్నా రు. తిరుమల శ్రీవారిని గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో దర్శించుకున్న ఆయనకు రంగనాయక మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేశారు.


డిగ్రీ అడ్మిషన్లపై సమాచారం లేదు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ వివరణ

అమరావతి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): బీబీఏ, బీసీఏ కోర్సులు అందించే అన్ని కాలేజీల అనుమతుల వివరాలను ఉన్నత విద్యామండలికి పంపినట్టు సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ జి.గణేష్‌కుమార్ వెల్లడించారు. తొలుత 293 కాలేజీల వివరాలను ఈ నెల 19న పంపించామని, ఇప్పుడు మరో 105 కాలేజీల వివరాలు పంపామన్నారు. అయితే వాటిలో 48 కాలేజీలకు యూనివర్సిటీల అఫిలియేషన్లు లేవని పేర్కొన్నారు. 'ఇంజనీరింగ్ కాలేజీల్లో నో డిగ్రీ' శీర్షికతో మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. సకాలంలో ఉన్నత విద్యామండలికి వివరాలు పంపలేదనడం సరికాదని, వాస్తవానికి అడ్మిషన్ల నోటిఫికేషన్, షెడ్యూలుపై తమకు సమాచారమే లేదని వివరించారు. రెండు విడతల్లో అన్ని కాలేజీల సమాచారం మండలికి పంపామన్నారు. కాగా ఉన్నత విద్యాశాఖలో తలెత్తిన సమన్వయలోపంతో మొదట విద్యార్థులకు అన్ని కాలేజీలు కనిపించలేదు. 105 కాలేజీలకు రెండో విడతలో పంపినట్టు సాంకేతిక విద్యా శాఖే చెబుతోంది. అంతకంటే ముందే డిగ్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీ అయ్యింది. అయితే బీబీఏ, బీసీఏ కోర్సులకు అనుమతులను ఏఐసీటీఈ పరిధిలోకి తీసుకురావడంతో ఈ సమస్య తలెత్తుతోంది.

పుచ్చలపల్లి మేనల్లుడు చంద్రశేఖర్‌రెడ్డి ఆత్మహత్య

- ఖమ్మంలో రైలు కింద పడి బలవన్మరణం



చంద్రశేఖర్‌రెడ్డి

ఖమ్మం క్రైం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం వ్యవస్థాపక నేత, దివంగత పుచ్చలపల్లి సుందరయ్య మేనల్లుడు నెల్లూరుకు చెందిన దువ్వూరు చంద్రశేఖరరెడ్డి(77) బలవన్మరణానికి పాల్పడ్డారు. బుధవారం తెల్లవారుజామున ఖమ్మం రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. ఒంటరితనమే ఆయన ఆత్మహత్యకు కారణంగా తెలుస్తోంది. చంద్రశేఖర్‌రెడ్డి భార్య 25 ఏళ్ల క్రితం మరణించారు. వారి ఇద్దరు కుమార్తెలు అమెరికాలో స్థిరపడ్డారు. కొన్నేళ్ల క్రితం కూతుళ్ల వద్ద ఉన్న చంద్రశేఖర్‌రెడ్డి స్వదేశానికి తిరిగొచ్చారు. కొంతకాలం నెల్లూరులోని తన నివాసంలో ఉన్న ఆయన.. ఆ ఇంటిని అమ్మి హైదరాబాద్‌లోని ఓ వృద్ధాశ్రమంలో చేరారు. 15 రోజుల క్రితం వృద్ధాశ్రమాన్ని ఖాళీ చేశారు. కాశీ పర్యటన ముగించుకుని నెల్లూరు వెళుతున్నానని తనకు మనుమడు వరసయ్యే వ్యక్తికి మంగళవారం తెలిపారు. ఆ రాత్రి ఖమ్మం రైల్వేస్టేషన్‌లో దిగిన ఆయన స్టేషన్ సమీపంలో గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సుంకాల సమరం

భారత్-అమెరికా సంబంధాలు ఇలా ఉప్పూనిప్పూలాగా తయారవుతాయని అర్నెల్లక్రితం కూడా ఎవరూ ఊహించలేదు. మలివిడత ఆగమనంలో ట్రంప్ ఎలా వ్యవహరిస్తారన్న అనుమానాలు లేకపోలేదు కానీ, మోదీ–ట్రంప్ మధ్య వ్యవహారం మరీ ఇంత చెడుతుందని అనుకోలేదు. తొలివిడతలో మాదిరిగానే ట్రంప్ అండదండలు బేషరతుగా ఉంటాయన్న నమ్మకంతో పాక్‌మీదకు కాలుదువ్వడం సుంకాల సమరాన్ని మరింతరాజేసిందని మోదీ వ్యతిరేకశక్తుల వాదన. యుద్ధాన్ని నేనే ఆపానని ముప్పైసార్లు ట్రంప్ చెప్పుకున్నా, పాకిస్థాన్ మాదిరిగా ప్రత్యక్షంగా సాగిలబడకున్నా, పరోక్షంగానైనా తలూపివుంటే ఆ సమరవీరుడు శాంతించి ఉండేవాడని విశ్లేషకుల నమ్మకం. భారతప్రభుత్వం ఏ మాత్రం ప్రతిస్పందించకుండా కొన్నాళ్ళు, ఎవరి ఒత్తిళ్ళూ ఫోన్లూ లేవంటూ మరికొన్నాళ్ళు, అమెరికా ఉపాధ్యక్షుడు ఫోన్ చేస్తే గట్టిగా జవాబు ఇచ్చామంటూ దేశీయంగా ఆ తరువాత ఇచ్చిన వివరణలూ కలగలసి ట్రంప్‌కు ఆరని ఆగ్రహం కలిగించాయని వారి వాదన. మోదీ మాజీ మిత్రుడు ఆఖరునిముషంలో దిగివచ్చి, అదనపు పాతికశాతం సుంకాల విషయంలో సడలింపులు ఇస్తాడనుకున్నవారి ఆశ చివరకు నిరాశే అయింది.

ఆగస్టు 25న రావాల్సిన అమెరికా వాణిజ్య చర్చల బృందం తన పర్యటన రద్దుచేసుకోవడం ప్రతిష్ఠంభన తీవ్రంగా ఉందనడానికి సంకేతం. ఉక్రెయిన్ యుద్ధం ఆగాలంటే, రష్యానుంచి చమురుకొని అగ్నికీలలను రాజేస్తున్న భారత్‌ను శిక్షించాలన్న వాదనకు అనుగుణంగానే అమెరికా పాలకులూ, అధికారుల వ్యాఖ్యలున్నాయి. చవుకగా రష్యన్ క్రూడ్ కొని, శుద్ధిచేసి, ఎగుమతి చేస్తూ భారతదేశంలోని కొన్ని కులీన కుటుంబాలు విపరీతంగా బాగుపడ్డాయని, భారత్ వందలకోట్లు లబ్ధిపొందిందని అమెరికా విమర్శిస్తున్నది. అమెరికా అధ్యక్షుడి వాణిజ్య సలహాదారు ఇప్పుడు ఏకంగా ఉక్రెయిన్ యుద్ధాన్ని మోదీ యుద్ధంగా అభివర్ణించేంతవరకూ పోయారు.

ఎవరి బరిలో వారున్నారు. గీతలు చెరగనిదే, రాజీకి రానిదే, చేయి కలవనిదే సుంకాల యుద్ధం ఆగదు. ఎవరూ రాజీపడే సూచనలు కనిపించడం లేదు. రష్యా క్రూడ్ కొనుగోళ్ళు మరింతగా సాగుతూ అక్టోబర్ ఆర్డర్లు కూడా వెళ్ళాయి. మరో ఐదేళ్ళలో ఆ దేశంతో రెట్టింపు వాణిజ్యం చేయాలని కూడా భారత్ నిర్ణయించుకుంది. రష్యాతో అనాదిగా ఉన్న స్నేహం పునాదిగా అది మనకు ఈ కష్టకాలంలో అండగా నిలుస్తున్నది. నిన్నటిదాకా శత్రువులాగా వ్యవహరించిన చైనా సైతం ఈ సంక్షోభంలో మనకు ఊహకందనంత వేగంగా సన్నిహితమైంది. ఈ రెండుదేశాలతో జరుగుతున్న చర్చలు, సాగుతున్న రాకపోకలు, అత్యున్నతస్థాయి భేటీలు ఎంతో భరోసానిస్తున్నాయి. ప్రధాని నరేంద్రమోదీ ధైర్యవచనాలు పలుకుతున్నారు. అమెరికా నుంచి ఎంత ఒత్తిడివచ్చినా తగ్గేది లేదనీ, లొంగేది లేదనీ, మరింత బలోపేతమవుతామని, రైతులు, చిరువ్యాపారులకు నష్టం రానివ్వబోమని మోదీ హామీ ఇస్తున్నారు. ఆయన నోటివెంట మళ్ళీ స్వదేశీ, ఆత్మనిర్భరత ఇత్యాదిమాటలు వింటున్నాం. ఎగుమతులకోసం కొత్త ద్వారాలు తెరుచుకుంటాయనీ, అమెరికా స్థానంలో మనలను ఎవరెవరో ఆదుకుంటారని హామీలు వింటున్నప్పటికీ, ట్రంప్ సుంకాల ప్రభావం లక్షలాదిమందికి ఉపాధికల్పిస్తున్న కీలకరంగాలమీద కనిపించడం ఆరంభమైంది.

భారత్ కంటే భారీగా రష్యన్ క్రూడ్ కొంటున్న చైనాను వదిలేసి, మనమీద ట్రంప్ విరుచుకుపడటం వెనుక చమురు ఒక్కటే కాక అనేక కారణాలు ఉండవచ్చు. పాతికశాతం చమురుసుంకం అమలులోకి వస్తున్నతరుణంలోనే, ట్రంప్ మరోమారు భారత్–పాక్ యుద్ధం గురించి ప్రస్తావించి, తాను ఇచ్చిన గడువుకంటే బాగాముందే ఐదు గంటల్లోనే యుద్ధం ఆగిపోయిందంటూ ఓ వ్యాఖ్యచేశారు. ఆయన నోబెల్‌శాంతి ఆకాంక్షను పరోక్షంగానైనా బలపరచడంతోపాటు, వాణిజ్య ఒప్పందానికి కూడా మార్గం సుగమం చేసివుంటే ఇంత వీరంగం ఉండేది కాదేమో. ఉభయదేశాలకూ పరస్పరప్రయోజనకారిగా ఉన్న వాణిజ్యాన్ని ట్రంప్ తన దుందుడుకుతనంతో ప్రమాదంలోకి నెట్టేశారు. ఆయన 'మాగా' (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్) మన 'మిగా' కలసి 'మెగా' అవుతుందని మోదీ కూడా ఒక దశలో ఆశపడ్డారు. మన సంకల్పబలం మెచ్చదగిందే కానీ, ట్రంప్ రక్షణాత్మక చర్యలు ఇంకెన్ని రంగాలకు విస్తరిస్తాయనే భయం తప్పడం లేదు.

జీవ ద్రవ్యాలతో విద్యుత్ ఉత్పత్తి

మట్టివాసన



■ సునీతా నారాయణ్

ఒక పక్క భయానకమవుతోన్న వాతావరణ మార్పు, మరో పక్క అభివృద్ధి చెందుతున్న దేశాలలో గృహావసరాలకు, ఫ్యాక్టరీలకు, దుకాణాలకు విద్యుత్ శక్తిని సమృద్ధిగా సమకూర్చవలసిన తక్షణ అవసరం... ఈ రెండు సవాళ్ల దృష్ట్యా విద్యుదుత్పాదనకు బొగ్గును వాడుకోవాలా లేక మానివేయాలా అన్నది జిలియన్ (పరిమితి లేని అనిర్దిష్ట సంఖ్య) డాలర్ల ప్రశ్న. ఉష్ణోగ్రతల పెరుగుదలను 1.5 డిగ్రీ సెల్సియస్ కంటే తక్కువగా ఉంచడంలో ప్రపంచ దేశాలు విఫలమవుతున్నాయి. సమస్త మానవాళి శ్రేయస్సుకు దోహదం చేసే విధంగా వాతావరణ మార్పు సమస్యను పరిష్కరించుకోవలసిన అవసరమున్నది. ఇదిగో ఇక్కడే విద్యుదుత్పత్తికి బొగ్గును ఉపయోగించుకోవాలా అన్న ప్రశ్న మరింత సంక్లిష్టమవుతోంది. బొగ్గును భూగర్భంలోనే ఉండనివ్వండి– విద్యుదుత్పత్తికి బొగ్గును ఉపయోగించ వద్దు అని చెప్పడం తేలికే. ఇప్పటికే ధరిత్రి వాతావరణాన్ని నిండుగా కమ్మివేసిన హరిత గృహవాయువుల ఉద్గారాలకు బొగ్గు ఆధారిత ఉత్పత్తి ప్రక్రియలే అత్యధికంగా కారణమని భావిస్తున్నందున బొగ్గు వాడకాన్ని నిలిపివేయాలనే మాట గట్టిగా వినిపిస్తోంది. అయితే ఇంధన అవసరాలు తగినంతగా చేకూరని దేశాలు అనేకం ఉండగా వాతావరణ మార్పు సమస్యకు అటువంటి పరిష్కారం ఎలా సాధ్యమవుతుంది?

మరి ఇంధన కొరతను తీవ్రంగా ఎదుర్కొంటున్న భారత్ లాంటి దేశాలు ఏమి చేయాలి? సరసమైన అభివృద్ధి సాధన అనే వాటి స్వప్నం ఎలా ఫలిస్తుంది? బొగ్గు ఆధారిత ఉత్పత్తి పద్ధతులను పూర్తిగా త్యజించాలా? లేక పాత, కొత్త ఇంధన వనరులను సమతుల్యంగా ఉపయోగించుకోవాలా? కాలుష్యరహిత అభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది? విద్యుదుత్పత్తిలో బొగ్గు వినియోగాన్ని క్రమంగా తగ్గించడమే లక్ష్యంగా ఉన్న భారత ప్రభుత్వ ఇంధన పరివర్తన ప్రణాళికే సమస్య పరిష్కారానికి సరైన మార్గాంతరమని నేను మొదటి నుంచీ వాదిస్తూ వస్తున్నాను. వాస్తవమేమిటంటే మన ఇంధన అవసరాలు 2030 సంవత్సరం నాటికి రెట్టింపు అవనున్నాయి. జీవనోపాధుల రక్షణకు, ఆరోగ్య భద్రత అవసరాలకు విద్యుదుత్పత్తి సమృద్ధిగా జరగడం తప్పనిసరి. పెరిగిన ఇంధన అవసరాలను ప్రాథమికంగా పవన, సౌరశక్తితో తీర్చుకునే వెసులుబాటు ఉన్నది. ఈ విధంగా 2030 నాటికి బొగ్గు, మన విద్యుత్ అవసరాలను 70 నుంచి 75 శాతం కాకుండా కేవలం 50 శాతాన్ని మాత్రమే తీర్చగలుగుతుంది.

బొగ్గు ఆధారిత విద్యుదుత్పాదన రంగం నుంచి హరిత గృహవాయువు ఉద్గారాల తగ్గింపునకు మనం ఏమి చేయాలో చర్చిద్దాం. బొగ్గు త్వరలోనే చరిత్ర చెత్తబుట్టలోకి చేరుతుందని సర్వత్రా విశ్వసిస్తున్న దృష్ట్యా ఆ శిలాజ ఇంధనంపై చర్చ నిషిద్ధ విషయమని నాకు తెలుసు. అయితే వాస్తవాల ప్రాతిపదికన మనం ఆలోచిద్దాం. అన్ని రంగాలలోను హరిత గృహవాయు ఉద్గారాలను తగ్గించవలసిన అవసరమున్నది. మనకు ఆరోగ్య సమస్యలను సృష్టిస్తున్న విషకారక వాయు ఉద్గారాలను తగ్గించుకున్నప్పుడే మనకు స్థానికంగా వాయు నిర్మలత సమకూరుతుంది. అదే సమయంలో ప్రపంచ వాతావరణ పరిరక్షణ ప్రయోజనాలను కూడా దృష్టిలో ఉంచుకుని మనం వ్యవహరించాలి. ఆరోగ్య సవాళ్లు ప్రపంచ ప్రయోజనాలు రెండిటికీ దోహదం చేసే వ్యూహాలను మనం రూపొందించుకోగలిగితే మనకు ఆ రెండు అంశాలలోను సమ విజయం సమకూరుతుంది.



థర్మల్ విద్యుత్కేంద్రాల నుంచి కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు బొగ్గు వినియోగాన్ని క్రమంగా తగ్గించడంతో పాటు జీవద్రవ్యాన్ని (వృక్షాలు, జంతువుల నుంచి సమకూరిన సేంద్రియ పదార్థాలు) ముడి పదార్థంగా ఉపయోగించాలి. 20 శాతం మేరకు జీవద్రవ్యాన్ని ఉపయోగించుకుంటే కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాలు గణనీయంగా తగ్గిపోతాయి.

'Decarbonizing the Coal based Thermal Power Sector in India : A Roadmap' అన్న నివేదికలో నా సహచరులు ఇదే ప్రతిపాదన చేశారు. థర్మల్ విద్యుత్కేంద్రాల డీ కార్బొనైజింగ్ చేసే వ్యూహాన్ని అనుసరించేందుకు దేశం నిర్ణయం తీసుకుంటే ఉక్కు, సిమెంట్ పరిశ్రమల కర్బన ఉద్గారాలతో సమస్థాయిలో థర్మల్ విద్యుత్కేంద్రాల కర్బన ఉద్గారాలు తగ్గిపోతాయి. తగ్గింపును విధిగా పరిగణనలోకి తీసుకోవాలి. తగ్గింపుపై దృష్టి పెట్టాలి.

ఈ మార్గదర్శక ప్రణాళికలో మొదటి అడుగు ప్రస్తుతమున్న విద్యుత్కేంద్రాలను, ఆ తరహా పరిశ్రమలలోని ఉత్తమ ప్లాంట్ల ఉత్పాదక సామర్థ్యంతో సమంగా విద్యుదుత్పాదన చేసేలా మెరుగుపరచాల్సిన అవసరమున్నది. ఉదాహరణకు సబ్ క్రిటికల్ టెక్నాలజీ ఆధారిత విద్యుత్కేంద్రాలలో అగ్రశ్రేణివి అయిన టాటా పవర్ ట్రాంబే యూనిట్ లేదా తెలంగాణ లోని కొత్తగూడెం విద్యుత్కేంద్రం ఉద్గారాల స్థాయికి సమ రీతిలో తమ ఉద్గారాలనూ తగ్గించుకోవాలి. దీనివల్ల ఉద్గారాల పరిమాణం మొత్తంగా తగ్గిపోతుంది.

చేపట్టవలసిన రెండో చర్య బొగ్గు స్థానంలో జీవద్రవ్యాన్ని (వృక్షాలు, జంతువుల నుంచి సమకూరిన సేంద్రియ పదార్థాలు) ముడి పదార్థంగా ఉపయోగించడం. మా ప్రతిపాదన ఏమిటంటే ప్రతి థర్మల్ విద్యుత్కేంద్రమూ 20 శాతం జీవద్రవ్యాన్ని ఉపయోగించుకోవాలి. దీనివల్ల కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాలు గణనీయంగా తగ్గిపోతాయి.

అయితే వీటన్నిటికీ ఒక ప్రణాళిక అవసరం. ఇందుకు ఉద్గారాల తగ్గింపునకు లక్ష్యాలు నిర్దేశించి, వాటి పరిపూర్తికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం అవసరం. ఉదాహరణకు ప్రస్తుత ప్రభుత్వ ప్రణాళిక అత్యాధునిక బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తి కేంద్రాలకు ప్రాధాన్యమిస్తోంది. ఇవి నిస్సందేహంగా పాత సాంకేతికతల కంటే మరింత సమర్థమైనవి. అయితే విధానపరంగా సరైన ప్రోత్సాహకాలు లేకపోవడంతో ఈ అత్యాధునిక ఉత్పత్తి కేంద్రాలలో నలభై శాతం, 50 శాతం కంటే తక్కువ ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ కన్నా తక్కువగా పని చేస్తున్నాయి. అంటే ఉద్గారాలు పాత సాంకేతికతతో నడిచే ప్లాంట్లలో కంటే అధికంగా విడుదలవుతున్నాయి. పాత విద్యుత్కేంద్రాలలో విద్యుదుత్పాదన ఉత్పత్తి వ్యయం తక్కువ. పెట్టుబడి వ్యయాలూ తక్కువ. సాంకేతికతల, ప్లాంట్ల నిర్వహణకు అవసరమైన పెట్టుబడులూ తక్కువే. ఈ కారణంగానే బొగ్గు ఇప్పటికీ విద్యుదుత్పాదనకు అనివార్యంగా ప్రధాన అవసరంగా ఉన్నది. దానిని తొలగించాల్సిన అవసరమున్నది. అది సుసాధ్యమే.

(సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

డబ్బు ఆడిస్తున్న ఇండో-పాక్ క్రికెట్!

దీపశిఖ





■ రాజ్‌దీప్ సర్దేశాయి

'రక్తమూ, నీరూ కలిసి ప్రవహించవు' అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హెచ్చరించారు. పహల్గాం ఉగ్ర దాడి వెన్వెంటనే ఆరు దశాబ్దాల సింధు నదీజలాల ఒప్పందాన్ని నిలిపివేస్తూ పాకిస్థాన్‌కు చేసిన హెచ్చరిక అది. రక్తం నీటితో కలిసి ప్రవహించక పోవచ్చుగానీ అది తప్పకుండా క్రికెట్ క్రీడతో కలిసి కచ్చితంగా ప్రవహిస్తుంది. మరో పక్షం రోజుల్లో ఆసియా కప్ క్రికెట్ ప్రారంభమవనున్నది. క్రికెట్ అభిమానులు అందరూ మరీ ముఖ్యంగా భారత్–పాక్ క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించేందుకు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. ఈ మ్యాచ్‌లకు మోదీ ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఆసియా కప్ క్రికెట్ మ్యాచ్‌లు ద్వైపాక్షిక సంబంధాలు, బహుళపాక్షిక ఈవెంట్స్ మధ్య ఒక విలక్షణ వ్యత్యాసాన్ని కల్పిస్తాయని ప్రధానమంత్రి అన్నారు. అంతేకాకుండా అవి అంతర్జాతీయ క్రీడా కార్యక్రమాల ఆతిథేయిగా భారత్‌ను ఎక్కువగా ఇష్టపడేట్టు కూడా చేస్తాయని ఆయన అన్నారు.

మోదీ ప్రభుత్వం సూత్రబద్ధంగా 2012 నుంచి అనుసరిస్తున్న అలిఖిత మార్గదర్శక సూత్రాలకే అంటిపెట్టుకుని ఉన్నది: ఆనాటి నుంచి భారత్, పాకిస్థాన్‌ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లు అంతర్జాతీయ టోర్నమెంట్స్‌లో ఆడుతున్నవి మాత్రమే. భారత్, పాకిస్థాన్‌ల మధ్య క్రీడా సంబంధాలు సుదృఢమవ్వాలని సుదీర్ఘకాలంగా ఆకాంక్షిస్తున్న క్రికెట్ అభిమానిగా ఆసియా కప్ క్రికెట్ టోర్నమెంట్ పట్ల ప్రభుత్వ వైఖరిని ఎటువంటి ఆక్షేపణ లేకుండా స్వాగతిస్తున్నాను. ఈ విశాల ఉపఖండాన్ని క్రికెట్ ఏకం చేస్తున్నది. భిన్న వర్గాల ప్రజల మధ్య స్నేహ బంధాలను నిర్మిస్తోంది. ప్రజల మధ్య స్నేహసేతువులను నిర్మించేవి, నిర్మించగలిగేవి ఆటలే కదూ? క్రికెట్ అభిమానిగా నా మధుర జ్ఞాపకాలలో ముఖ్యమైనవి భారత్–పాకిస్థాన్ మ్యాచ్‌లే. కోట్లా స్టేడియంలో అనిల్ కుంబ్లే పది వికెట్లు తీసుకోవడం, 2003 ప్రపంచ కప్ టోర్నమెంట్‌లో సచిన్ టెండూల్కర్ అనితర సాధ్యమైన బ్యాటింగ్ నుంచి షార్జాలో జావేద్ మియాందాద్ చివరి బంతి ఆరు పరుగులు దాకా, ఇండో–పాక్ క్రికెట్ వీక్షకులలో అంతిమ భావోద్వేగ ఆశా నిరాశలను ప్రస్ఫుటీకరిస్తుంది. ఆ ఉద్విగ్నతలలో కలహశీల గత, వర్తమాన చరిత్రలు బంధితమవుతాయి. ఒక ఇమ్రాన్ ఖాన్, ఒక సునీల్ గవాస్కర్ మధ్య, ఒక షోయబ్ అఖ్తర్, వీరేంద్ర సెహ్వాగ్ మధ్య పోటాపోటీ ఆట క్రికెట్ సౌందర్యాన్ని కళ్లకు గట్టిస్తుంది. ఆ ప్రామాణిక క్రీడా నైపుణ్య ప్రభావం ఆటస్థలం ఆవల కూడా అమితంగా ఉంటుంది.

అయితే ఇప్పుడు ఆసియా కప్ క్రికెట్ రేకెత్తిస్తున్న భావోద్వేగాలు భిన్నమైనవి. కేవలం రెండు నెలల క్రితమే సంభావ్య అణుయుద్ధం అంచుల నుంచి వెనక్కి వెళ్లిన రెండు దేశాల క్రికెట్ టీమ్‌ల మధ్య జరగనున్న మ్యాచ్ ఇది. పహల్గాంలో సంభవించింది మాటల్లో చెప్పలేని రాక్షస చర్య. ఆసేతు హిమాచలం సకల భారతీయులను కలవరపెట్టిన దురాగతమది. అయినప్పటికీ పాకిస్థాన్ సైనిక రాజ్యం ఎలాంటి పశ్చాత్తాపం వ్యక్తం చేయలేదు. తాము స్వయంగా ప్రోత్సహించిన ఉగ్రవాదం సృష్టించిన మహా బీభత్సానికి ఆ సైనిక రాజ్యం ఎలాంటి బాధ్యత తీసుకోవడానికి సుముఖత చూపలేదు. సామాన్య భారత పౌరులపై జరిగిన ఆ దాడిని 'తప్పుడు జెండా చర్య' (ఫాల్స్ ఫ్లాగ్ ఆపరేషన్ – నిజమైన బాధ్యులను దాచిపెట్టి మరొక పార్టీ లేదా సంస్థపై నిందమోపే ఉద్దేశంతో నిర్వహించే రహస్య చర్య)గా అభివర్ణించేందుకు ఒక మొరటు ప్రయత్నం జరిగింది. ఉగ్రవాద సంస్థ లష్కర్ ప్రేరిత 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' క్రూరత్వాన్ని యథావిధిగా కప్పిపుచ్చారు. పాకిస్థాన్ ప్రాయోజిత ఉగ్రవాదంపై భారత్ న్యాయబద్ధమైన ఆందోళనలను కనీస మాత్రంగానైనా అంగీకరించేందుకు కూడా తిరస్కరించడం జరిగింది. పహల్గాం ఘటనకు కొన్ని వారాల ముందు ద్విజాతి సిద్ధాంతాన్ని సంపూర్ణంగా సమర్థించిన పాక్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ భారత్ పట్ల విషం చిమ్మడాన్ని కొనసాగిస్తూ ఉండగానే ఆయనకు ఫీల్డ్ మార్షల్‌గా పదోన్నతి కల్పించారు.

భారత్, పాకిస్థాన్‌ల మధ్య క్రికెట్ ఇంకెంత మాత్రం క్రీడా మర్యాదలకు నిబద్ధమవడం లేదు. ధనలాలసతో నడుస్తున్న అపార సంపద్వంత క్రీడా సంఘాల అనైతిక ప్రపంచంలో నిజంగా ముఖ్యమైన ఏకైక విషయం స్పాన్సర్ షిప్ మనీ మాత్రమే. రక్తమూ, నీరూ సహ జీవనం చేయక పోవచ్చుగానీ డబ్బు (ఏ రంగులో ఉన్నది అయితేనేం)కు హద్దులు లేవు. అవును, దానికి 'వాఘా–అట్టారి' లాంటి సరిహద్దులు తెలియనే తెలియవు.

ద్రోహ బుద్ధితో వ్యవహరించే పాక్ సైనిక–రాజ్యం కుట్రలు, కుతంత్రాలకు అంతర్జాతీయ క్రికెటర్లు ఎలా స్పందించాలి? 'వెయ్యి గాయాల'తో భారత్ రక్తమోడేలా చేసేందుకు ప్రయత్నిస్తున్న రాజకీయ వ్యవస్థ అనాగరికత నుంచి స్ఫూర్తిదాయక క్రీడ క్రికెట్ విలక్షణత, స్వచ్ఛతను సంరక్షించడం సాధ్యమవుతుందా? సూత్రప్రాయంగా సాధ్యమే, వాస్తవంగా అయితే కానేకాదు. పహల్గాం దాడి తరువాత భారత ప్రజలకు సంఘీభావం, సహానుభూతి తెలుపుతూ పాకిస్థాన్ క్రికెట్ సమాజం నుంచి ఒక్కరంటే ఒక్కరు కూడా ఎలాంటి ప్రకటన చేయలేదు. చేయకపోగా పాకిస్థాన్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రీది రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఆ ఉగ్రవాద దాడికి భారత సైన్యానిదే బాధ్యత అని ఆరోపించారు. ఇటువంటి నిందారోపణ చేసింది ఆయన ఒక్కరే కాదు. పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్ చీఫ్ షాబాద్ షరీఫ్, ప్రభుత్వంలో మంత్రి కూడా అయిన మోహిసిన్ నఖ్వీ ఏమన్నారో చూడండి: 'పాకిస్థాన్ అణ్వాయుధ రాజ్యం. మాతో క్రికెట్ ఆడేందుకు తిరస్కరించే ధైర్యం భారత్‌కు లేదు. అలా తిరస్కరిస్తే పర్యవసానాలు ఎలా ఉంటాయో వారికి తెలుసు'.

న్యూఢిల్లీ పట్ల పాకిస్థాన్ పాలనా వ్యవస్థలో ఎంత విరోధ భావం ఉన్నదో పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్ చీఫ్ విద్వేష ప్రకటనలు స్పష్టం చేస్తున్నాయి. సరే, మన దేశంలోనూ పాకిస్థాన్ పట్ల ఒంటికాలిపై లేచి ఆగ్రహోదగ్రులయ్యేవారు చాలా మంది ఉన్నారు. పాకిస్థాన్‌ను శాశ్వతంగా నిర్మూలించాలని వారు తరచు యుద్ధోన్మాద ప్రేలాపనలు పేలుతుంటారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో వాఘాకు ఆవల, ఈవల మీడియా నిష్పాక్షికంగా వ్యవహరించ లేదు. భారతీయ మీడియా అయితే కొంచెం ఎక్కువ కలహశీలంగా వ్యవహరించింది కూడా. సంస్థాగతమైన ప్రవర్తనా నియమావళి పూర్తిగా కూలిపోయింది. న్యూస్ యాంకర్ల ప్రదర్శనాత్మక జాతీయవాదం ఇప్పుడు న్యూస్ టీవీ వ్యాకరణంలో అంతర్భాగమైపోయింది.

ఇటువంటి పరిస్థితులలో ఇండో–పాక్ క్రికెట్ మ్యాచ్ ఇరు దేశాల ప్రజలకు ఉపశమనం కలిగిస్తుందా? స్నేహాన్ని కుసుమింప చేస్తుందా? అలా జరిగేందుకు ఆస్కారం లేదు. రాజకీయ, మీడియా వర్గాల సంకుచిత వైఖరులు అటువంటి శుభస్కర పరిస్థితులను అనుమతించవు. 2004లో నేను పాకిస్థాన్‌లో పర్యటించాను. ఒక టెస్ట్ సిరీస్‌లో పాకిస్థాన్‌ను భారత్ ప్రప్రథమంగా ఓడించిన సందర్భమది. అయినా భారతీయ క్రికెటర్ల పట్ల పాకిస్థానీయులు ఎనలేని సుహృద్భావాన్ని చూపారు. అపూర్వ గౌరవ మర్యాదలు చేశారు. ప్రజల స్థాయిలో వర్ధిల్లే సంబంధాలు ఎటువంటి ప్రభావాన్ని చూపుతాయో పాకిస్థానీయుల నడవడి స్పష్టం చేసింది. భారత్–పాకిస్థాన్‌ల మధ్య సంబంధాలు మెరుగుపడతాయనే ఆశాభావం మిణుకుమన్నది. లాహోర్‌లో ఒక సాయంత్రం నన్ను క్రికెట్ అభిమానులు చుట్టుముట్టారు. 'బాలాజీ ధీరే చలో' అని గానం చేశారు. అది భారతీయ ఫాస్ట్ బౌలర్ లక్ష్మీపతి బాలాజీ గురించిన ప్రస్తావన. అనుక్షణం మందహాసం చేస్తుండే బాలాజీ మోము పాకిస్థానీయుల హృదయాలను గెలుచుకున్నది. అలాగే 1999లో చెన్నైలో ఇండో–పాక్ మ్యాచ్‌లో కొద్ది తేడాతో భారత్ ఓడిపోయింది. అయినప్పటికీ స్టేడియంలో ఉన్న భారతీయ క్రికెట్ అభిమానులు పాకిస్థానీ క్రీడాకారులకు జేజేలు పలికారు. వారిని మనసారా అభినందించారు. ఒక అవిటి బాలుడు పాకిస్థాన్ క్రికెటర్ ఒకరి ఆట తీరును అభినయించి చూపడం అందరినీ ఆకట్టుకున్నది. ఆ అవిస్మరణీయ క్షణాలలో కూడా ఇరు దేశాల మధ్య సాధారణ సంబంధాలు తప్పక నెలకొంటాయనే ఆశాభావం జనించింది. అయితే అదొక తప్పుడు ప్రభాతమని రుజువయింది. ఎంత విచారకరం! నిజం చెప్పాలంటే భారత్–పాకిస్థాన్ సంబంధాలు ఏమైనా కావచ్చు గానీ సాధారణమైనవి అని చెప్పడానికి వీలు లేదు.


భారత్, పాకిస్థాన్‌ల మధ్య క్రికెట్ ఇంకెంత మాత్రం, ఏ జాతీయ జట్టునూ బాయ్‌కాట్ చేయడాన్ని తీవ్రంగా నిరసించే క్రీడా మర్యాదలకు నిబద్ధమవడం లేదు. ధనలాలసతో నడుస్తున్న అపార సంపద్వంత క్రీడా సంఘాల అనైతిక ప్రపంచంలో నిజంగా ముఖ్యమైన ఏకైక విషయం స్పాన్సర్‌షిప్ మనీ మాత్రమే సుమా! ఈ ప్రాయోజిత ధన శక్తి అంతకంతకూ ఇతోధికంగా పెరుగుతోంది. క్రికెట్ జగత్తుకు సంబంధించిన చాలా సరళ సత్యమిది. పక్షం రోజుల పాటు జరిగే ఆసియా కప్ క్రికెట్‌లో మరే ఇతర మ్యాచ్‌ల కంటే భారత్–పాకిస్థాన్ మ్యాచ్ మాత్రమే సంఖ్యానేక క్రికెట్ అభిమానులను ఆకట్టుకుంటుంది. వాణిజ్య ప్రకటనల ద్వారా మిగతా మ్యాచ్‌లకు సమకూరే మొత్తం ఆదాయం కంటే ఈ ఒక్క మ్యాచ్‌కు లభించే సదరు ఆదాయమే అధికంగా ఉంటుంది. క్రికెట్ వాణిజ్యమే ఇండో–పాక్ క్రికెట్‌ను ప్రోత్సహిస్తోంది. ఆ లాభాల పంటే దానికి ప్రధాన ఆసరా. దేశ విభజనతో విడిపోయిన పేద సాధారణ భారతీయులు, పాకిస్థానీయులు, పహల్గాం ఉగ్ర ఘాతుకం అనంతరం, పరస్పర కుటుంబాలను సందర్శించేందుకు వీసాలు పొందలేక పోతున్నారు. అయితే ఇరు దేశాల క్రికెట్ బోర్డ్‌ల వీవీఐపీ కులీనులు మ్యాచ్‌లు జరిగే స్టేడియంలలో చాలా సంతోషంగా ఎయిర్ కండిషన్డ్ బాక్స్‌లలో రాసుకు పూసుకు కూర్చొని ఆటను వీక్షిస్తారు. ఇది తథ్యం. రక్తమూ నీరూ సహజీవనం చేయక పోవచ్చుగానీ డబ్బు (ఏ రంగులో ఉన్నది అయితేనేం)కు హద్దులు లేవు. అవును, దానికి 'వాఘా–అట్టారి' లాంటి సరిహద్దులు తెలియనే తెలియవు. మైదాన్‌లో 'యుద్ధం' ప్రారంభం కానివ్వండి!

తాజా కలం : ఇండియా, పాకిస్థాన్ క్రికెట్ అభిమానుల వాట్సాప్ గ్రూప్‌లో నేనూ భాగంగా ఉన్నాను. నిజాయితీగా చెబుతున్నాను: వాఘా సరిహద్దుకు ఆవల నుంచి రాజకీయాల రొద లేకుండా క్రికెట్ అనురక్తులైన ప్రతిభావంతుల చర్చలను వినడం నాకు చాలా ఉల్లాసంగాను, ఉపశమనం కలిగిస్తున్నదిగాను ఉన్నది. గవాస్కర్, హనీఫ్; ఇమ్రాన్, కపిల్ దేవ్; విరాట్, బాబర్ ఆజమ్‌ల క్రికెటింగ్ ప్రావీణ్యాలపై ఉత్తేజకరమైన చర్చలు, సందేహం లేదు. భవిష్యత్తులో ఏదో ఒక రోజు సార్వకాలిక సంయుక్త ఇండియా–పాకిస్థాన్ ఎలెవన్ మనం ఎంపిక చేసుకోవాలి. ఎవరు ఎన్ని జెట్ విమానాలను కూల్చి వేశారన్న విషయమై పెద్ద పెట్టున వాదోపవాదాలు చేయడం కంటే ఆ సార్వకాలిక మేటి క్రికెటర్ల జట్టును ఎంపిక చేయడమే చాలా తేలిక!

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

యువత ఆడాలి – భారత్ గెలవాలి

ప్రతి సంవత్సరం ఆగస్టు 29న, భారతదేశం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడాదినోత్సవాన్ని జరుపుకుంటున్నది. ఈ రోజు కేవలం ఒక హాకీ లెజెండ్‌ను స్మరించుకోవడానికి మాత్రమే కాదు, 'దేశ క్రీడా రంగాన్ని క్షుణ్ణంగా సమీక్షించుకోవడానికి, దాని గతం నుంచి పాఠాలు నేర్చుకోవడానికి, వర్తమాన సవాళ్లను విశ్లేషించడానికి, భవిష్యత్తు కోసం ఒక స్పష్టమైన మార్గాన్ని నిర్దేశించడానికి' గొప్ప అవకాశం. జనాభా పరంగా పెద్ద దేశమైనా, ఒలింపిక్ పతకాల సంఖ్య పరంగా మాత్రం చాలా వెనుకబడి ఉన్నాం. దీనికి కారణాలు అనేకం. 2016 రియో ఒలింపిక్స్, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో మన పతకాల స్థానం కొంత మెరుగుపడినా ఇంకా సాధించాల్సింది ఎంతో ఉంది.



భారతదేశం 2036లో ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వాలనే సంకల్పంతో ఉంది. ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే, మన క్రీడా వ్యవస్థను సమూలంగా మార్చాలి. కేవలం నగరాల్లో ఆధునిక స్టేడియాలను నిర్మించడమే కాదు, క్రీడాకారుల ప్రతిభను గుర్తించి, వారికి ప్రపంచ స్థాయి శిక్షణను అందించడం పట్ల దృష్టి సారించడం తప్పనిసరి. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా కృషి చేయాలి. కేంద్ర ప్రభుత్వం క్రీడా వికాసానికి జాతీయ స్థాయి విధానాలను రూపొందించాలి. దీనిలో పాఠశాల స్థాయి నుంచి ఒలింపిక్ స్థాయి వరకు అన్ని దశలను స్పష్టంగా నిర్వహించాలి. నేషనల్ స్పోర్ట్స్ ఎడ్యుకేషన్ పాలసీని రూపొందించి, విద్యలో క్రీడలను తప్పనిసరిగా భాగం చేయాలి. క్రీడా రంగానికి బడ్జెట్లో సరిపడా నిధులు కేటాయించి, వాటిని పారదర్శకంగా పంపిణీ చేయాలి. ఖేలో ఇండియా ప్రోగ్రాంను మరింత విస్తృతంగా, సమర్థవంతంగా అమలు చేసి, గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించాలి. 'టార్గెట్ ఒలింపిక్ పోడియం' పథకాన్ని మరింతగా విస్తరించాలి. క్రీడా వికాసంలో స్పోర్ట్స్ సైన్స్, ఫిజియాలజీ, సైకాలజీ వంటి శాస్త్రాలను ఉపయోగించుకోవాలి. క్రీడాకారుల పనితీరును మెరుగుపరచడానికి డేటా, విశ్లేషణాత్మక సమాచారం ఆధారంగా శిక్షణనివ్వాలి. విదేశీ కోచ్‌లను నియమించి, భారత కోచ్‌లకు అధునాతన శిక్షణ ఇప్పించాలి. క్రీడా సమాఖ్యల పనితీరును పారదర్శకంగా పర్యవేక్షించాలి. వాటిలో ఉన్న అవినీతి, స్వయంప్రతిపత్తి లేమి వంటి సమస్యలను పరిష్కరించాలి.

భారతదేశంలో యువతకు కొదవలేదు. కానీ నేటి సాంకేతిక యుగంలో మైదానంలో ఆటలు ఆడాల్సిన పిల్లలు, యువత వీడియో గేమ్స్, ఇతర సామాజిక మాధ్యమాల యాప్స్, ఆన్లైన్ గేమ్స్ వంటి వాటికి అలవాటు పడడం దురదృష్టకరం. యువత ఆ ప్రభావం నుంచి బయటకు వచ్చి మైదానంలో క్రీడల్లో పాల్గొనే విధంగా చేయడమే కాదు, వారి ప్రతిభను గుర్తించి, వారికి సరైన మద్దతు, ప్రోత్సాహం అందించడం ప్రభుత్వాల బాధ్యత.

– డా. రావుల కృష్ణ
అసిస్టెంట్ ప్రొఫెసర్, హెచ్‌సియు

'యెన్నాని సెప్పేది యెంకి ముచ్చట్లు'



ఇరవయ్యో శతాబ్ది నవ కవితా చైతన్యంలో అపూర్వ సంచలనం సృష్టించిన గేయ సంపుటి 'యెంకి పాటలు'. తన కృతికి నండూరి వెంకట సుబ్బారావు రాసిన ముందు మాటకు నేటికి వందేళ్లు.

ఈ పాటలు నేను మద్రాసులో క్రైస్తవ కళాశాలలో పట్ట పరీక్షకు చదువుకొనే దినాలలో (1917–1918) వ్రాయ మొదలెట్టినాను.

అప్పుడు నా అదృష్టంవల్ల మ – రా – శ్రీ అధికార్ల సూర్యనారాయణరావుగారి స్నేహభాగ్యం లభించటం, ఆయనతో కలిసి వాసం చేయటం కలిగింది. నన్నంతకు మునుపే సారస్వత విషయాల్లో అంతో యింతో తరిఫీదు చేయుచున్న మా బసవరాజు అప్పారావు కూడా అక్కడే వుండేవాడు. వారితో ముచ్చట్లకు మ – రా – శ్రీ పాటిబండ అప్పారావుగారును వచ్చుట మామూలు.

వారందరు యెవరి రచనల గురించి వారు సొంపుగా మాట్లాడుకొంటుంటే నేనొకప్రక్క కూర్చుని విస్తుపోయి వినటం రివాజు.

ఒకనాడు కాలేజీ నుండి ట్రాంబండిలో వస్తుండగా, గొంతులో సన్నని రాగం బయలుదేరింది. దానిని నాలో నేను పాడుకోవాలని సాహిత్యం జ్ఞాపకం చేసుకోపోయాను. ఎప్పుడో విన్న పదంలాగున "గుండెగొంతుకలోన కొట్లాడుతాది" అన్న పల్లవి వచ్చింది. అదే మననం చేసుకోగా చేసుకోగా యిల్లు చేరేసరికి నేను వ్రాసిన మొదటిపాట తేలింది.

మా "జానకీ" పతికిన్నీ, అప్పారావుకున్నూ ఆ పాట గద్గదికతో వినిపించాను. "సెబాస్ వ్రాయ"మన్నాడు జానకీపతి; "నీవు నిత్యం వాడే భాష కాదిది, యీ భాష సాయమున సత్యాన్వేషణం చేయలే" వన్నాడు మా బసవరాజు అప్పారావు.

ఏ సమయమున వెన్ను చరిచాడో, సూర్యనారాయణ! అప్పటి నుండియు "యెంకి"ని కవితారీతిని స్మరించుట నిముసమైన మానలేదు. అతడును అంతకంతకు దన అభిప్రాయమును బలపరుచుకొన్నాడు. మా అప్పారావు రానురాను తన అభిప్రాయం మార్చుకొని యిటీవల అతడును వల్లె అనుచున్నాడు.

పాటలు అప్రయత్నంగా వచ్చేటట్లు ప్రసాదించిన యెంకికి కృతజ్ఞుడనా? ప్రోత్సాహముచేసి వీపు దట్టిన అధికార్లవారికా? కవిత్వ కళా రహస్యాలు తెలియజేప్పిన మా బసవరాజు అప్పరాయనికా? మువ్వురకును. ఇంకను సహృదయు లెందరో చాలకాలంనుంచీ నన్ను హెచ్చరిస్తున్నారు.

అందులో "యెంకి" పాటలు పదిమందికీ వినిపించినవారు దేశోద్ధారక శ్రీయుత కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారు. ఆంధ్ర పత్రికలో నేమి, భారతిలో నేమి ఆ పాటలకు తగిన తావొసంగి, యీ పుస్తకం అచ్చులో యెంతో అభిమానం చూపి, రెండు మాసములు యీ పుస్తకమును తమ మూడు పత్రికలలోనూ ఉచితముగా అడ్వర్టైజ్ చేయునట్లు ఆర్డరు దయచేసినారు. వారికెంతో కృతజ్ఞుడను.

'సాహితి' మా పత్రికే. అనసూయ, జనరంజని, జ్యోతి, సుజనరంజనీ పత్రికాధిపతులును నాకెంతో గౌరవమొసంగినారు. శారదయు అట్లే. వారూ తెలుగుతల్లి యొక్క నిజస్వరూపం చూడాలెనని ఉవ్విళ్లూరుచున్నవారే; తెలుగుపస, తెలుగునుడి, తెలుగువాదం, తెలుగురుచీ తెలిసికొని మనజాతి సాంప్రదాయాలలోగల సొగసు, జీవమూ, పదిమందికిన్నీ మనసుకెక్కించాలెనని కంకణము కట్టుకుని కృషి చేస్తున్నవారే. వారందరికీ నా నమస్కృతులు,

ప్రభువులలో మా ప్రభువులును, కవులూ, రసికులూ అయిన శ్రీశ్రీశ్రీ రాజా వేంకటాద్రి అప్పారావు బహద్దురుగారు యీ పాటలు విని ఆనందించేవారు. ఆ మహారాజు నాకెన్నో విధాల మేలుచేసినారు. వారివంశమాచంద్రార్కమూ నిలుచుగాతయని పరమేశ్వరుని ప్రార్థిస్తున్నాను. పాటలలో సగం పైగా నూజువీటిలో శ్రీవారి సన్నిధినే వ్రాశాను.



మా అభినవాంధ్రకవిమిత్రమండలి వారందరు నా ప్రాణమిత్రులు. మాప్రెసిడెంటుగారగు శ్రీయుత కోలవెన్ను రామకోటేశ్వరరావుగారి ద్వారా వారి దయకు బదులు నా వందనము లర్పిస్తున్నాను. ఇందులో చిత్రపటములు మా అడవి బాపిరాజుగారు వ్రాసినవి. ఆయన చిత్రములలోని మహోన్నత భావాలకు నా యెంకి పాటలే కారణమైతే, ధన్యుడను, ధన్యుఁడను!

మద్రాసు ఆంధ్ర పండిత మండలివారు నన్ను ప్రత్యేకం ఆహ్వానించి గౌరవించారు. 'అప్పటినుంచీ పండితులంటే భయం పోయి భక్తే మిగిలింది, వారికి నా నమస్సులు.

కావ్యవ్యాకరణతీర్థులు బ్రహ్మశ్రీ పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రుల వారికి మా యెంకి పేరు చెపితేనే యెంతో అపేక్ష; పాటలంటే ప్రాణమే. పండితులయిన్నీ "యేమో, చదువురానివారి పాట"లని తోసెయ్యరు. యెంకిపై పదిమంది హృదయాలల్లో భక్తి కలిగించింది వారున్నూ, బ్రహ్మశ్రీ పొక్కులూరి లక్ష్మీనారాయణగారున్నూ. వారిరువురికీ నా నమస్కారాలు.


తెలుగుదేశంలో పేరొందిన మేటిగాయకులు మ. రా. శ్రీ విద్వాన్ పారుపల్లి రామకృష్ణయ్యగారు యెంతో శ్రమపడి, శ్రద్ధతో యీ పాటలకు స్వరం వేశారు. వారికి నా నమస్కారాలు. అదే నేను పాడే విధము.

తర్కవ్యాకరణ శాస్త్రవేత్తలగు బ్రహ్మశ్రీ గంటి సూర్యనారాయణ శాస్త్రులుగారు తమకుతామై కోరి, యీ పాటలు చక్కగా అచ్చువేయించినందుకు వారికి చదువరులతోబాటు నేనును కృతజ్ఞుడను.

ఈ కృతి నర్పించినది నా పెత్తల్లి కుమారునకు. నా తండ్రి నాకు నాలుగైదేండ్లున్నప్పుడు కాలంచేస్తే, అప్పటినుండి యిప్పటివరకు మా కందరకు అతడే పట్టుకొమ్మ. "చంద్రున కొక్కనూలిపోగ"న్నట్లు అతనికీ కృతి సమర్పిస్తున్నాను.

మద్రాసు,
29–8–1925.

– నండూరి వెంకటసుబ్బారావు



జై డూండీ గణేశ్

విజయవాడలో మహాగణపతిని దర్శించుకున్న సీఎం చంద్రబాబు

విజయవాడ, (విద్యాధరపురం), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విజయవాడ సితార సెంటర్ లేబర్ కాలనీ గ్రౌండ్‌లో డూండీ గణేశ్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 72 అడుగుల మహాగణపతిని ముఖ్యమంత్రి చంద్రబాబు దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మన ప్రజా ప్రభుత్వంలో సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేసి వాడవాడలా బ్రహ్మాండంగా గణేశ్ ఉత్సవాలు జరుపుకుంటున్నామన్నారు. తొలుత సీఎం చంద్రబాబుకు డూండీ గణేశ్ సేవా సమితి వ్యవస్థాపకుడు, ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేశ్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు, మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, దూదేకుల కార్పొరేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ నాగుల్ మీరా, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి తదితరులు ఘన స్వాగతం పలికారు.





మహాగణపతికి నమస్కరిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో డూండీ గణేశ్ సేవా సమితి వ్యవస్థాపకుడు డూండీ రాకేశ్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి తదితరులు



చందర్లపాడు మండలం తుర్లపాడు వద్ద నీట మునిగిన వరి పొలాలు

వర్షాలు.. వరదలు

ఉధృతంగా మునేరు, కట్టలేరు, వైరా ఉప నదులు

పొంగి ప్రవహిస్తున్న ఏనుగుగడ్డ వాగు, పులివాగు, కొండవాగు

- బుడమేరుకు 3,600 క్యూసెక్కుల వరద
- అనేక గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలు
- వరి పంట వర్షార్పణం.. మినుముకు భారీ నష్టం
- ఆర్అండ్‌బీ రోడ్లు, ఎన్‌హెచ్ - 30పైకి వరద నీరు
- విజయవాడలోనూ భారీ వర్షం



జి.కొండూరులో పులివాగు ఉధృతి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/ఇబ్రహీంపట్నం/కంచికచర్ల): వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో బుధ, గురువారాల్లో కురిసిన భారీ వర్షానికి జిల్లాలోని ఉప నదులు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో సగటున 13.7 సెంటీ మీటర్ల వర్షం పడింది. తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కట్టలేరు, వైరా, మునేరు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వరంగల్, ఖమ్మం జిల్లాల మీదుగా కట్టలేరు ఎన్టీఆర్ జిల్లాలోకి ప్రవేశిస్తుంది. నందిగామ మండలం కూడలి, వీరులపాడు మండలం పల్లెంపల్లి దగ్గర కట్టలేరు మున్నేరులో కలుస్తుంది. వరంగల్ జిల్లా నుంచి వైరా ఏరు ఎన్టీఆర్ జిల్లాలోకి ప్రవేశిస్తుంది. అక్కడ కురుస్తున్న వర్షాల కారణంగా వైరా ఏరు కూడా ఎన్టీఆర్ జిల్లాలో ఉధృతిగా కొనసాగుతోంది. ఈ వైరా ఏరు జిల్లాలో కీసర దగ్గర మున్నేరులో మిగతా 6లో..

ముంపులో వరి పొలాలు

జీ.కొండూరు, చందర్లపాడు, కంచికచర్ల, వీరులపాడు, తిరువూరు, ఇబ్రహీం పట్నం, ఏ.కొండూరు గంపలగూడెం మండలాల పరిధిలో భారీ వర్షం కురిసింది. నందిగామ, తిరువూరు రెవెన్యూ డివిజన్ల పరిధిలో వేలాది ఎకరాల వరి పంట ముంపునకు గురైంది. ఈ నెలలో కురిసిన వర్షాలకు వరి పంట చాలా చోట్ల రంగు మారింది. మళ్లీ ముంపులో చిక్కుకోవటంతో అన్నదాత ఆవేదన అంతా ఇంతా కాకుండా ఉంది. మరో రెండు రోజులు ఇదే పరిస్థితి ఉంటే.. నష్టపోతామని రైతులు ఆవేదన చెందుతున్నారు. కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో మినుము పంటకు భారీగా నష్టం వాటిల్లింది. గంపలగూడెం, జీ కొండూరు మండలాల పరిధిలో వరి పంట ముంపులో చిక్కుకుంది. భారీ వర్షాలతో ఏనుగుగడ్డ వాగు ఉధృతి కారణంగా ఇబ్రహీంపట్నం మండలంలో వరి పంటకు నష్టం ఏర్పడింది.

దుర్గగుడిలో ఘనంగా చవితి ఉత్సవాలు 8

రాష్ట్ర ఉత్తమ పాఠశాలగా నున్న
- స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డులకు జిల్లా స్థాయిలో 5 పాఠశాలల ఎంపిక

8

వర్షాలు, వరదలపై అప్రమత్తంగా ఉన్నాం
- జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

6

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం

తొలిరోజు 1,048 అభ్యర్థుల విద్యార్హత పత్రాల తనిఖీ

- పర్యవేక్షించిన ప్రత్యేక అధికారి ప్రసన్నకుమార్, డీఈవోలు
- అధిక మార్కులు వచ్చినా కాల్ లెటర్‌లు రాలేదని పలువురు ఫిర్యాదు
- ఒకటి రెండు రోజుల్లో వస్తాయంటున్న అధికారులు
- ఓపెన్ కేటగిరిలో ఎస్సీ బీసీలకు పోస్టులు కేటాయించడం లేదంటున్న ఉపాధ్యాయ సంఘాలు



డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

మచిలీపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025లో అర్హత సాధించిన ఉమ్మడి కృష్ణాజిల్లా అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన గురువారం ప్రారంభమైంది. మచిలీపట్నంలోని నోబుల్ కళాశాలలో ఉదయం ఎనిమిది గంటల నుంచే అభ్యర్థులు నోబుల్ కళాశాల వద్దకు చేరుకున్నారు. అభ్యర్థులు, వారి బంధువుల రాకతో నోబుల్ కళాశాలకు వెళ్లే రహదారి నిండిపోయింది. దీంతో ఈ ప్రాంతంలో పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.


1,048 మంది అభ్యర్థులు హాజరు

డీఎస్సీ-2025లో అర్హత సాధించిన వారిలో 1,048 మంది అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. నోబుల్ కళాశాలలోని 21 గదుల్లో, గదికి 50 మంది చొప్పున అభ్యర్థులను కేటాయించి సర్టిఫికెట్‌లను పరిశీలించారు. ఒక్కో గదిలో ఎంఈవో, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, రెవెన్యూ అధికారి, టెక్నికల్ సిబ్బంది, పీడీ, పీఈటీ ఐదుగురితో కూడిన బృందం సర్టిఫికెట్‌లను పరిశీలించింది. ఒక్కో అభ్యర్థి మూడు సెట్‌ల జిరాక్సు కాపీలను అధికారులకు ఇచ్చారు. పాఠశాల విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసన్నకుమార్, కృష్ణా డీఈవో పీవీజే రామారావు, ఎన్టీఆర్ జిల్లా డీఈవో యూవీ సుబ్బారావు, జిల్లా గిరిజన సంక్షేమశాఖ మిగతా 6లో..

పెరిగిన ఇన్‌ఫ్లో

రెండు జలాశయాలకు భారీగా వరద

- ప్రకాశం బ్యారేజీ ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో 4.43 లక్షల క్యూసెక్కులు
- ఒకటో నంబరు ప్రమాద హెచ్చరిక జారీ
- సాయంత్రానికి పులిచింతలకు తగ్గిన ఇన్‌ఫ్లో
- పులిచింతల ఇన్‌ఫ్లో 2.41 లక్షల క్యూసెక్కులు
- అవుట్‌ఫ్లో 2.43 లక్షల క్యూసెక్కులు



ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు విడుదల చేసిన నీరు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): జిల్లాలోని జలాశయాలకు వరద ఉధృతి మళ్లీ పెరిగింది. పులిచింతల ప్రాజెక్టు, ప్రకాశం బ్యారేజీ వద్ద వేర్వేరు పరిస్థితులు ఉన్నాయి. పులిచింతల ప్రాజెక్టుకు ఉదయం నుంచి పెరుగుతూ వచ్చిన ఇన్‌ఫ్లో రాత్రికి తగ్గుముఖం పట్టింది. ఉదయం ఆరు గంటలకు నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుంచి పులిచింతలకు 3,67,940 క్యూసెక్కుల నీరు వచ్చింది. దిగువకు 3,74,212 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. రాత్రికి ఈ నీటి పరిమాణం తగ్గింది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుంచి వచ్చే నీటి పరిమాణం 2,41,000 క్యూసెక్కులకు తగ్గిపోయింది. దిగువకు 2,43,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పులిచింతల ప్రాజెక్టుతోపాటు వాగుల నుంచి నీటి ప్రవాహం ఉండడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. బ్యారేజీకి మిగతా 6లో..

ఏసీ బోగీలే టార్గెట్

రైళ్లలో మార్బుల్ వర్కర్ చేతివాటం

- 16న గుజరాత్‌కు చెందిన కుటుంబం ఆభరణాల బ్యాగ్ చోరీ
- నిందితుడిని పట్టుకున్న రైల్వే పోలీసులు
- రూ.8 లక్షల ఆభరణాలు స్వాధీనం
- నిందితుడిపై పలు చోరీ కేసులు

అతడి గురించి ఎవరిని అడిగినా మార్బుల్ పని చేస్తుంటాడని చెబుతారు. అతడి దృష్టి మాత్రం ఎప్పుడూ రైళ్లలోని ఏసీ బోగీలపైనే ఉంటుంది. రైలు గుర్తుకొచ్చినప్పుడల్లా స్టేషన్‌కు వెళ్లి ఒక సాధారణ టికెట్ కొనుగోలు చేస్తాడు. దానితో ఏసీ బోగీ ఎక్కుతాడు. బోగి మొత్తం అటూఇటూ తిరుగుతాడు. తర్వాత ఏ వస్తువు కనిపిస్తే దాన్ని తీసుకుని అఫ్‌సైడ్ దిగి వెళ్లి పోతాడు. ఇలా విజయవాడ రైల్వేస్టేషన్ కేంద్రంగా రైళ్లలో వరుస చోరీలు చేస్తున్న యువకుడ్ని రైల్వే పోలీసులు గురువారం అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను డీఎస్పీ రత్నరాజు, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ జేవీ రమణ, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఫతే అలీబేగ్ వెల్లడించారు.



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న రైల్వే పోలీసులు

విజయవాడ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): గుంటూరుకు చెందిన అబ్దుల్ రెహ్మాన్ భవానీపురంలో కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. అతడికి భార్య, కుమారుడు ఉన్నారు. మార్బుల్ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నట్టుగా వ్యవహరిస్తాడు. మార్బుల్ పనికి వెళ్లే రెహ్మాన్‌కు చేతివాటం బాగా ఉంది. ఇంటి నుంచి పనికి వెళ్తున్నట్టు బయలుదేరిన రెహ్మాన్ నేరుగా విజయవాడ రైల్వేస్టేషన్‌కు చేరుకుంటాడు. అక్కడ ప్లాట్‌ఫాంలపై తిరుగుతూ మిగతా 6లో..

పల్లెల్లో కొలువైన గణనాథుడు



విజయవాడలో నిమజ్జనానికి గణనాథులను తీసుకెళ్తున్న భక్తులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ): విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుడికి వీధులన్నీ పట్టం కట్టాయి. పండుగ రోజు తెల్లవారు జాము నుంచి ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాన్ని సైతం లెక్క చేయకుండా భక్తులు గణపతి విగ్రహాలు ఏర్పాటు చేసి పూజించారు. ప్రభుత్వం వెల్లడించిన లెక్కల ప్రకారం ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 3,300 పందిళ్లలో గణపతి కొలువై ఉన్నాడు. అనధికారికంగా మరో 1,500 ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఇవే కాకుండా అపార్ట్‌మెంట్‌లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, వ్యాపార సముదాయాల్లో వేల సంఖ్యలో గణపతి విగ్రహాలు ఏర్పాటు చేసి భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. తొలుత ఉదయం ఏడు గంటల వరకు ఎలాంటి వ్యాపారాలు లేక రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన స్టాళ్లు బోసిపోయాయి. ఆ తర్వాత నుంచి స్టాళ్ల వద్ద భక్తులు క్యూ కట్టారు. సాయంత్రానికి వర్షం కాస్త తగ్గడంతో సమీపంలోని కాలువలు, కృష్ణానదిలో గణేషుడిని నిమజ్జనం చేశారు.



కట్టలేరు డైవర్షన్ రహదారిపై వరద ప్రవాహం



నల్లవాగు చప్టాపై వరద..



పెద్దాపురం - గూడెంమాధవరం గ్రామాల మధ్య ఏనుగుగడ్డ వాగు ఉధృతి

వణికిస్తున్న.. వరద!



గుర్రపువాగు చప్టాపై ప్రవహిస్తున్న వరదనీరు

- భారీ వర్షాలకు పొంగుతున్న వాగులు, వంకలు
- నీట మునుగుతున్న పంటపొలాలు
- కాల్వలకు గండ్లు.. రోడ్లపైకి వరద నీరు
- పలు గ్రామాలకు స్తంభించిన రాకపోకలు

గంపలగూడెం/తిరువూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడనం కారణంగా బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు పొంగి పొర్లుతున్నాయి. దీంతో పలు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. గురువారం ఉదయం గంపలగూడెం మండలంలో 8.76 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. తోటమూల-వినగడప రహదారిమధ్య కట్టలేరు డైవర్షన్ రహదారిపై వరదనీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. కట్టలేరు పరీవాహక ప్రాంతాలైన, కనుమూరు, అనుముల్లంక, వినగడప, కొత్తపల్లి గ్రామాల్లో పంటపొలాలు నీటమునిగాయి. కొణిజర్ల-నెమలి రహదారిలో నల్లవాగు, నెమలి-ఉమ్మడిదేవరపల్లి గ్రామాల మధ్య అనురాధ వాగు పొంగిపొర్లడంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పంట పొలాలు నీటమునిగాయి. గంపలగూడెం నల్లచెరువు అలుగునుంచి భారీగా వరదనీరు ప్రవహిస్తుండటంతో పొలాలు నీటమునిగాయి. గంపగూడెం-చింతలపాడు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మొగుళ్లవాగు పొంగి ప్రవహిస్తుండటంతో అమ్మిరెడ్డిగూడెం-గోసవీడు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ఊటుకూరు ఊరచెరువు అలుగునుంచి నీరు భారీగా ప్రవహిస్తుండటంతో ఆయకట్టు పరిధిలోని పొలాలు నీటమునిగాయి.

- తిరువూరు ఎన్ఎస్పీ మేజర్ కాల్వకు సుందరయ్యకాలనీ సమీపంలో గండిపడి నీరు సమీపంలోని ఖాళీ స్థలం మీదుగా, కుంకుడు కాల్వ ద్వారా దేవసముద్రంలోకి చేరుతోంది. కాల్వకు పడిన గండిని, అధికారులు, యుద్ధప్రాతిపదికన ఇసుక బస్తాలతో పూడ్చారు. చింతలపాడు, గంపలగూడెం మధ్య గుర్రవాగు చప్టా పైనుంచి వరదనీరు ప్రవహిస్తుండటంతో రహదారిలో ఉదయం రాకపోకలు నిలిచిపోయాయి. దాదాపు అన్ని చెరువులు నిండిపోవడంతో చేరడంతో, పొతులచెరువు వద్ద కట్టుకాల్వకు గండి పెట్టి పడమటి వాగుకు నీటిని మళ్లించారు. ఎగువన తెలంగాణలో భారీ వర్షాలు, వరదలకు పడమటివాగు, కట్టలేరు, తూర్పువాగు, వెదుళ్లవాగు, విప్లవవాగుల్లో నీరు భారీగా ప్రవహిస్తోంది. అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.



కాల్వకు పడిన గండి

ఉప్పొంగిన దొర్లింతలవాగు

జి.కొండూరు : ఎడతెరిపి లేని వర్షాలకు గడ్డమణుగు లోయ నుంచి ప్రవహించే దొర్లింతల వాగుకు వరద పోటెత్తింది. వాగు ఆక్రమణకు గురికావడంతో వరద నీరు జి.కొండూరు పంటపొలాలు, సమీపంలో ఉన్న ఇళ్లలోకి చేరుతోంది. వాగు ఆక్రమణలు తొలగించకపోవడం వల్ల పొలాలు, ఇళ్లు నీట మునుగుతున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏనుగుగడ్డ వాగుకు వరద

వీరులపాడు : ఏనుగు గడ్డ వాగుకు వరద పోటెత్తింది. పెద్దాపురం-గూడెంమాధవరం రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. ఏనుగుగడ్డ వాగు పరీవాహక ప్రాంతంలో పంట పొలాలు ముంపుబారిన పడ్డాయి.

నీటమునిగిన పంట పొలాలు

పెనుగంచిప్రోలు: మండలంలో కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. లింగగూడెం పెనుగంచిప్రోలు మధ్య అలుగు గురువారం పొంగి ప్రవహించింది అనిగండ్లపాడు నుంచి పెనుగంచిప్రోలు రహదారిలో కూచి వాగు, దూళ్లవాగుల మధ్య వరద పోటెత్తడంతో ముచ్చింతల, అనిగండ్లపాడు గ్రామాలకు చెందిన సుమారు 50 ఎకరాల పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. భారీ వర్షం వల్ల పొలంలో నీరు నిలబడిపోతుందని, ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూడాలని రెండు గ్రామాల రైతులు విజప్తి చేస్తున్నారు. వరద వల్ల మండలంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తహసీల్దార్ ఎ.శాంతిలక్ష్మి, పోలీస్, రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశారు.

వర్షాలు, వరదలపై అప్రమత్తంగా ఉన్నాం

- ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- క్షేత్రస్థాయి అధికారులు సూచనలను పాటించండి
- కృష్ణా, బుడమేరు, మున్నేరు ప్రవాహంపై నిరంతర పర్యవేక్షణ
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వర్షాలు, వరదలపై పూర్తి అప్రమత్తంగా వున్నామని, కృష్ణానదితో పాటు బుడమేరు, మున్నేరులో ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. గురువారం కలెక్టర్ లక్ష్మీశ, కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్ (సీసీసీ) నుంచి జిల్లాలో వర్షాలు, వరదల పరిస్థితిని సమీక్షించారు. రెవెన్యూ, ఇరిగేషన్, వైద్య, ఆరోగ్య, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్, అగ్నిమాపక, విద్యుత్ తదితర శాఖల అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, గ్రామ, వార్డు సచివాలయం యూనిట్‌గా 24-7 ప్రత్యేక పర్యవేక్షణ బృందాలు, వరద స్పందన బృందాలు క్రియాశీలంగా వున్నాయన్నారు. కృష్ణా వరదకు సంబంధించి ఎప్పటికప్పుడు పరిస్థితిని పరివాహక గ్రామాల ప్రజలకు తెలియజేస్తున్నట్టు తెలిపారు. 95 గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసినట్టు వెల్లడించారు. బ్యారేజీకి ఎగువ, దిగువ ప్రాంతాల ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నామన్నారు. కృష్ణానదిలో వరద ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో మత్స్యకారులు చేపలవేటకు వెళ్లొద్దన్నారు. ఇబ్రహీంపట్నం మండలం చినలంక, పెదలంకకు చెందిన కుటుంబాలు సురక్షితంగా ఉండేందుకు చర్యలు తీసుకున్నట్టు వెల్లడించారు. బుడమేరు, మున్నేరులో ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, వెలగలేరు రెగ్యులేటర్ వద్ద ప్రత్యేక బృందాలు వున్నాయన్నారు. ప్రస్తుతానికి ఈ వాగుల్లో ప్రవాహాలు సాధారణంగానే వున్నందున ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. 32 పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించినట్టు వివరించారు. ముందుజాగ్రత్త చర్యల్లో ప్రజలు, అధికారులు, సిబ్బందికి సహకరించాలని, హెచ్చరికలను తేలిగ్గా తీసుకోవద్దని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

వర్షాలు, వరదల నేపథ్యంలో 9154970454 కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ కేంద్రం ఏర్పాటు చేశామని, ఇందులో సమన్వయ శాఖల అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో వర్షపాతం.. వాగుల్లో ప్రవాహ

9154970454

పరిస్థితి.. తదితర అంశాలను నిరంతరం సేకరిస్తున్నట్టు తెలిపారు. రియల్ టైం సమాచారం అందుబాటులో వున్నందున ప్రజలు సమాచారం కోసమైనా, సహాయానికైనా కమాండ్ కంట్రోల్ కేంద్రానికి ఫోన్ చేయొచ్చని సూచించారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే జాగ్రత్తగా వుండాలని, వదంతులను నమ్మొద్దని కలెక్టర్ లక్ష్మీశ కోరారు.

కాంగ్రెస్ ఓటు బ్యాంకు మళ్లీ తెచ్చుకుంటాం: షర్మిల



అమరావతి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సంప్రదాయ ఓటు బ్యాంకును మళ్లీ వెనక్కు తెచ్చుకుంటామని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి దశాబ్దాలుగా ఓటు బ్యాంకుగా ఉన్న ముస్లిం, క్రైస్తవుల విశ్వాసాన్ని సాధిస్తామని ఆమె పేర్కొనారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో గురువారం ముస్లిం మైనారిటీ నేతలతో ఆమె సమావేశమయ్యారు. మతతత్వ బీజేపీ పాలనలో మైనారిటీలకు రక్షణలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మధ్య బీజేపీ చిచ్చు పెట్టి ఆ మంటల్లో బీజేపీ చలి కాచుకుంటోందని ఆరోపించారు. టీడీపీ, జనసేన, వైసీపీ... మోదీతో జట్టుకట్టాయి' అని షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో గుద్దులాట.. కేంద్రంలో ముద్దులాట

- జగన్ తీరుపై నారాయణ మండిపాటు

న్యూఢిల్లీ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతో వైసీపీ విభేదిస్తోంది. కేంద్రంలో మాత్రం దాసోహం అంటోంది. జగన్ రాష్ట్రంలో గుద్దులాట, కేంద్రంలో ముద్దులాట ఆడుతున్నారు' అని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ మండిపడ్డారు. గురువారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'తెలుగుజాతి ప్రయోజనాల కోసమే ఆవిర్భవించిన టీడీపీ, ఇప్పుడు తెలుగువ్యక్తి గెలుపులో భాగం కావాల్సిన అవసరం ఉంది. తెలుగు వ్యక్తికి ఎందుకు మద్దతివ్వడంలేదో పవన్‌కల్యాణ్ సమాధానం చెప్పాలి. వైసీపీ కేంద్రంలో బీజేపీకి మద్దతిస్తామనడం దేనికి సంకేతం?' అని నారాయణ ప్రశ్నించారు.

1000 మెగావాట్ల 'వేదాంత' థర్మల్ ప్లాంట్ సిద్ధం

తిరుపతి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వేదాంత అనుబంధ సంస్థ మీనాక్షి ఎనర్జీ లిమిటెడ్ (ఎంఈఎల్) స్థాపించిన థర్మల్ విద్యుత్ ప్లాంట్ పూర్తిస్థాయిలో 1000 మెగావాట్ల ఉత్పత్తికి సిద్ధమైంది. విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి ట్రయల్ రన్ కూడా విజయవంతంగా పూర్తి చేసుకుంది. దీంతో సదరన్ రీజనల్ లోడ్ డిస్పాచ్ సెంటర్ నుంచీ కమర్షియల్ ఆపరేషన్ డేట్ కూడా ఖరారైంది. ఈ మేరకు ఆ సంస్థ ఓ ప్రకటనలో వివరాలు వెల్లడించింది.

ఆక్వా రంగానికి పెను ప్రమాదం

- అమెరికా సుంకాలపై జోక్యం చేసుకోవాలి.. కేంద్రానికి ఏపీ చాంబర్స్ లేఖ

అమరావతి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రొయ్యల ఎగుమతులపై అమెరికా విధించిన 50 శాతం సుంకాల ప్రభావం ఆక్వా రంగంపై తీవ్రంగా ఉందని అని రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య (ఏపీ చాంబర్స్) ఆందోళన వ్యక్తం చేసింది. తక్షణ ఉపశమన చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ గురువారం కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి జితిన్‌రామ్ మాంఝీకి, కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు లేఖలు రాశారు.

రియల్ ఎస్టేట్ ఏజెంట్లు 'రెరా'లో నమోదు చేసుకోవాలి

అమరావతి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికీ రిజిస్టర్ కాని రియల్ ఎస్టేట్ ఏజెంట్లు రెరా (రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ)లో నమోదు చేసుకోవాలని మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్ ఓ ప్రకటనలో కోరారు. 30రోజుల్లో నమోదు చేసుకోకపోతే చట్టపరంగా జరిమానాలు విధిస్తామన్నారు.

బెజవాడలో 'ఎండీఎంఏ' డ్రగ్స్ కలకలం

విజయవాడ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): విజయవాడలో డ్రగ్స్ కలకలం రేగింది. విశాఖపట్నం మురళీనగర్ ఎన్జీవో కాలనీ పీఆర్ఆర్ గార్డెన్స్‌కు చెందిన అర్నా శ్రీవాత్సవ బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్నారు. విశాఖ సీబీఎం క్యాంపస్‌కు చెందిన బొడ్డేపల్లి హవీల డిలైట్ నాగపూర్ నిట్‌లో ఇంజనీరింగ్ తర్వాత ఎంబీఏ పూర్తి చేశారు. శ్రీవాత్సవ, హవీలకు ఐదేళ్ల నుంచి డ్రగ్స్ తీసుకునే అలవాటు ఉంది. ఈ ఇద్దరూ ఈ నెల 13న వైజాగ్ నుంచి గోవా వరకు బస్సులో వెళ్లారు. అక్కడినుంచి బెంగళూరు వచ్చి 20 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్ కొనుగోలు చేశారు. అందులో ఒక గ్రాము వినియోగించారు. మిగిలిన డ్రగ్స్‌తో బుధవారం బెంగళూరు నుంచి విశాఖకు బస్సులో బయలుదేరారు. దీనిపై సమాచారం అందుకున్న ఈగల్ బృందం విజయవాడ జాతీయ రహదారిని అనుకుని ఉన్న మహానాడు జంక్షన్ వద్ద బస్సును ఆపారు. శ్రీవాత్సవ, హవీల లగేజీ తనిఖీ చేసి 19 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నారు.

మినుము వర్షార్పణం!

- భారీ వర్షాలతో రైతుకు నష్టం



కంచికచర్ల సర్వీస్ రోడ్డులో ఆరబోసిన పెసలు, మినుము, గింజల నుంచి వచ్చిన మొలకలు

(కంచికచర్ల - ఆంధ్రజ్యోతి) భారీ వర్షాలు మినుము పంటకు తీవ్ర నష్టం మిగిల్చాయి. చేతికి వసున్న తరుణంలో భారీ వర్షాలు పడటంతో పండిన పంటంతా వర్షార్పణమైంది. రెండు రోజుల్లోనే పంట నాశనం కావటంతో రైతులు అల్లాడుతున్నారు. కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో తొలకరిలో రైతులు పదివేల ఎకరాలకు పైగా పెసర, మినుము పంట సాగు చేశారు. ఎకరానికి రూ. 25 వేలు పెట్టుబడి పెట్టారు. పంటలు కోతకు రావడంతో ఇతర ప్రాంతాల నుంచి పదుల సంఖ్యలో కోత యంత్రాలను తెచ్చారు. వారం రోజులు పొడి వాతావరణంలో దాదాపుగా పెసర కోతలు పూర్తయ్యాయి. మినుము కోతలు 50 శాతం వరకు అయ్యాయి. ఎకరానికి రెండు నుంచి నాలుగు బస్తాల వరకు దిగుబడి వస్తున్న సమయంలో రెండ్రోజులు ఎడతెగకుండ కురిసిన భారీ వర్షాలకు మినుము పూర్తిగా దెబ్బతిన్నది. తేమ ఆరకపోవటంతో కాయలు కుళ్లిపోతున్నాయి. గింజలు మొలకలు వస్తున్నాయి. పంటంతా వర్షం వల్ల నేలపాలైంది. చేలల్లో ఇక గింజకూడా రాదని రైతులు వాపోతున్నారు. రెండు రోజులు పొడి వాతావరణం ఉంటే.. పంటంతా సజావుగా ఇంటికి వచ్చేదని, అలాంటిది కళ్లముందే పంట నాశనం కావటంతో రైతులు అల్లాడుతున్నారు. యంత్రాలతో కోయటం వల్ల గింజల్లో తేమ శాతం ఎక్కువగా ఉండటంతో పలువురు రైతులు కంచికచర్ల బైపాస్ రోడ్డు వెంబడి సర్వీసు రోడ్డులో పెసలు, మినుములు ఆరబోశారు. రాశులపై పట్టాలు కప్పినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. గింజలు తడిసిపోయాయి. చినుకులు పడుతుండటంతో ఆరబోయటానికి కూడా వీలులేకుండా పోయింది. కోసిన పంట కూడా దెబ్బతినటంతో అన్ని విధాలుగా నష్టపోవాల్సి వచ్చిందని రైతులు వాపోతున్నారు.

యూరియా లారీ పట్టివేత

ఊటుకూరు(గంపలగూడెం) : మినీలారీలో అక్రమంగా తరలిస్తున్న యూరియాను పోలీసులు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం నందిగామలోని మనగ్రోమోర్ దుకాణం నుంచి మినిలారీలో పోనాయ యా పాలెం మీదుగా అక్రమంగా తెలంగాణ రాష్ట్రం ఖమ్మంజిల్లాకు చెందిన కల్లూరుకు తరలిస్తున్నారన్న సమాచారంతో, ఊటుకూరు చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేయగా మినీ లారీలో 40 బస్తాల యూరియా, 35 ఆర్గానిక్ పొటాష్ బస్తాలు ఉన్నట్టు ఎస్ఐ తెలిపారు. వ్యవసాయశాఖాధికారి వల్లభనేని హరీష్‌కుమార్ ఫిర్యాదు మేరకు అక్రమంగా రవాణా చేస్తున్న మార్గంపూడి కుమార్, కన్నెగంటి సాగర్‌లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు, వాహనాన్ని స్టేషన్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.



డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

(5వ పేజీ తరువాయి)

అధికారి ధూర్జటి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. డీఎస్సీలో అర్హత సాధించి సర్టిఫికెట్‌లు సమర్పించిన వారిలో ఒకరిద్దరు అభ్యర్థులపై పోలీస్ కేసులు నమోదై ఉన్నట్లుగా తేలడంతో, వారిపై ఎలాంటి కేసులు నమోదయ్యాయనే అంశంపైనా అధికారులు వివరాలు సేకరించారు.

కాల్ లెటర్‌లు రాలేదని ఆందోళన

నోబుల్ కళాశాలకు పలువురు అభ్యర్థులు వచ్చి తమకు డీఎస్సీలో అధిక మార్కులు వచ్చినప్పటికీ కాల్‌లెటర్ రాలేదని, తమ కంటే తక్కువ మార్కులు వచ్చిన వారికి కాల్ లెటర్‌లు వచ్చాయని అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ సర్టిఫికెట్ల పరిశీలన ఒక్కరోజులోనే పూర్తికాదని, నాలుగైదు రోజులపాటు కొనసాగుతుందని పాఠశాల విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసన్నకుమార్, కృష్ణా డీఈవో పీవీజే రామారావు చెప్పారు. ఒకటీ రెండు రోజుల్లో కాల్ లెటర్లు వస్తాయని, కంగారు పడవద్దని అభ్యర్థులకు వివరించారు.

ఎస్సీ, బీసీలకు ఓపెన్ కేటగిరిలో పోస్టులు చూపడం లేదు

ఎస్సీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన అభ్యర్థులు వంద మార్కులకు గాను 94 నుంచి 95 మార్కులు సాధించినా, వారికి ఓపెన్ కేటగిరిలో పోస్టింగ్ చూపకుండా, వారి సామాజిక వర్గం కోటాలోనే పోస్టింగ్‌లు చూపుతున్నారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అంటున్నారు. అధిక మార్కులు సాధించిన ఎస్సీ బీసీ సామాజిక వర్గాల వారికి ఓపెన్ కేటగిరిలో పోస్టులు ఇస్తే, తక్కువ మార్కులు సాధించిన వారిలో కొందరికి టీచర్ పోస్టులు వస్తాయని పేర్కొంటున్నారు. అధిక మార్కులు సాధించిన ఎస్సీ బీసీ అభ్యర్థులకు ఓపెన్ కేటగిరిలో పోస్టులు చూపకుండా కృష్ణా, గుంటూరు జిల్లాల అధికారులు వ్యవహరిస్తున్నారని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఉపాధ్యాయ సంఘాలకు చెందిన వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్‌లు గురువారం చక్కర్లు కొట్టాయి.

వర్షాలు.. వరదలు

(5వ పేజీ తరువాయి)

కలుస్తుంది. కీసర నుంచి కట్టలేరు ఒక్కటిగా కృష్ణానదిలో కలుస్తోంది. జిల్లాలోని వాయువ్య, ఉత్తర ప్రాంతాలలో వాగులు, వంకలు ప్రవహిస్తుండటం వల్ల బుడమేరుకు స్వల్పంగా వరద పెరిగింది. గురువారం నాటికి 3,500 క్యూసెక్కుల వరద నీరు మాత్రమే వస్తోంది. విజయవాడ నగరంలోని తూర్పు, పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల పరిధిలో భారీ వర్షం కురిసింది.

రోడ్లపైకి వరద నీరు

జిల్లాలో కురిసిన వర్షాలకు ఆర్అండ్‌బీ రహదారులపై వరద కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వైరా ఏరు కారణంగా మధిర వెళ్లే రోడ్డులో కూడలి దగ్గర రాకపోకలు నిలిచిపోయాయి. నల్లవాగు కారణంగా నందిగామ నుంచి చందర్లపాడు సమీప ప్రాంతాలకు రాకపోకలు ఆగిపోయాయి. ఏనుగుగడ్డ వాగు కారణంగా పెద్దాపురం నుంచి గూడెం మాధవరం గ్రామాల మధ్యన రాకపోకలు నిలిచిపోయాయి. రెడ్డిగూడెం నుంచి ఓబుళాపురానికి వెళ్లే రోడ్డుపై వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు ఆగిపోయాయి. మైలవరం పట్టణంలో బాలయోగి నగర్ - సూరిబాబు పేట మధ్య వర్షపు నీటి ఉధృతి కారణంగా రాకపోకలు నిలిచిపోయాయి. తిరువూరు - గంపలగూడెం గ్రామాల మధ్య చింతలపాడు వద్ద ఉన్న లో లెవల్ చప్టాపై వరద ప్రవాహం ఉధృతం కావడంతో బుధవారం రాత్రి రాకపోకలు నిలిచిపోయాయి. మైలవరం అయ్యప్పనగర్ దగ్గర విజయవాడ - ఛత్తీస్‌గఢ్ మార్గంలో స్వల్పంగా వరద నీరు రోడ్డు మీద నుంచి ప్రవహిస్తోంది. ఉమ్మడిదేవరపల్లి - నెమలి గ్రామాల మధ్య అనురాధ వాగు ఉప్పొంగింది. ఊటుకూరు - కొణిజర్ల మధ్య నల్లవాగు ఉధృతికి ఆయా గ్రామాల మధ్య రాకపోఉలు నిలిచిపోయాయి. విస్సన్నపేట ఎన్టీఆర్ కాలనీలో ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరి కాలనీ వాసులు ఇబ్బందులు పడ్డారు. వాగులు పొంగుతుండటంతో చందర్లపాడు - పాటెంపాడు మధ్య, గుడిమెట్ల- లక్ష్మీపురం గ్రామాల మధ్య, ముప్పాళ్ల - తుర్లపాడు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కంచికచర్ల నుంచి చెవిటికల్లు మార్గంలో పలు వాగులు ఆర్అండ్‌బీ రోడ్డుపై ప్రవహిస్తుండటంతో చెవిటికల్లు, కునికినపాడు, మున్నలూరు, మోగులూరు తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

ఎన్ఎస్పీ మేజర్ కాలువ కట్టకు గండి :

తిరువూరు ఎన్ఎస్పీ మేజర్ కాలువ కట్టకు గండి పడింది. అయితే దాని వల్ల పెద్ద ప్రమాదం ఏం జరగలేదు. అధికారులు స్పందించి వెంటనే గండిని ఇసుక బస్తాలతో పూడ్చించారు. పంటలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదు.

ఏసీ బోగీలే టార్గెట్

(5వ పేజీ తరువాయి)

వచ్చేపోయే రైళ్లలో ఏసీ బోగీలపై కన్నేస్తాడు. లోపలకు వెళ్లి పరిస్థితి తనకు అనుకూలంగా ఉంటే సెకన్ల వ్యవధిలో వస్తువులు మాయం చేస్తాడు.

సెల్‌ఫోన్లతో మొదలై..

రెహ్మాన్ ఇంతకుముందు రైల్వేస్టేషన్ తిరుగుతూ సెల్‌ఫోన్లను చోరీ చేసేవాడు. ఈ కేసుల్లో పోలీసులు పలుమార్లు అరెస్టు చేశారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత రెహ్మాన్ టార్గెట్ మార్చుకున్నాడు. గుజరాత్‌కు చెందిన కోహీజం అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి చెన్నైలో బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యక్రమానికి బయలుదేరారు. మొత్తం ఐదుగురు కుటుంబసభ్యులు ఈ నెల 15న గుజరాత్‌లో భగత్‌కోటి ఎక్స్‌ప్రెస్ ఏ1లో ఎక్కారు. రైలు 16న సాయంత్రం నాలుగు గంటలకు విజయవాడ చేరుకుంది. అక్కడే ఉన్న రెహ్మాన్ ఏ1 బోగీలోకి ఎక్కాడు. కోహీజం కుటుంబం నిద్రలో ఉండటంతో బెర్త్ కింద ఉన్న బ్యాగ్‌ను మాయం చేశాడు. తర్వాత చూసుకోగా బ్యాగ్ కనిపించలేదు. దీంతో ఆయన టోల్‌ఫ్రీ నంబరు 139కి ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. సమాచారం జీఆర్పీ పోలీసులకు అందింది. బాధితులు తిరిగి గుజరాత్ మార్గంలో 24న జీఆర్పీకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. వారు వెంటనే రంగంలో దిగి సీసీ ఫుటేజీలను పరిశీలించగా రైలు బోగీలోకి ఎక్కినట్టు కనిపించింది. బ్యాగ్ తీసుకుని రెండో ద్వారం వైపు దిగినట్టు కనిపించింది. నిందితుడి కోసం పోలీసులు మొత్తం 104 సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. రెహ్మాన్ చోరీ చేసినట్టు గుర్తించారు. బ్యాగ్‌ను ఇంటికి తీసుకెళ్లి భద్రంగా ఉంచి.. అవసరాల కోసం అందులో ఉన్న బంగారు ఉంగరం, గొలుసును తాకట్టు పెట్టాడు. వన్‌టౌన్‌లో రెహ్మాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి మొత్తం రూ.10,61,318బంగారు వస్తువులు, సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో రూ.8లక్షల ఆభరణాలు కోహీజం కుటుంబానికి సంబంధించినవే. నిందితుడిపై ఇంతకుముందు సెల్‌ఫోన్ చోరీ కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు.



అనిగండ్లపాడు వద్ద చెరువును తలపిస్తున్న పొలాలు



హెచ్.ముత్యాలంపాడు వద్ద బుడమేరు డైవర్షన్ చప్టాపై ప్రవహిస్తున్న వరదను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

లోతట్టు ప్రాంతాలు అప్రమత్తం

- కలెక్టర్ లక్ష్మీశ

జి.కొండూరు : బుడమేరు ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని సమీక్షించాలని స్థానిక అధికారులను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. గురువారం ఆయన జి.కొండూరు మండలం హెచ్.ముత్యాలంపాడు-కందులపాడు గ్రామాల మధ్య బుడమేరు లో లెవల్ చప్టాపై వరదను పరిశీలించారు. ప్రస్తుతం బుడమేరుకు వరద నిలకడగా ఉన్నా వర్షాలు పడుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలి

- ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్ : కృష్ణానదికి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టే విధంగా చర్యలుతీసుకోవాలని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ జి.లక్ష్మీశతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. తిరువూరులో వర్షాల ప్రభావంపై ప్రత్యేకంగా చర్చించారు. వాగుల ఉధృతి దృష్ట్యా రాకపోకలు నిలిపివేయాలని, అత్యవసర సహాయకచర్యలు వేగవంతం చేయాలని సూచించారు. గత అనుభవాల దృష్ట్యా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు.

పెరిగిన ఇన్‌ఫ్లో

(5వ పేజీ తరువాయి)

ఎగువ నుంచి 4,43,184 క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో బ్యారేజీ వద్ద ఒకటో నంబరు ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు మూడ సార్లు ఒకటో నంబరు ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. బ్యారేజీ 70 గేట్లలో 69 గేట్లను పూర్తిస్థాయికి ఎత్తి ఎగువ నుంచి వస్తున్న నీటిని మొత్తం కిందికి వదులుతున్నారు. పాలేరు నుంచి 5,660, కీసర నుంచి 27,9025, పులిచింతల నుంచి 3,64,451 క్యూసెక్కుల నీరు వస్తోంది. తూర్పు, పశ్చిమ డెల్టా పరిధిలోని కాల్వలకు 8,540 క్యూసెక్కుల నీటిని ఇస్తున్నారు. తూర్పు డెల్టా పరిధిలోని కాల్వలకు 4,528, పశ్చిమ డెల్టా పరిధిలోని కాల్వలకు 4,012 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	112,121, 132
చికెన్ విత్ స్కిన్	214
చికెన్ స్కిన్‌లెస్	224

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

ప్రత్యేక బీసీ రక్షణ చట్టం తీసుకురావాలి: క్రాంతికుమార్

గాంధీనగర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): బీసీలపై దాడులను అరికట్టేందుకు ప్రత్యేక బీసీ రక్షణ చట్టాన్ని తీసుకురావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధానకార్యదర్శి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. నగరంలోని సంఘం కార్యాలయంలో గురువారం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ గురుకుల విద్యాలయాలు, స్టడీ సర్కిళ్లు, బీసీ విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో వసతి గృహాలు నిర్మించాలని లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సంఘం నగర అధ్యక్షుడు చిప్పాడ చందు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది.

మార్కెటింగ్ సీఈవో ఉల్లిపాయల స్టాల్స్ తనిఖీ



కృష్ణలంక, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైతుబజారులోని ఉల్లిపాయల స్టాల్స్‌ను గురువారం మార్కెటింగ్ శాఖ సీఈవో మాధవీలత అధికారులతో కలిసి తనిఖీ చేశారు. రైతుబజారులో ప్లాస్టిక్ కవర్ల నిషేధం ఖచ్చితంగా అమలుచేయాలని ఎస్టేట్ అధికారి జాన్ విక్టర్‌కు ఆమె సూచించారు.దీనిపై అందరికీ అవగాహన కల్పించాలని ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా కర్నూల్ నుంచి వచ్చిన ఉల్లిపాయల అమ్మకాలపై మాధవీలత ఆరా తీశారు. మార్కెటింగ్ శాఖ సంయుక్త సంచాలకులు కె.శ్రీనివాసరావు, ఏడీఎం బి.రాజా బాబు, ఈవో జాన్ విక్టర్ పాల్గొన్నారు.

మాన్సూన్ టీం అప్రమత్తంగా ఉండాలి

నగర కమిషనర్ ధ్యానచంద్ర

బెంజిసర్కిల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మాన్సూన్ రెస్పాన్స్ టీం అప్రమత్తంగా ఉండాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు. బుధవారం బెంజిసర్కిల్, నిర్మలకాన్వెంట్ రోడ్డు, పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డు, మొగల్రాజుపురం, లాయోలా కాలేజీ రోడ్డు, సీతారాంపురం, ఎంజీరోడ్డు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాన్సూన్ రెస్పాన్స్ టీం ఎప్పటికప్పుడు వర్షపునీటి నిల్వలు రోడ్డుపైన నిల్వ ఉండకుండా చూసుకోవాలని, అధికారులు క్షేత్రస్థాయిలో తమ పరిధిలోని ప్రాంతాలన్నీ పర్యటించి సిబ్బందిని అప్రమత్తంగా ఉంచాలని ఆదేశించారు. కొండ ప్రాంతంలో ప్రమాదకరమైన నివాసాలలో నివసిస్తున్న ప్రజలను అప్రమత్తం చేస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో మైకు ద్వారా అవగాహన కల్పించాలన్నారు. పునరావాస కేంద్రాలను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రకాశం బ్యారేజీ, వెలగలేరు వద్ద ఉన్న ఎమినిటీ సెక్రటరీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నీటి మట్టాన్ని తెలుసుకుంటూ చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.



మురుగునీటి కాల్వను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

దోమల నివారణకు చర్యలు తీసుకోండి

కార్పొరేషన్: ప్రజలు వ్యాధుల బారిన పడకుండా దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం వీఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి వివిధ శాఖాధిపతులతో కమిషనర్ టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వర్షాల దృష్ట్యా ప్రజారోగ్య సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉంటూ నిల్వ ఉన్న నీళ్లలో యాంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహిస్తూ దోమల వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డ్రోన్ సర్వేలెన్స్ ద్వారా ఖాళీ స్థలాల్లో నీటి నిల్వలను గుర్తించి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

చవితి పందిళ్ల వద్ద అల్లర్లు సృష్టిస్తే చర్యలు

● సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్ హెచ్చరిక



కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ దామోదర్

గుణదల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పందిళ్ల వద్ద అల్లర్లు సృష్టించే ఆలోచన చేస్తే సహించేది లేదని ఆయా కమిటీ నిర్వాహకులకు సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్ హెచ్చరికలు జారీ చేశారు. పటమట, గుణదల, మాచవరం పోలీస్ స్టేషన్ల పరిధిలో చవితి పందిళ్లు ఏర్పాటు చేసిన నిర్వాహకులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం కౌన్సెలింగ్ ఇచ్చారు. రామవరప్పాడు రింగ్ రోడ్డు వద్ద ఉన్న ఓ హోటల్లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చవితి పందిళ్ల వద్ద వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అత్యవసర సమయంలో అంబులెన్స్, ఫైర్ ఇంజన్ వెళ్లేందుకు వీలుగా దారి వదిలాలని సూచించారు. నిర్ణీత సమయం వరకు మాత్రమే సౌండ్‌సిస్టమ్ పెట్టుకోవాలని చెప్పారు. ఊరేగింపు సమయంలో కూడా అనుమతులు ఇచ్చిన మేరకు మాత్రమే సౌండ్‌సిస్టమ్ ఏర్పాటు చేసుకుని ప్రశాంత వాతావరణంలో వినాయక ఉత్సవాలు ముగించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. విద్యుత్ కనెక్షన్ల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పటమట, మాచవరం, గుణదల స్టేషన్ల సీఐలు పవన్ కిషోర్, ప్రకాష్, వాసిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జోరువానలోనూ...భక్తిశ్రద్ధలతో చవితి పూజలు

● పందిళ్ల వద్దకు తరలివచ్చిన భక్తులు
● ప్రసాదాల పంపిణీ



కృష్ణలంక ద్వారకానగర్‌లో



వివేకానంద కాలనీలో..



బెజవాడ బార్‌లో..

గుణదల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో బుధవారం ఉదయం నుంచి కుండపోతలా కురుస్తున్న వానను సైతం లెక్క చేయకుండా భక్తులు భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలను ఘనంగా చేసుకున్నారు. వాడ వాడలా వినాయక చవితి పందిళ్ల ఏర్పాటు చేయడంతో నగరంలో పండుగ వాతావరణం సంతరించుకుంది. వినాయకుణ్ణి భక్తులు రక రకాల ఆకృతులతో ఆకర్షణీయంగా అలంకరించారు. ఎస్ఆర్ఆర్ కళాశాల, మాచవరం తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక చవితి పందిళ్లవద్ద నిర్వహించిన ప్రత్యేక పూజల్లో 26వ డివిజన్ కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి పాల్గొన్నారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. డివిజన్ ఇన్‌చార్జ్ వల్లభనేని సతీష్, డివిజన్ అధ్యక్షుడు తోట పాండు తదితరులు పాల్గొన్నారు.

బెజవాడ బార్‌లో...

విజయవాడ లీగల్: బెజవాడ బార్ అసోసియేషన్‌లో జరిగిన వినాయక చవితి వేడుకల్లో బార్ కౌన్సిల్ మెంబర్ చలసాని అజయ్‌కుమార్, బార్ అధ్యక్ష, కార్యదర్శులు ఏకే భాషా, కేవీ రంగారావు, గంధం శ్రీనివాసరావు తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

కృష్ణలంక: కృష్ణలంక సత్యం హోటల్ సెంటర్‌లో శ్రీ గణేష్ మహోత్సవ కమిటీ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చవితి పందిరిలో కమిటీ సభ్యులు ఊటుకూరి జయసింహ దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కమిటీ సభ్యులు వేములపల్లి రంగారావు, పోడూరు పవన్, కొల్లి కుమార్, గరిమెళ్ల నాని, తవ్వా సాయి, తదితరులు పాల్గొన్నారు. ● కృష్ణలంక కల్పన ప్రింట్స్ సెంటర్‌లో టీడీపీ నాయకుడు మండల మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో చవితి పందిరిలో గురువారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని టీడీపీ నాయకుడు బొప్పన భవకుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోరిపర్తి నామేశ్వరరావు, కొర్రా అప్పన్న, గుండు శ్రీను, ముళ్లపూడి నాగేశ్వరరావు, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద కాలనీలో..

పటమట: టీడీపీ నాయకుడు బెజవాడ నజీర్ ఆధ్వర్యంలో వివేకానంద కాలనీలో ఎఫ్‌సీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి పటమట సీఐ పవన్‌కిషోర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్, 10వ డివిజన్ కార్పొరేటర్ అపర్ణ, కోగంటి సత్యం, ఎర్నేని వేదవ్యాస్, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

ద్వారకానగర్‌లో..

రాణిగారితోట: కృష్ణలంక ద్వారకానగర్‌లో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో టీడీపీ తూర్పు బీసీ సెల్ అధ్యక్షుడు కొక్కిర తిరుపతయ్య యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంద్ర రాజు, కామశ్శ చిన్ని, నీవన్ కుమార్, శ్రీనివాస్, మేలినాటి మోహన్, లక్ష్మీత్ సాయి, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంపై ప్రదర్శనశాల ప్రారంభం



నేత్రదానం పత్రం అందజేస్తున్న డాక్టర్ వెలగా జోషి

పటమట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): స్వేచ్ఛా గోరా ఐబ్యాంక్ ఆధ్వర్యంలోని నేత్ర దానం ప్రచార పక్షోత్సవాల సందర్భంగా నాస్తిక్ కేంద్రంలో అవగాహన ప్రదర్శనశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఓఎస్‌డీ డాక్టర్ వెలగా జోషి మాట్లాడుతూ ప్రభుత్వాలు స్వచ్ఛంద సంస్థలు కలిసికట్టుగా కృషిచేస్తే నల్లగుడ్డు అంధత్వ నివారణ చాలా సులువని తెలిపారు. స్వేచ్ఛా గోరా ఐబ్యాంక్ ద్వారా దాదాపు 900 మందికి చూపును ప్రసాదించిన డాక్టర్ సమరం, యాజమాన్యాన్ని కొనియాడారు. జోషి తన కళ్లను దానం చేసినట్లు పత్రాన్ని సమర్పించారు. సెప్టెంబరు 2 వరకు ప్రదర్శన శాల విద్యార్థులు, ప్రజలు సందర్శనార్థం ఉదయం నుంచి సాయంత్రం వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. డైరెక్టర్ డాక్టర్ సమరం, రష్మి, ఐ బ్యాంక్ మేనేజర్ రవి, పాల్గొన్నారు.

క్వాంటమ్ వ్యాలీపై విద్యార్థులకు మెళకువలు



క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ బృందం

మొగల్రాజపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పీబీ సిద్ధార్థ కళాశాల డేటా సైన్సు, ఏఐ విభాగాలు గురువారం కళాశాల ఏఐ ల్యాబ్‌లో క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ నిర్వహించాయి. అమెరికన్ కంపెనీ ఎమిర్జాజెన్ ఏఐ విభాగం డెవలపర్ సీహెచ్ గుణశేఖర్ ఈ కార్యక్రమానికి పరిశీలకులుగా వచ్చారు. విద్యార్థులకు క్వాంటమ్ వ్యాలీకి సంబంధించిన మెళకువలను వివరించారు. డేటా సైన్సు విభాగాధిపతి డాక్టర్ ఉదయశ్రీ మాట్లాడుతూ క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టుకు కళాశాల నుంచి 8 బృందాలకు శిక్షణ ఇస్తున్నామని, ఒక్కో బృందంలో నలుగురు విద్యార్థులు ఉంటారని, మొత్తం 15 శీర్షికలుగా సాగే శిక్షణలో ఐదుగురిని ఎంపిక చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూ రావు, అకడమిక్ అడ్వైజర్ డాక్టర్ ఎలికె మోహన్ రావు, అధ్యాపకురాలు సంహిత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ మూడో విడత ప్రవేశాలకు కౌన్సెలింగ్ నేడు

భారతీనగర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2025-26/27 విద్యా సంవత్సరానికి మూడో విడత అడ్మిషన్స్ కొరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం ఉదయం 8గంటల నుంచి కౌన్సెలింగ్ జరుగుతుందని ఐటీఐ ప్రధానాధికారి, కన్వీనర్ ఎం.కనకారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆయా మెరిట్ నెంబర్ ప్రకారం మీ ఒరిజనల్ సర్టిఫికెట్స్, కుల ధ్రువీకరణ పత్రం, ఆర్థికంగా బలహీనమైన విభాగం(ఈడబ్ల్యూఎస్ పత్రం), ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్స్‌లతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు. ప్రభుత్వ ఐటీఐలో అడ్మిషన్ పొందిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు మినహా మిగిలిన కేటగిరి అభ్యర్థులు రూ.60 కాషన్ డిపాజిట్ చెల్లించాలని, ప్రైవేట్ ఐటీఐలలో చేరే అభ్యర్థులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజు చెల్లించాలని తెలిపారు. శుక్రవారం ఉదయం 8గంటలకు మెరిట్ నెంబర్ 1 నుంచి 128వరకు, గ్రేడ్ పాయింట్ 10 నుంచి 2.2వరకు గల అభ్యర్థులు హాజరుకావాలని తెలిపారు. మెరిట్ నెంబర్‌కు జిల్లా కన్వీనర్ కార్యాలయం, ప్రభుత్వ ఐటీఐలోని హెల్ప్ డెస్క్‌లో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 0866 2475575, 9490639639, 7780429468లో సంప్రదించాలని తెలిపారు.

సుంకర రత్నకుమారికి నివాళి

హాజరైన ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, ఎమ్మెల్యేలు బోడె, గద్దె



సుంకర రత్నకుమారి చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న కొనకళ్ల, గెద్దె తదితరులు

కానూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జవహర్ ఆటోనగర్ ఐలా సర్వీస్ సొసైటీ మాజీ చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్ సతీమణి సుంకర రత్నకుమారి పెదకర్మ కార్యక్రమం గురువారం తాడిగడప వంద అడుగుల రోడ్డులోని అన్నేవారి కల్యాణమండపంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, స్వచ్ఛభారత్ కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, విజయవాడ మాజీ మేయర్ కోనేరు శ్రీధర్, అన్నేవారి కల్యాణమండపం అధినేత అన్నే శివనాగేశ్వరరావు, ప్రముఖ పారిశ్రామికవేత్త కొగంటి సత్యం, ఆటో ఎలక్ట్రికల్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ కలాం, నేతలు కత్తిక శివనాగేశ్వరరావు, బి. కోటేశ్వరరావు, కొమ్మిడి శ్రీనివాసరెడ్డి, గౌస్‌ఖాన్, బి. నాగేశ్వరరావు, సామ్రాట్, ఎండీ రిజ్వాన్, టి. చంద్రశేఖర్, జాస్తి సురేష్ తదితరులు పాల్గొని రత్నకుమారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె భర్త సుంకర దుర్గాప్రసాద్‌తో పాటు కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

కార్యక్రమంలో పలు సంఘాల నేతలు, ఆటోనగర్‌లోని వివిధ కార్ఖానాల్లో పనిచేసే సిబ్బంది పాల్గొన్నారు.



దుర్గాప్రసాద్‌ను పరామర్శిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్

సుంకర దుర్గాప్రసాద్‌కు ఎంపీ పరామర్శ

భారతీనగర్: విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ బుధవారం గురునానక్ కాలనీలోని సుంకర దుర్గాప్రసాద్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియపర్చారు. సుంకర రత్నకుమారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థించారు. టైలర్ అసోసియేషన్ సెక్రటరీ సూరపనేని సురేష్, పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య సూచన



అశోక్‌లేలాండ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్యతో ప్రతినిధులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామికవాడ ద్వారా వెలువడే కాలుష్య కారకాలను నియంత్రించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఏపీపీసీబీ(ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్) చైర్మన్ డాక్టర్ పి. కృష్ణయ్య పారిశ్రామికవేత్తలకు సూచించారు. మల్లవల్లి (ఏపీఐఐసీ)లోని వివిధ పరిశ్రమలను గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అశోక్‌లేలాండ్, మోహన్ స్పింటెక్స్, వెంకటేశ్వర పేపర్ మిల్‌తో పాటు వివిధ పరిశ్రమల్లో ఉత్పత్తుల తయారీ, కాలుష్యాన్ని తగ్గించేందుకు తీసుకున్న చర్యలను ఆయన పరిశీలించారు. పరిశ్రమల నుంచి వెలువడే వాయుకాలుష్యాన్ని నివారించేలా మొక్కలు పెంచాలని, పారిశ్రామిక వ్యర్థాలతో కూడిన చెత్తను సురక్షితంగా తరలించడం, మురుగు నీటి శుద్ధి తదితర విషయాలపై పరిశ్రమల ప్రతినిధులతో చర్చించారు. మల్లవల్లి పారిశ్రామికవాడ మరింత అభివృద్ధి చేసేలా తన వంతు సహకారం అందిస్తామని చైర్మన్ కృష్ణయ్య పారిశ్రామికవేత్తలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీసీబీ ఈఈ శ్రీనివాసులు, అశోక్‌లేలాండ్ యూనిట్ ఇన్‌చార్జి శ్రీధరన్, మోహన్ స్పింటెక్స్ ప్రతినిధి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



రామ్ మోహనరావును సత్కరిస్తున్న అధ్యాపకులు

నైతిక విలువల పెంపు బాధ్యత ఉపాధ్యాయులదే

మాచవరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ విద్యా విధానం 2020పై ఏపీ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్, ప్రొఫెసర్ కట్టా రామ్ మోహన్‌రావు ఉపన్యాసం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మీ తెలిపారు. భవిష్యత్తు కోసం ఉన్నత విద్యను రూపొందించుకోవడంలో ఉపాధ్యాయుడు పాత్ర అనే అంశంపై ఆయన మాట్లాడుతూ విద్య భవిష్యత్ ఉపాధ్యాయులపై ఆధారపడి ఉంటుందని, విద్యార్థులను ప్రేరేపించే శక్తి, నైతిక విలువలు పెంపు బాధ్యత ఉపాధ్యాయులకే ఉంటుందని తెలిపారు. విద్యా డైరెక్టర్ డాక్టర్ నారాయణ భరత్ గుప్తా, ఐక్యూఏసీ కో- ఆర్డినేటర్ నాగేశ్వరరావు, డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం, రమేష్, యుగంధర్, పాల్గొన్నారు.

రోడ్లను ముంచెత్తిన మురుగు



గుణదల పుల్లేటి కట్ట రోడ్డుపై వర్షపు నీరు

గుణదల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వర్షానికి డ్రెయిన్లు, మురుగు కాల్వలు పొంగి పొర్లుతుండటంతో గుణదల పరిసరాల్లో ఎక్కడ చూసినా రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తోంది. దీంతో వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. గుణదల ఈఎస్ఐ రోడ్డు-పుల్లేటికట్ట రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. ఈఎస్ఐ రోడ్ జంక్షన్ వద్ద డ్రెయినేజీ పొంగి పొర్లుతుండటంతో పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్తను తొలగించే ఏర్పాటు చేశారు. రోడ్డుకు సమాంతరంగా మురుగునీరు ప్రవహిస్తుండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భయం గుప్పిట్లో కొండప్రాంత వాసులు

రెండు రోజులుగా ఎడ తెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఏక్షణాన్నైనా కొండ చరియలు విరిగిపడే అవకాశం ఉందని గుణదల, క్రీస్తురాజుపురం, సున్నబట్టీల సెంటర్, చుట్టుగుంట, మొగల్రాజపురం ప్రాంతవాసులు భయం గుప్పిట్లో ఉన్నారు. కొండ చరియలు విరిగిపడితే ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందని, ఇళ్ల ధ్వంసమవుతాయన్న భయంతో వణికిపోతున్నారు. కొండశిఖరాగ్రాన ప్రమాదపు అంచుల్లో ఉన్న వారు అప్రమత్తంగా ఉండాలని స్థానిక నేతలు ఇప్పటికే హెచ్చరించారు.

దుర్గగుడిలో ఘనంగా చవితి ఉత్సవాలు


పూజలు చేస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి పండుగను పురస్కరించుకుని బుధవారం దుర్గగుడిలో ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానాచార్యుడు విష్ణుబొట్ల శివప్రసాద్ శర్మ పర్యవేక్షణలో ఉదయం 8 గంటలకు పసుపు గణపతి పూజ అనంతరం కలశ స్థాపన, విశేష పత్రి పూజ, గణపతి హోమం నిర్వహించారు. కొండపైకి చిన్న రాజగోపురం సమీపంలోని మహాగణపతి స్వామి మందిరం వద్ద వినాయక వ్రత కథను చదివి అక్షింతలు అందజేసి ఆశీస్సులందించారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు ఆవాహన దేవతా హోమాలు, హారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. ఈ పూజలో ఈవో వీకే శీనానాయక్ దంపతులు పాల్గొని పూజలు నిర్వహించి స్వామి ఆశీస్సులు అందుకున్నారు. కాగా, రెండో రోజు గురువారం కూడా స్వామికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అర్చకులు, వైదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్యూలైన్ల ఏర్పాటు పనులు ప్రారంభం

దుర్గగుడిలో సెప్టెంబరు 22 నుంచి ప్రారంభం కానున్న దసరా ఉత్సవాలను పురస్కరించుకుని భక్తుల భద్రత నిమిత్తం అధికారులు గురువారం కొండపైన, కొండదిగువన క్యూలైన్ల ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. స్థానాచార్యుడు పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు జరగ్గా, ఈవో వీకే శీనానాయక్ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా ఉత్సవాల్లో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. ఇంజనీరింగ్ అధికారులు, అర్చకులు, ఇంజనీరింగ్ అధికారులు కోటేశ్వరరావు, రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వేగంగా బీటీ రోడ్డు పనులు

కనకదుర్గానగర్‌లో అధికారులు చేపట్టిన బీటీ రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ రోడ్డు అధ్వానంగా ఉండటంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దేవదాయ శాఖ కమిషనర్ కే రామచంద్ర మోహన్ దుర్గగుడి ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు చేపట్టినప్పుడు ఈ బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని పనులు ప్రారంభించారు. తరువాత పనులు ఆగిపోయాయి. దసరా ఉత్సవాల నేపథ్యంలో అధికారులు మళ్లీ పనులు ప్రారంభించారు.

వాటర్ ప్రూఫ్ రేకుల ఏర్పాటు

విద్యాధరపురం, కుమ్మరిపాలెం సెంటర్‌వైపు నుంచి కొండపైకి వచ్చే భక్తుల కోసం దుర్గాఘాట్ ఎదురుగా అండర్ గ్రౌండ్ మార్గం వద్ద ఇంజనీరింగ్ అధికారులు వాటర్ ప్రూఫ్ రేకులను ఏర్పాటు చేశారు. దుర్గాఘాట్ నుంచి భక్తులు కేశఖండనశాల, అక్కడి నుంచి కొండపైకి వెళ్లటానికి సులువుగా ఉంటుంది.

ఘనంగా వినాయక చవితి వేడుకలు

● కలెక్టరేట్‌లో జరిగిన పూజలో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో బుధవారం వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల జీవితాల్లో సుఖఃసంతోషాలు వెల్లివిరిసేలా అన్ని విఘ్నాలు తొలగి జిల్లా, రాష్ట్రం, దేశం సమగ్ర అభివృద్ధి చెందేలా దేవుని ఆశీస్సులుంటాయన్నారు. వేడుకల్లో డీఆర్‌వో ఎం లక్ష్మీ నరసింహం, ఏవో ఏ శ్రీనివాసరెడ్డి, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.


గణనాథుడి పూజలో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ

గణనాధుని అనుగ్రహం ఉండాలి

గణనాథుడికి భక్తిశ్రద్ధలతో నిర్వహించిన పూజలతో సుఖఃసంతోషాలు, ప్రశాంతత, పాడిపంటలతో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు వెళ్లాలని ఎలాంటి విఘ్నాలు లేకుండా రాష్ట్రాభివృద్ధికి విఘ్న నాయకుడి ఆశీస్సులు ఎల్లవేళలా లభించాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. తాడేపల్లిలోని ఆర్ఎల్ గౌతమి రివర్ బ్రీజ్ అపార్ట్‌మెంట్ రెసిడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన గణేష్ ఉత్సవ ప్రారంభంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విఘ్నేశ్వరుడికి ఎంతో ఇష్టమైన ఉండ్రాళ్లను భక్తితో సమర్పించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య, ఉపాధి, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగేందుకు విఘ్నాధిపతి అనుగ్రహం మెండుగా ఉండేలా రాష్ట్రవ్యాప్తంగా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారన్నారు. ఆర్ఎల్ గౌతమి రివర్ బ్రీజ్ అపార్ట్‌మెంట్ కమిటీ గౌరవ సలహాదారు గొట్టుముక్కల రామారావు, అధ్యక్ష, కార్యదర్శులు డీ మధుబాబు, ఏవీ సూర్యనారాయణ, సభ్యులు సుధాకరరావు, సుంకర శ్రీనివాసరావు, జీ మణికుమార్, సీహెచ్ సతీష్, ఉయ్యూరు కోటేశ్వరరావు, కంటే రామ్మోహన్, వీవీ ప్రసాద్, పీ ఉపేంద్ర, ఏవీకే ప్రసాద్ పాల్గొన్నారు.


గన్నవరం టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న నాయకులు

వంశీ పిల్లచేష్టలు మానుకోవాలి

● టీడీపీ నేతల హెచ్చరిక

గన్నవరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పిల్లచేష్టలు మానుకోవాలని పలువురు టీడీపీ నేతలు హితవు పలికారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరులతో గురువారం మాట్లాడారు. ఈ నెల 25న టీడీపీ నేత గూడపాటి దుర్గాప్రసాద్ కేసులో కోర్టు దగ్గరకు వెళ్లారని, అదే సమయానికి మాజీ ఎమ్మెల్యే వంశీ వచ్చి మాటామంతీ కలిపి భుజంపై చేయి వేసి మాట్లాడగా ఆ వీడియోలు, ఫొటోలను వైరల్ చేసి దుర్గా ప్రసాద్‌పై దుష్ప్రచారం చేయటం సరికాదని ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు (నర్సయ్య) అన్నారు. ఎవరైతే వంశీని వ్యతిరేకిస్తారో వాళ్ల వద్దకే వెళ్లి పట్టించుకోపోయినా పదేపదే విష్ చేస్తారన్నారు. అది సరైన పద్ధతి కాదని, ఉద్దేశపూర్వకంగానే టీడీపీ క్యాడర్‌కు బ్యాడ్ మెసేజ్‌ను పంపేలా వంశీ చేస్తాడని ఎవరూ నమ్మవద్దన్నారు. పార్టీ సీనియర్ నేతలు, కార్యకర్తలను టార్గెట్ చేస్తూ ఉంటాడన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్న మాట్లాడుతూ వంశీ తన మైండ్ గేమ్‌తో టీడీపీలో చిచ్చుపెట్టేందుకు చూస్తున్నాడని, వంశీతో దుర్గాప్రసాద్ మాట్లాడే వీడియోలను తమ పార్టీ వారే ఎమ్మెల్యే, ప్రభుత్వమంటే గిట్టని వారే కావాలని గ్రూపుల్లో వేశారన్నారు. టీడీపీ నేత గూడపాటి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కోర్టు వద్ద యాధృచికంగా జరిగిన ఘటనను ఫొటోలు, వీడియోలు తీసి తానేదో వంశీకి తొత్తుగా ఉన్నానంటూ చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. తనపై అసత్య ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, తెలుగు మహిళ అధ్యక్షురాలు మేడేపల్లి రమ, ఎంపీటీసీ సభ్యుడు పడమట రంగారావు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో

ప్రతి కుటుంబం సంతోషంతో ఉండాలి

● విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని

విద్యాధరపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విఘ్నేశ్వరుడి కరుణాకటాక్షాలతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో గడపాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. వినాయకచవితి పండుగను పురస్కరించుకుని విద్యాధరపురం లేబర్ కాలనీ గ్రౌండ్‌లో డూండీ గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 72 అడుగుల మట్టి గణపతి విగ్రహానికి బుధవారం ఎంపీ సతీసమేతంగా హాజరై పూజలు నిర్వహించి పట్టువస్త్రాలు సమర్పించారు. పూజ అనంతరం మాట్లాడుతూ వినాయకచవితి పర్వదినం సందర్భంగా 72 అడుగుల శ్రీకార్యసిద్ధి మహాశక్తి గణపతి విగ్రహానికి పూజలు చేయడం ఆనందంగా ఉందన్నారు. మండపాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు చొరవ తీసుకున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, గొట్టిపాటికి కృతజ్ఞతలు తెలిపారు. డూండీ గణేష్ సేవా సమితి వ్యవస్థాపకుడు డూండీ రాకేశ్, సభ్యులు కేముక్తేశ్వరరావు, దర్శి సుబ్బారావు, పేర్ల రవి, నంబూరు నాగేశ్వరరావు, సామా చైతన్య, ఆలపాటి సత్యనారాయణ, డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పీవీ చిన సుబ్బయ్య, ఎం రాంబాబు పాల్గొన్నారు.

పార్లమెంట్ కార్యాలయంలో...

గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం, ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన వినాయకచవితి వేడుకల్లో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం కార్యాలయ సిబ్బంది, ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నేతలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గణపతిని దర్శించుకున్న మంత్రులు

వినాయకచవితి పండుగ సందర్భంగా 72 అడుగుల మట్టి కార్యసిద్ధి మహాశక్తి గణపతిని గురువారం రాత్రి రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖల మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వారికి స్వాగతం పలికారు. అనంతరం మంత్రులు వినాయకుడికి పూజలు నిర్వహించి ఆశీస్సులు అందుకున్నారు. డూండీ గణేష్ సేవాసమితి వ్యవస్థాపకుడు రాజేష్, కమిటీ సభ్యులు, టీడీపీ నేతలు, స్థానికులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ పాఠశాలగా నున్న

విజయవాడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా 2024-25 విద్యా సంవత్సరానికి రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాలలకు స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డులు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. రాష్ట్ర స్థాయిలో నున్న జడ్పీహెచ్ పాఠశాల 1347 పాయింట్లతో ప్రథమ స్థానం సాధించడంతో జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు ఆనందం వ్యక్తం చేశారు. పటమటలోని కేబీసీ జిల్లా బాలుర ఉన్నతపాఠశాల ద్వితీయ, దుర్గాపురంలోని ఎన్టీవీఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల తృతీయ, నిడమానూరు జడ్పీ పాఠశాల 4వ, కొత్తపేట ఎస్‌కేపీవీవీ హిందూ ఉన్నత పాఠశాల ఐదో స్థానంలో నిలిచింది. ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులను డీఈవో అభినందించారు.

యువకులను కాపాడిన ఎస్సై అర్జున

పెనుగంచిప్రోలు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మునేటి కాజ్వే వద్ద ప్రమాదవశాత్తు గురువారం రాత్రి బైక్‌తో సహా యేటిలో పడిన యువకులను ఎస్ఐ ఎంఎస్‌కే అర్జున ఆధ్వర్యంలో పోలీసులు ఒడ్డుకు తెచ్చారు. ఎస్ఐ అర్జున తెలిపిన సమాచారం మేరకు చందర్లపాడు మండలంలోని చెరుకుపాలెం గ్రామానికి చెందిన సుధాకర్, రమేష్ తిరుపతమ్మ అమ్మవారి వద్దకు గురువారం సాయంత్రం వచ్చారు. సుమారు 8 గంటలు దాటాక మునేటి అవతల వైపునకు వెళుతుండగా ప్రమాదవశాత్తు వీరు ప్రయాణించే బైక్ నీటిలో ప డింది. అటుగా వెళుతున్న కొంతమంది గమనించి ఎస్సై అర్జునకు సమాచారం ఇచ్చారు. తక్షణమే స్పందించిన అర్జున సిబ్బందితో అక్కడికి చేరుకొని తాడు సహాయంతో ఇద్దరినీ క్షేమంగా బయటికి లాగారు. మోటర్‌సైకిల్ వరదకు కొట్టుకుపోయింది. నీటిలో పడిన ఇద్దరు యువకులను తక్షణమే ఒడ్డు చేర్చిన ఎస్సై అర్జున, సిబ్బందిని పలువురు అభినందిస్తున్నారు.

3న క్రికెట్ క్వాలిఫయర్ టోర్నమెంట్

విజయవాడ స్పోర్ట్స్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఎంపీ కేశినేని శివనాథ్ ఆధ్వర్యంలో కేశినేని ఫౌండేషన్ నిర్వహించే విజయవాడ ప్రీమియర్ లీగ్‌కు క్రికెట్ ప్లేయర్ ఎంపికకు క్వాలిఫైయర్ టోర్నమెంట్ సెప్టెంబర్ 3 నుంచి ప్రారంభకానున్నట్టు నిర్వాహకులు తెలిపారు. గతంలో రిజిస్ట్రేషన్ చివరి తేది ఆగస్టు 30, క్వాలిఫైయర్ సెప్టెంబరు 1న అని ప్రకటించారని, అయితే క్రీడాకారుల అభ్యర్థనతో గడువు పొడిగించడం జరిగిందని, ఈ టోర్నమెంట్‌లో ఆడాలనుకునే వారు తమ టీమ్ వివరాలను సెప్టెంబర్ 1లోపు అందించాలన్నారు. పాల్గొనే ప్లేయర్స్ తమ ఆధార్, జన్మదిన ధ్రువీకరణ పత్రం, ఫొటోలు సమర్పించాలని, విజయవాడ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, రూరల్ మండలం, పెనమలూరు మండలానికి చెందిన వారై ఉండాలన్నారు.

రిక్వెస్ట్ బదిలీలను పరిగణనలోకి తీసుకోండి

● ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నేతలు

బస్‌స్టేషన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతుల్లో రిక్వెస్ట్ బదిలీలను పరిగణనలోకి తీసుకొని న్యాయం చేయాలని ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం 2020లో ఆర్టీసీని విలీనం చేసినప్పటి నుంచి సుమారు 3వేల మందికి పైగా ఉద్యోగులకు పదోన్నతులు ఆగిపోయాయని, ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులకు వినతి పత్రాలివ్వగా, ముఖ్యమంత్రి స్పందించి పదోన్నతులకు అనుమతి ఇచ్చారన్నారు. పదోన్నతుల్లో ఎన్నో ఏళ్లుగా రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకున్నవారికి పదోన్నతులు కల్పించాలని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావును ఒక ప్రకటనలో కోరారు. పాత పద్ధతిలోనే ఏడీ పీడీ విభాగాల్లో డిప్యూటీ సూపరింటెండెంట్ పదోన్నతులు కల్పించాలని వారు ఆ ప్రకటనలో కోరారు.

రికవరీని నిలిపేయాలి

ప్రభుత్వ ఉద్యోగుల శాలరీ ప్యాకేజీ అగ్రిమెంట్ ప్రకారం ఆర్టీసీ ఉద్యోగులకు రికవరీ అవుతున్న రూ.200 రికవరీని నిలుపుదల చేయాలని ఏపీపీటీడీ, ఎండీలను ఏపీఎస్ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీ రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి వై శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. గతంలో సంస్థలో పనిచేసే ఉద్యోగులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో శాలరీ ప్యాకేజీ కింద ప్రత్యేక రాయితీలు, ఇన్సూరెన్స్ కవరేజీలు, సిబ్బంది సాధారణ మరణాలకు రూ.200 ప్రతినెలా రికవరీతో అమలు చేయటం జరిగేదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వపరంగా ఎస్‌బీఐతో జరిగిన అగ్రిమెంట్ ప్రకారం ఎలాంటి రికవరీ లేకుండా సాధారణ మరణాలకు రూ.10లక్షలు అమలుకు అగ్రిమెంట్ జరిగిందని, ఆర్టీసీ ఉద్యోగులకు అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీపీటీడీ కమిషనర్, ఎండీలు ప్రత్యేక చొరవ తీసుకుని ఈనెల నుంచి ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వ అగ్రిమెంట్ ప్రకారం రూ.200 రికవరీని నిలుపుదలకు తగు ఉత్తర్వులు ఇవ్వాలని వారు ఆ ప్రకటనలో కోరారు.


అడ్మిషన్ పత్రాలు అందుకుంటున్న విద్యార్థిని

26 నుంచి యూజీ మెడికల్ అడ్మిషన్లు

మాచవరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కన్వీనర్ కోటా కింద యూజీ మెడికల్ అడ్మిషన్లు ఈనెల 26 నుంచి 29 వరకు కొనసాగనున్నాయని సిద్ధార్థ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ ఏడుకొండలరావు తెలిపారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ ఈ అడ్మిషన్లలో మొత్తం 149 మంది విద్యార్థులు విజయవాడలోని కాలేజీలో చేరుతున్నట్టు చెప్పారు. టాప్ ర్యాంక్ సాధించిన విద్యార్థులు మెడికల్ కాలేజీని ఎన్నుకోవడమే మాకు గర్వకారణమన్నారు. కాలేజీలోని మెరుగైన భవనాలు, అత్యాధునిక పరికరాలు, ఆసుపత్రి వసతులు, రోగులపై పనిచేసే అవకాశాలు, క్రీడా వసతులు, అత్యుత్తమ బోధనా తదితర వాటిని ఎంచుకోవాలన్నారు. ఇటీవల విడుదలైన ఐఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ ప్రకారం సిద్ధార్థ మెడికల్ కాలేజీ రాష్ట్రంలో 5వ స్థానం, దక్షిణ భారతదేశంలో 15వ స్థానం, ఆలిండియా స్థాయిలో 65వ ర్యాంక్ పొందినట్టు చెప్పారు.

అమరావతి రైతులకు నేడు ప్లాట్ల ఈ-లాటరీ

కలెక్టరేట్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి సీఆర్‌డీఏ పరిధిలో భూ సమీకరణ పథకంలో భూములను సీఆర్‌డీఏకి అప్పగించిన పెనుమాక జరీబు రైతులకు ప్లాట్లు కేటాయించేందుకు ఆగస్టు 29 (శుక్రవారం) సాయంత్రం 4గంటల నుంచి విజయవాడ లెనిన్ సెంటర్‌లోని సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో ఈ-లాటరీ జరుగుతుందని కమిషనర్ కార్యాలయం అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ-లాటరీలో భాగంగా 52 మంది రైతులకు 84 ప్లాట్లను ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా కేటాయించడం జరుగుతుందన్నారు. వీటిలో 51 రెసిడెన్షియల్ ప్లాట్లు, 33 కమర్షియల్ ప్లాట్లు ఉన్నాయి. రైతులు ఈ-లాటరీకి హాజరుకావాలని సీఆర్‌డీఏ అధికారులు ఆ ప్రకటనలో కోరారు.

నేడు అమరావతిలో జాబ్‌మేళా

కలెక్టరేట్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో సీఆర్‌డీఏ మద్దతుతో నేడు (శుక్రవారం) ఉదయం 10 గంటల నుంచి తుళ్లూరులోని నాక్-సీఆర్‌డీఏ స్కిల్ హబ్ సెంటర్‌లో 'జాబ్ మేళా' నిర్వహిస్తున్నట్టు సీఆర్‌డీఏ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు అమరావతి, చుట్టుపక్కల ఉపాధి అవకాశాలు కల్పించబడతాయన్నారు. సెన్స్ సెమీకండక్టర్ అండ్ ఐటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, బీఎస్ఆర్ ఇన్ఫ్రాటెక్ ఇండియా లిమిటెడ్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్సు కో-లిమిటెడ్, భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, సంతోష్ ఆటోమోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి ప్రముఖ కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటాయి. ఇంజినీర్లు, డెవలప్‌మెంట్ మేనేజర్లు, ఫైనాన్షియల్ అడ్వైజర్లు (పార్ట్-టైమ్), రీజినల్ మేనేజర్లు, డిస్ట్రిక్ట్ మేనేజర్లు, ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్‌లు, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు, డ్రైవర్లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు, టీమ్ లీడర్లకు ఖాళీలు అందుబాటులో ఉన్నాయి. ఎస్ఎస్‌సీ, ఇంటర్, బీటెక్, ఎంఎల్‌టీ, బీఎస్సీ నర్సింగ్, ఏదైనా గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలతో సహా అర్హత కలిగిన ఫ్రెషర్లు, అనుభవజ్ఞులైన అభ్యర్థులు హాజరు కావడానికి అర్హులు. ఎంపికైన అభ్యర్థులకు రూ.17 వేల నుంచి రూ.40వేల వరకు జీతాలు ఉంటాయన్నారు. కొన్ని పాత్రలకు అదనపు ప్రోత్సాహకాలు, జీతభత్యాలు అందించబడతాయన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు సీఆర్‌డీఏ ఫెసిలిటేటర్‌ను లేదా శంకర్ - 9848424207 / శ్రీకర్ - 9963425999 సంప్రదించవచ్చన్నారు. పాల్గొనే వారు ఫెయిర్‌కు హాజరయ్యే ముందు నైపుణ్యం పోర్టల్ హెచ్‌టీటీపీఎస్://నైపుణ్యం.ఏపీ.జీఓవీ.ఇన్/ ద్వారా కూడా నమోదు చేసుకోవాలన్నారు.

30న కలెక్టరేట్‌లో జాబ్‌డ్రైవ్

కలెక్టరేట్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): 'ఎన్టీఆర్ వికాస' ఆధ్వర్యంలో ఈనెల 30న శనివారం కలెక్టరేట్‌లోని ఎన్టీఆర్ వికాస కార్యాలయంలో జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ఎన్టీఆర్ వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కే లచ్చారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌డ్రైవ్‌లో ఆఫ్ కెట్ ఐటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (హైదరాబాద్)లో జావా డెవలపర్, పైథాన్ డెవలపర్ ఉద్యోగానికి బీఈ, బీటెక్ ఆల్ బ్రాంచ్‌లు (సివిల్ తప్ప), బీ కామ్, ఎంఎస్సీ (కంప్యూటర్), ఎంఎస్సీ ఐటీ ఆర్ రిలేటెడ్ ఫీల్డ్ (2019 నుంచి 2025 ఉత్తీర్ణులైన వారు అర్హులు) ఉద్యోగానికి ఎంపికైన వారికి రూ.2.8 లక్షల నుంచి 4 లక్షల వరకు జీతం ఉంటుంది. హెచ్ ఆర్ రిక్రూటర్ ఉద్యోగానికి ఎంబీఏ, బీబీఏ, (2019 నుంచి 2025 ఉత్తీర్ణులైన వారు అర్హులు) వీరికి నెలకు రూ.20 వేల జీతం + ఇన్సెంటివ్స్ ఉంటాయి. అలాగే ఫిల్స్ కార్ట్ (విజయవాడ) కంపెనీలో ఎస్ఎస్‌సీ, ఆపైన ఉత్తీర్ణులైన వారు అర్హులు. వీరికి నెలకు రూ.15వేల నుంచి రూ.20 వేల వరకు జీతం ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులు 30న శనివారం ఎన్టీఆర్ వికాస కార్యాలయం, కలెక్టరేట్, విజయవాడ వద్ద ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్ జిరాక్సులతో హాజరుకావాలన్నారు. వివరాలకు 9849465427 సంప్రదించాలన్నారు.

పెన్షనర్లందరికీ టాక్స్ రిటర్న్ ఫైల్ తప్పనిసరి

జిల్లా జనరల్ సెక్రటరీ విష్ణువర్ధనరావు

విజయవాడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఇన్‌కం టాక్స్ పడిన పెన్షనర్స్ అందరూ 2024-25కు సంబంధించిన టాక్స్ రిటర్న్స్ ఫైల్ చేయాలని జిల్లా జనరల్ సెక్రటరీ బీ విష్ణువర్ధనరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇన్‌కంటాక్స్ నుంచి మినహాయింపు పొందిన పెన్షనర్లందరూ నగరంలోని తూర్పు సబ్‌ట్రెజరీ వద్ద ఫార్మ్ 16ను పాన్‌కార్డు చూపించి తీసుకోవాలన్నారు. టాక్స్ పడని పెన్షనర్స్ కూడా రూ.7.50 లక్షల వార్షిక ఆదాయం వారికి రూ.3.50 లక్షల వరకు టాక్స్‌లో మినహాయింపు వర్తిస్తుందన్నారు. దీనికోసం వారు నిల్ రిటర్న్స్ ఫైల్ చేయాలని విష్ణువర్ధన్ తెలిపారు. పెన్షనర్స్‌కు ఇబ్బంది లేకుండా పెన్షన్ హాలులో ఇన్‌కం టాక్స్ ఆడిటర్‌ను ఏర్పాటుచేసినట్టు తెలిపారు. ఇప్పటివరకు సుమారు 300 మందికి రిటర్న్ ఫైల్ చేశారన్నారు.

'వయోజన విద్య'లో సూపర్‌వైజర్ల భర్తీకి ఆదేశాలు

అమరావతి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వయోజన విద్యాశాఖలో సూపర్‌వైజర్ల నియామకానికి చర్యలు చేపట్టాలని ఆదేశిస్తూ ఆ శాఖ డైరెక్టర్ కృతికా శుక్లా ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 47 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. సీనియర్ ఎస్టీటీలను ఫారిన్ సర్వీసు ప్రాతిపదికన ఈ పోస్టుల్లో భర్తీ చేస్తారు. జిల్లా ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో వీరి నియామకం జరుగుతుంది. కాగా స్కూల్ అసిస్టెంట్లకు కూడా వయోజన విద్య సూపర్‌వైజర్‌గా వెళ్లేందుకు అవకాశం కల్పించాలని ఏపీటీఎఫ్-అమరావతి అధ్యక్షుడు సీవీ ప్రసాద్ కోరారు.

ఏరోస్పేస్ మాన్యుఫ్యాక్చరింగ్‌పై నేడు సదస్సు

విశాఖపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఏరోస్పేస్ మాన్యుఫ్యాక్చరింగ్‌పై శుక్రవారం విశాఖపట్నంలో భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సు, ప్రదర్శన జరగనుంది. నోవాటెల్‌లో నిర్వహించే కార్యక్రమానికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ హాజరవుతున్నారు. పౌర విమానయాన శాఖ సెక్రటరీ సమీర్‌కుమార్ సిన్హా కీలక ప్రసంగం చేయనున్నారు.

సైబర్ సెక్యూరిటీ, నెట్‌వర్కింగ్‌పై ఉచిత శిక్షణ

అమరావతి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కళాశాలల అధ్యాపకులకు సైబర్ సెక్యూరిటీ, నెట్‌వర్కింగ్ ఎసెన్షియల్స్‌లో శిక్షణ ఇవ్వనున్నట్టు నైపుణ్యాభివృద్ధి సంస్థ తెలిపింది. ఇందుకోసం సిస్కో నెట్‌వర్కింగ్ అకాడమీతో గురువారం ఒప్పందం చేసుకుంది. కంప్యూటర్ సైన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ అధ్యాపకులు ఏపీ నైపుణ్యం వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించింది. మొదటి బ్యాచ్‌కు గుంటూరు సమీపంలోని వీవీఐటీ కాలేజీలో సెప్టెంబరు 8 నుంచి, రెండో బ్యాచ్‌కు ఆంధ్రా యూనివర్సిటీలో సెప్టెంబరు 15 నుంచి శిక్షణ ఇవ్వనున్నారు.

నేటి నుంచి కర్నూలులో తెలుగు భాషా ఉత్సవాలు

» రేపు 24 గంటల నిర్విరామ పద్యనాటక ప్రదర్శనలు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం, గిడుగు రామమూర్తి పంతులు జయంతి వేడుకలను మూడు రోజుల పాటు ఏర్పాటు చేసినట్టు కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య విలేకరులకు తెలిపారు. శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఉదయం 10 గంటలకు తెలుగు తల్లి, గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటాలకు నివాళి కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అనంతరం 'విద్య, బోధనలో తెలుగు భాష' అనే అంశంపై విద్యార్థులకు పోటీలు ఏర్పాటు చేశామన్నారు. శనివారం ఉదయం 9 గంటలకు పౌరాణిక, చారిత్రక ఏకపాత్రాభినయ పోటీలు ప్రారంభమవుతాయి. 80 మంది కళాకారులతో పగలు, రాత్రి ఏకధాటిగా 24 గంటల పాటు పద్య నాటక ప్రదర్శనలు కొనసాగుతాయి.

వాహనం మంజూరుకు రూ.లక్ష డిమాండ్

» ఏసీబీకి పట్టుబడిన పరిశ్రమల శాఖ అధికారి

గుంటూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): దళితుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం కేటాయించిన ఇన్నోవా వాహనం మంజూరు చేసినందుకు రూ.లక్ష డిమాండ్ చేసి రూ.30 వేలు లంచం తీసుకుంటూ పరిశ్రమల శాఖ అధికారి మత్తి శ్రీనివాసరావు ఏసీబీ అధికారులకు గురువారం పట్టుబడ్డారు. ఏసీబీ అదనపు ఎస్పీ మహేంద్ర కథనం మేరకు.. గుంటూరు నగర శివారు గోర్లవారి పాలెం గ్రామానికి చెందిన తియ్యల జయరాజ్ జగనన్న బడుగు వికాసం (జేబీవీ) పథకం కింద 2024లో ఇన్నోవా వాహనం కోసం దరఖాస్తు చేసుకున్నారు. గత జూన్‌లో ప్రభుత్వం వాహనాన్ని కేటాయించింది. అతనికి వాహనం మంజూరు అయ్యేలా చేసినందుకు తనకు లక్ష లంచం ఇవ్వాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రెండు విడతలుగా ఆ మొత్తం ఇస్తానని తొలివిడత రూ.30 వేలు ఇస్తానని జయరాజు బేరం కుదుర్చుకున్నాడు. తన మేనమామ కమలాకర్ ద్వారా ఏసీబీ అధికారులను ఆశ్రయించి, వారి సూచన మేరకు గురువారం జయరాజు లంచం ఇస్తుండగా శ్రీనివాసరావును జిల్లా పరిషత్ ప్రాంగణంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేశామని, శుక్రవారం శ్రీనివాసరావును విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నట్టు మహేంద్ర తెలిపారు.

లంచం కేసులో ఎస్ఐకి జైలు, జరిమానా

విశాఖపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కట్నం వేధింపుల కేసులో నిందితులను అరెస్టు చేయకుండా ఉండేందుకు లంచం తీసుకున్న కేసులో కర్నూలు మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ బి.పెద్దయ్యకు విజయవాడ ఏసీబీ కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.2.5 లక్షల జరిమానా విధించింది. విశాఖకు చెందిన ఎస్.మంగరాజుకు కర్నూలుకు చెందిన యువతితో వివాహమైంది. ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో 2015 ఏప్రిల్‌లో కర్నూలు మహిళా పోలీస్ స్టేషన్‌లో మంగరాజుతోపాటు అతని కుటుంబ సభ్యులపై ఫిర్యాదు చేయడంతో వరకట్న నిషేధ చట్టం కింద కేసు నమోదుచేశారు. ఈ కేసులో నిందితులను అరెస్టు చేయకుండా ఉండడంతోపాటు వారికి అనుకూలంగా వ్యవహరించడానికి ఎస్ఐ పెద్దయ్య రూ.లక్ష లంచం డిమాండ్ చేశారు. మంగరాజు కర్నూలు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐకు నగదు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని ఎస్ఐను అరెస్టు చేశారు. కోర్టులో నేరం నిర్ధారణ కావడంలో న్యాయమూర్తి ఎస్.శ్రీవిద్య ఈ మేరకు గురువారం తీర్పుచెప్పారు. జరిమానా మొత్తాన్ని మంగరాజుకు పరిహారంగా అందజేయాలని ఆదేశించారు.


బస్సుల్లో మహిళలే టార్గెట్!

» కిలేడీ' ముఠా అరెస్టు.. రూ.23 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం

అనంతపురం క్రైం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు, దోపిడీలకు పాల్పడుతున్న ముఠాను అనంతపురం జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.23 లక్షల విలువైన 242.5 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను ఎస్పీ జగదీష్ గురువారం విలేకరులకు తెలియజేశారు. చిత్తూరు జిల్లా కుప్పం పట్టణానికి చెందిన సుమతి, గీత, రంజిత, బృంద ముఠాగా ఏర్పడ్డారు. బస్సుల్లో ప్రయాణిస్తూ.. మహిళల బ్యాగులను చోరీ చేసేవారు. అనంతపురం జిల్లా రాయదుర్గం సర్కిల్‌లోని కణేకల్లు బస్టాండ్‌లో బస్సు ఎక్కిన మహిళను ఏమార్చి, ఆమె బ్యాగ్‌లో ఉన్న రూ.12 లక్షల విలువైన 120 గ్రాముల బంగారు ఆభరణాలను కాజేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు రాయదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని పక్కా సమాచారంతో ముఠాను అరెస్టు చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించారు.

అమరావతిపై అసత్య ప్రచారం తగదు

● హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి సుధీర్ చౌదరి


సభలో ప్రసంగిస్తున్న సుధీర్ చౌదరి

గాంధీనగర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిపై మీడియా, సోషల్ మీడియాలో కొందరు ఉద్దేశపూర్వకంగా చేస్తున్న తప్పుడు ప్రచారాలను పలువురు వక్తలు ఖండించారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి అమరావతి అభివృద్ధితో ముడిపడి ఉందన్నారు. ఇటువంటి చర్యలతో రాష్ట్రంలో పెటుబడులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. "అమరావతిపై అబద్ధపు ప్రచారం - భావ ప్రకటన స్వేచ్ఛ" అనే అంశంపై సీఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి సుధీర్ చౌదరి మాట్లాడుతూ రాజ్యాంగంలో భావ ప్రకటన స్వేచ్ఛ, సమానత్వ హక్కులతో పాటు బాధ్యత కూడా పొందుపర్చడం జరిగిందన్నారు. హక్కును, బాధ్యతను సమన్వయం చేసుకుని పత్రికల్లో వార్తలు రాసి సమాజానికి మేలు చేయాలని సూచించారు. సీఆర్.మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ మాట్లాడుతూ 2019 నుంచి రాజధాని అమరావతిపై దుష్ప్రచారం ప్రారంభించారన్నారు. ప్రముఖ నీటిపారుదల రంగ నిపుణుడు టీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వర్షాలు, వరదలు రావడం అత్యంత సహజమన్నారు. కేరళ, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలు సైతం ఇటువంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని గుర్తు చేశారు. ప్రముఖ చరిత్రకారుడు పాపినేని సాయి మాట్లాడుతూ వేల ఏళ్ల చరిత్ర కలిగిన అమరావతిపై అసత్య ప్రచారాలు చేయడం తగదని హితవుపలికారు. అమరావతి రైతు నేత జొన్నలగడ్డ కిరణ్ మాట్లాడుతూ అమరావతి కేవలం రైతుల రాజధాని కాదని యావత్తు రాష్ట్ర ప్రజలందరిదన్నారు. దీనిపై తప్పుడు ప్రచారాలను తట్టుకుని ముందుకు సాగాలన్నారు.



చింతన

ఏదైనా కథ విన్నప్పుడు... ఆ కథలోని విశేషాలను గ్రహించడం, మంచి విషయాలను పాటించడం ప్రధానం. గౌరీ శంకరుల కథలో... అర్ధనారీశ్వర తత్త్వాన్ని లోతుగా తెలుసుకోవాలి. ఆ ఆది దంపతుల అన్యోన్యతను అర్థం చేసుకోవడం, ఆ విలువలను అనుసరించడమే ఆనందకరమైన గృహస్థ జీవితానికి సోపానం.

అన్యోన్యతకు అర్థం...
అర్ధ నారీశ్వర తత్త్వం

హిమవంతుని పుత్రిక అయిన హైమవతి (శైలజ) తండ్రి ఆదేశం మేరకు శంకరుడికి పరిచర్య చెయ్యడానికి వచ్చింది. అది నిర్జనమైన వనం. వారిద్దరూ యవ్వనంలో, ఏకాంతంలో ఉన్నారు. కానీ వారి మనసుల్లో శృంగారపరమైన భావన లేదు. చివరకు ఇంద్రుడి ఆజ్ఞ మేరకు శంకరుడి మీద మన్మధుడు బాణం వేయాల్సి వచ్చింది. శారీరక సౌందర్యం లాంటి వాటికే ప్రాధాన్యం ఇస్తున్న నేటి కాలపు పద్ధతులకు ఇది విరుద్ధం. అంటే శారీరక సౌందర్య దృష్టితో చూసినంత కాలం మానసిక ప్రేమ అనేది ఉండదని భావం. ఈ భేదాన్ని గుర్తించగలిగితే దాంపత్యం అన్యోన్యంగా ఉంటుంది. మరో విషయం ఏమిటంటే... మన్మధుణ్ణి శంకరుడు తన మూడో కంటితో భస్మం చేయడం చూశాక కూడా... శైలజ తనంతట తానుగా నిర్ణయం తీసుకోలేదు. తల్లిదండ్రులకు చెప్పింది. తద్వారా ఆమె మానసికమైన ప్రేమ ఆమె తల్లితండ్రులకు అర్థమయింది. ఒక నిర్జన వన ప్రదేశానికి, ఏకాంతంలో ఉన్న పురుషుడి సేవ కోసం హిమవంతుడు తన పుత్రికను పంపాడంటే... తన కుమార్తె ప్రవర్తన, శీల సంపద మీద ఆయనకు ఎంత నమ్మకం ఉందో గమనించాలి.

భిన్నత్వంలో ఏకత్వం...

వివాహానికి ముందు ప్రేమించుకున్న కాలంలో... చెప్పలేనంత అన్యోన్యంగా కనిపించే జంటల సంసార సౌధం కొన్నాళ్ళకే బీటలు వారడం నేడు చూస్తున్నాం. ఇలాంటి సందర్భంలోనే గౌరీ శంకరుల కథను శ్రద్ధగా ఒంట పట్టించుకోవాలి. గౌరీ శంకరులు... అర్ధనారీశ్వర రూపంలో ఉంటారు. కుడివైపున శంకరుని రూపం, ఎడమవైపు గౌరీ రూపం. పూర్వం ఈ అర్ధనారీశ్వర చిత్రాన్ని దేవాలయం గోడల మీదో, ప్రధాన స్తంభం మీదో... శిల్ప రూపంలోనో, చిత్ర రూపంలోనో కనిపించేలా ఉంచేవారు. "కుడి అర చేత్తో కుడి కంటిని మూసి గౌరీదేవిని, ఎడమ అరచేత్తో ఎడమకంటిని మూసి శివయ్యను చూడు" అని తమ పిల్లలకు తల్లిదండ్రులు చెప్పేవారు, ఆ విధంగా చేయించేవారు. ఎందుకని? ఏ సంస్కారమూ లేని బిరుసైన జేగురు రంగు శిరోజాలు... అవి కూడా మోకాళ్ళు దాటేంత పొడవున శివుడికి ఉంటాయి. సంపెగ, అశోక, సురపొన్న, సౌగంధిక (చంపాశోక పున్నాగ సౌగంధిక లసత్కచా) పుష్పాలతో చక్కగా అలంకృతమైన కొప్పు ఆమెకు ఉంటుంది. ఆగ్రహం వచ్చినా, అనుగ్రహాన్ని కురిపిస్తున్నా ఏ మార్పూ కనిపించని అష్టమి చంద్రుడిలా ఆమె నుదురు ఉంటే... ఏమాత్రం తేడా కనిపించినా ఆయన నుదుటి భ్రుకుటి ముడిపడిపోతూ ఉంటుంది. ఆయన కన్ను రుద్ర రూపంలో వెలుగుతూ ఉంటే ఆమె నేత్రం నీటి మడుగులో కదలాడే చేపలా... ఇంకా ఇంకా చూడాలనిపించేలా ఉంటుంది. మరో చిత్రం... ఆమె నయనం పరమ మనోహరంగా, ప్రశాంతంగా, అందరికీ ఉండేలా అడ్డంగా ఉంటే... ఆయనకు నుదుటి మధ్యలో మరో నేత్రం ఛటచ్ఛటలాడే అగ్నితో ఉండడమే కాదు, నిలువుగా ఉంటుంది. ఇలా... ఇద్దరూ ఒకే తీరుగా ఉండనే ఉండరు. కానీ భిన్నమైన లక్షణాలు కలిగి కూడా కలిసే కనిపిస్తారు. మానసికంగా కూడా ఐక్య భావంతోనే ఉంటారు.

ఏం నేర్చుకోవాలి?

ప్రతి వ్యక్తికి తనవైన కొన్ని అభిప్రాయాలు ఉంటాయి. వాటిని ఎదుటివారు గౌరవించాలి. "నేను మంచి శిరోజాలంకరణతో ఉంటాను కదా! నీవూ అలాగే ఉండు! నా నుదురు ప్రశాంతంగా ఉంటుంది కదా! నీవెందుకు అలా ఉండవు? నేను చక్కటి పట్టు వస్త్రాలను ధరిస్తాను కదా! నీవెందుకు ఆ ఏనుగు, పులి చర్మాలు ధరిస్తావు? నా మాదిరిగా ఉండు!" అని ఆమె ప్రాధేయపూర్వకంగా కానీ, గద్దించి కానీ ఆయనను అడగలేదు. అలాగే ఆయన కూడా "నాలా నీవు ఉండవచ్చు కదా?" అని అడగలేదు. అంటే... దంపతులు తమ వివాహానికి ముందు విడివిడిగా ఉన్న స్థిరాభిప్రాయాలను పరస్పరం గౌరవించుకుంటూ ఉండాల్సిందే. అవి పుట్టుక నుంచి వచ్చినవి. ఆ లక్షణాలకు వారు అలవాటు పడి ఉంటారు కాబట్టి... వాటిని మార్చుకోవాలని పట్టుపట్టినా, నిర్బంధించినా... వివాహబంధం క్రమంగా సడలిపోతుంది. అందుకని... దాంపత్యంలో సర్దుకుపోవడం తప్పనిసరి. ఈ దశలో ఏ మూడో వ్యక్తో (వారివారి తల్లితండ్రులు, స్నేహితులు లేదా ఇరుగుపొరుగువారు) జోక్యం చేసుకుంటే... ఆ సంసారంలో అన్యోన్యత ఉండదు. అందుకే గౌరీ శంకరులు తమ మధ్య ఎవరూ చొరబడే వీలు లేకుండా నిలువునా కలిసిపోయి... అర్ధనారీశ్వరులుగా ఉంటారు. ఇలాంటి విశేషాలను అర్థం చేసుకున్నప్పుడు... అవి మన జీవితాలు సక్రమంగా సాగేందుకు ఉపకరిస్తాయి.

● డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు

విశ్వకర్మలుగా పేర్కొనే స్థపతి, వర్ధకి, తక్షకుడు, సూత్రగ్రాహి... పవిత్రమైన యజ్ఞయాగాది క్రతువులు నిర్వహించడానికి హోమ కుండాలను, యజ్ఞ మండపాలను, హోమానికి కావలసిన యజ్ఞపాత్రలు, స్రుక్, స్రువం లాంటివి తయారుచేసి ఇస్తారు. ఆలయ ఆరాధనలో భాగమైన పూజా పాత్రలు, అభిషేక పాత్రలు, గంటలు, దేవుణ్ణి ఊరేగించే పల్లకి, వాహనాలు, రథాలు తదితరాలు తయారు చేసేది వీరే. వీరి పరంపర చాలా గొప్పది. వారి తపోబలంతో నిర్మితమైనవే... నేటికీ పూజలందుకొంటున్న ప్రాచీన ఆలయాలు.

ఆలయం ఎక్కడ నిర్మించాలి?

ఆలయ నిర్మాణాల విషయానికి వస్తే... నిర్దిష్టమైన (శాస్త్రాల్లో పేర్కొన్న) కొలతలతో నిర్మితమైన ఆలయం మాత్రమే శుభాలను ఇస్తుందని, ఆ ప్రకారం లేకపోతే అంతులేని ఆపదలు తెస్తుందని, దేశ ప్రజలకు అపకారం కలుగజేస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. ఎందుకంటే... సలక్షణంగా కట్టిన ఆలయమే దేవునికి ఆవాసం అవుతుందని 'విశ్వకర్మీయం' గ్రంథం వెల్లడిస్తోంది. అందులో ప్రతిష్ఠించే విగ్రహాన్ని స్థపతి పర్యవేక్షణలోనే తయారు చేయించాలి. కొలతలన్నీ సక్రమంగా ఉండి, రూపలావణ్యాలు కలిగిన విగ్రహాలలోనే దేవుడు కొలువై ఉంటాడని ఆగమాలు చెబుతున్నాయి. 'మానవ నిర్మితే బింబే స్వయం ఆభాతి దైవతం... నిర్ణీతమైన కొలతలతో నిర్మించిన విగ్రహాలలో భగవంతుడు స్వయం వ్యక్తమవుతాడు' అని 'మకుటాగమం' చెబుతోంది. అందుకే స్థపతి లేకుండా దేవాలయ నిర్మాణాలలో ఏ కార్యక్రమం జరగదు. శంఖు స్థాపన నుంచి మహా కుంభాభిషేకం వరకూ స్థపతి పర్యవేక్షణలోనే జరగాలి.

ఆలయాలను ఎలాంటి ప్రదేశాలలో నిర్మించాలి? దీని గురించి శిల్ప, ఆగమ గ్రంథాలు అనేక ప్రదేశాలను నిర్దేశించాయి. వాటి ప్రకారం... భగవంతుడికి ప్రీతికరమైన ప్రదేశాలైన ఉద్యానవనాలు, నదీ తీరాలు, నదీ సంగమ ప్రదేశాలు, పర్వతాలు, సిద్ధులు తపస్సు ఆచరించిన ప్రదేశాలు తదితర ప్రకృతి రమణీయ ప్రదేశాలలో దేవాలయాలను నిర్మించాలి. అలాంటి ప్రదేశాల్లో దేవాలయాలను నిర్మించడం వల్ల... ఆ ప్రాంతం సౌందర్యం, ప్రకృతి రమణీయత వల్ల మానవునిలో మానసిక ప్రశాంతత పెరుగుతుంది. దైవం మీద మనస్సు లగ్నం అవుతుంది. అద్వితీయమైన, అలౌకికమైన ఆధ్యాత్మిక ఆనందం కలుగుతుంది.

నిర్మించిన ప్రదేశాన్ని బట్టి ఆలయం ఉత్తమం అవుతుందా? ఈ ప్రశ్నకు 'శిల్ప సంగ్రహం' గ్రంథంలో సమాధానం దొరుకుతుంది.

ఉత్తమం పర్వతాగ్రేషు మధ్యమం వనరాజిషు
అధమంతు నదీతీరే గ్రామాదీష్వధమాధమమ్

భావం: పర్వతం పైభాగంలో నిర్మించిన ఆలయాలు ఉత్తమమైనవి. అడవులలో, వనాలలో నిర్మించినవి మధ్యమమైనవి. నదుల ఒడ్డున ఉన్నవి అధమమైనవి (సామాన్యమైనవి). గ్రామాల మధ్య ఉన్నవి అన్నిటికన్నా అధమమైనవి.

● దగ్గుపాటి నాగవరప్రసాద్ స్థపతి
9440525788

తెలుసుకుందాం




గీతాసారం

అవగాహన, కరుణ


ఆత్మజ్ఞానం పొందే మార్గంలో మనకు ఎదురయ్యే అనేక అడ్డంకులను దాటడానికి, మూసి ఉన్న ద్వారాలను తెరవడానికి కావలసిన అమోఘమైన తాళం చెవులన్నీ భగవద్గీతలో ఉన్నాయి. అటువంటి కీలకమైన ఉపాయాల్లో ఒకటి... మిమ్మల్ని ఇతరుల్లో, ఇతరులను మీలో చూసుకోవడం. అందరిలో ఉన్నది తానేనని శ్రీకృష్ణుడు గుర్తు చేస్తున్నాడు. తాను నిరాకారుణ్ణని సూచిస్తున్నాడు. అన్ని జీవులను ఒకేలా చూడగలిగే స్థాయికి ఎదగాలని చెబుతున్నాడు. ఇంద్రియాలు మనకు అందించిన సమాచారం ఆధారంగా... మనం ఎదుర్కొంటున్న పరిస్థితులను సురక్షితమైనవిగా, ఆహ్లాదకరమైనవిగా లేదా హానికరమైనవిగా, బాధాకరమైనవిగా మన మనస్సు నిర్ధారిస్తుంది. ఎదురుకాబోయే ప్రమాదాల నుంచి మనల్ని రక్షించడానికి ఇది ఎంతో అవసరం. ఇతర సాంకేతిక పరిజ్ఞానాల మాదిరిగా మన మనస్సు కూడా రెండువైపులా పదునున్న కత్తి లాంటిది. అది మన మీద పెత్తనం చేయడం కోసం తన పరిధుల్ని మీరుతుంది. అదే అహంకారానికి జన్మస్థానం.

మనస్సును ఆధీనంలో ఉంచుకొని... ఈ విభజనలను తగ్గిస్తే కలయిక, ఐక్యత కలుగుతాయని భగవద్గీత చెబుతోంది. మనం ఇటువంటి కీలకమైన ఉపాయాలను ఉపయోగించినప్పుడు... ఇతరుల పట్ల కరుణను, మన గురించిన అవగాహనను పెంచుకుంటాం. ఏ కారణం చేతనైనా మనకు శత్రువుగా మారిన వ్యక్తిలో సైతం భగవంతుణ్ణి చూడడం మొదలుపెట్టడం ఈ సూత్రాన్ని అనుభవంలోకి తీసుకురావడానికి మంచి మార్గం. వారితో మనకు అనేక బాధాకరమైన జ్ఞాపకాలు, భావనలు ముడిపడి ఉంటాయి. కాబట్టి ఇది కచ్చితంగా కష్టమైనదే. కానీ క్రమంగా... కాలంతో

మన మనస్సు రెండువైపులా పదునున్న కత్తి లాంటిది. అది మన మీద పెత్తనం చేయడం కోసం తన పరిధుల్ని మీరుతుంది. అదే అహంకారానికి జన్మస్థానం.



పాటు ఆ బాధంతా కరిగిపోయి, సంతోషానికి దారితీస్తుంది. నిజానికి మన అందరికీ ఇలాంటి పరిస్థితులు ఎదురై ఉంటాయి. కానీ అవగాహనతో గీతా బోధను అభ్యాసంలో పెట్టవలసిన అవసరం ఉంది. తన పట్ల అవగాహన, ఇతరుల పట్ల కరుణ అనేవి ప్రధానం. భగవద్గీత చెప్పిన మార్గంలో ప్రయాణిస్తూ 'అంతరాత్మ' అనే తీరాన్ని చేరడానికి దోహదం చేస్తాయి.




కె.శివప్రసాద్

ఆఖరి సందేశం...

ఒక జెన్ గురువుకు దేశమంతటా ఎంతో మంది శిష్యులు ఉండేవారు. ఆయన ఉపదేశాలకోసం వారు నిరంతరం ఎదురుచూస్తూ ఉండేవారు. ఒకరోజు ఉదయం ఆయన "ఇవాళ సాయంత్రం తనువు చాలిస్తాను. మన వాళ్ళందరికీ తెలియజెయ్యండి" అని తన శిష్యులకు చెప్పాడు. ఈ సమాచారం దావానలంలా నలు మూలలకూ పాకింది. చివరిసారి గురువును సందర్శించడానికి ఎక్కడెక్కడి నుంచో శిష్యులందరూ అక్కడికి వచ్చిచేరారు.

జెన్ కథ



ముఖ్యుడైన ఒక శిష్యుడు మాత్రం గురువును వదలి దూరంగా ఉన్న సంతకు బయలుదేరాడు. 'వేరే ప్రదేశాల నుంచి ఎందరో వస్తూ ఉంటే... ఈ ముఖ్య శిష్యుడు వెళ్ళిపోవడం ఏమిటి?' అని అందరూ ఆశ్చర్యపోయారు. దారిలో అతనికి ఎదురుపడిన కొందరు "గురువుగారి చివరి క్షణాల్లో ఆయన దగ్గర ఉండకుండా ఎక్కడికి వెళ్తున్నావు?" అని ప్రశ్నించారు.


"నేను గురువుగారి దగ్గర ఎన్నో సంవత్సరాలుగా ఉన్నాను. ఆయనకు చాలా ఇష్టమైన ఒక ఆహార పదార్థం ఉంది. దాన్ని ఆయనకు తెచ్చి ఇద్దామని వెళుతున్నాను" అంటూ ఆ శిష్యుడు పరుగులు తీశాడు.

అక్కడ కుటీరంలో గురువుకు చివరి క్షణాలు దగ్గర పడుతున్నకొద్దీ శిష్యగణంలో ఉత్కంఠ పెరిగిపోతోంది. గురువు కళ్ళు మూసుకొని పడుకున్నాడు. అప్పుడప్పుడు కళ్ళు తెరచి, తన ప్రియశిష్యుడికోసం చూసి, అతను లేడని గ్రహించి, మళ్ళీ కళ్ళు మూసుకుంటున్నాడు. కొంతసేపటికి ఆ శిష్యుడు వచ్చి గురువు ముందు నిలబడ్డాడు. గురువు కళ్ళు తెరచి "వచ్చావా నాయనా! నాకు ఇష్టమైనది తెచ్చావా?" అని అడిగాడు.

అందరూ చాలా ఆశ్చర్యపోయారు. 'గురువుకు ఏదీ చెప్పకుండానే ఆ శిష్యుడు సంతకు వెళ్ళాడు. అతను తనకు ఇష్టమైన ఆహార పదార్థాన్ని తీసుకురావడానికి వెళ్ళాడని గురువుకి ఎలా తెలుసు?' అని గుసగుసలాడుకున్నారు. ఇంతలో ఆ శిష్యుడు తన చేతిలోని పదార్థాన్ని ఇవ్వబోతే... గురువు తన రెండు చేతులూ చాపి దాన్ని అందుకున్నాడు. "ఈ చివరి క్షణాల్లో కూడా మీ చేతులు వణకడం లేదే?" అని చుట్టూ ఉన్న ఇతర శిష్యులు అడిగారు. "నాకు చావంటే భయం ఉంటే కదా... చేతులు వణికేది" అన్నాడు గురువు. తన చేతుల్లోని ఆ పదార్థాన్ని తినేశాడు. అప్పటివరకూ ఓపికగా నిలబడిన శిష్యులు "గురువుగారూ! మీ ఆఖరి సందేశం కోసం ఎదురుచూస్తున్నాం. మీరు మాకు ఇచ్చే చివరి సందేశం ఏమిటి?" అని అడిగారు. గురువు నవ్వి "ఈ పదార్థం చాలా బాగుంది" అని చెబుతూ కన్నుమూశాడు.

ఈ కథను ఓషో ఒక సందర్భంలో వివరిస్తూ "ఆ గురువు ముంచుకొస్తున్న మృత్యువు గురించి చింతించలేదు. జీవించి ఉన్న చివరి క్షణాన్ని ఎలా ఆనందంగా గడపవచ్చో చేసి చూపించాడు. అదే అతను శిష్యులకు ఇచ్చిన ఆఖరి సందేశం" అని చెప్పారు.

● రాచమడుగు శ్రీనివాసులు



బుద్ధ దేవుని ధర్మ బోధ

వ్యాసపీఠం

బౌద్ధ సాహిత్యంలో జాతక కథలకు విశేష ప్రాధాన్యం ఉంది. ఈ కథలలో బౌద్ధ ధర్మ సూత్రాలు... నైతికతను, తాత్త్వికతను సులభమైన భాషలో అందిస్తాయి. బౌద్ధం ప్రపంచవ్యాప్తం కావడం వెనుక ఈ కథల పాత్ర ఎంతో ఉంది. బౌద్ధ గ్రంథమైన 'ఖుద్దక నికాయం'లో 547 జాతక కథలు మనకు లభిస్తాయి. 'పాళీ' భాషను నేర్చుకొని, ఆ కథలను అధ్యయనం చేసిన ప్రముఖ రచయిత బొర్రా గోవర్ధన్... వీటిలో 275 కథలను- తనదైన శైలిలో తెలుగువారికి నివేదించారు. 'ఆంధ్రజ్యోతి'తో పాటు వివిధ పత్రికల్లో ప్రచురినమైన ఆ కథలను 'ధర్మతేజం', 'ధర్మదీపం', 'ధర్మవీణ' అనే మూడు సంపుటాలుగా ప్రచురించారు. ఈ కథలన్నీ బౌద్ధ సంప్రదాయంలో విస్తృత ప్రచారంలో ఉన్నవే! వాటిని గోవర్ధన్ అందరికీ అర్థమయ్యేలా, సరళమైన రీతిలో అందించారు. ప్రాచీనమైన ఆ కథల్లోని నీతిని ఆధునిక జీవితానికి అన్వయించి వివరించడంలో రచయిత ప్రతిభ, సునిశిత పరిశీలన కనిపిస్తుంది. బౌద్ధం పట్ల ఆసక్తి, అనురక్తి ఉన్నవారందరూ తప్పనిసరిగా చదవాల్సిన పుస్తకాలివి.

ధర్మతేజం, ధర్మదీపం, ధర్మవీణ

రచయిత: బొర్రా గోవర్ధన్
ప్రచురణ: లతా రాజా ఫౌండేషన్
ప్రతులకు: 9390600157


దైవమార్గం

విలాప ప్రవక్త

దేవుడు కంటికి కనిపించకపోవచ్చు. ప్రత్యక్షంగా కాకపోయినా ఏదో ఒక రూపంలో చేయాల్సిన సాయం చేస్తాడు. దారి తప్పిన ప్రజలను సన్మార్గంలో నడిపించడానికి కొందరు వ్యక్తులను ఆయన ఎంచుకుంటాడు. వారిని ప్రజల మధ్యకు పంపుతాడు. వారే ప్రవక్తలు. అటువంటి ప్రవక్తలలో యిర్మియా ఒకరు.

'నేను ఎందుకూ పనికిరాను' అనే భావనలో ఉన్న యిర్మియాను దేవుడు తన పరిచర్యకు ఎంపిక చేసుకున్నాడు. "నీవు నావాడవు. నీకు భయం లేదు. తల్లి గర్భంలో ఉన్నప్పుడే నిన్ను పేరు పెట్టి పిలువగలిగిన వాడిని. నీ దేవుణ్ణి" అంటూ తనను తాను పరిచయం చేసుకున్నాడు. దేవుని సేవకే అంకితమైన కుటుంబానికి చెందినవాడు యిర్మియా. ఆయనది బన్యామీను దేశం. అప్పటికే ఇశ్రాయిల్ దేశాన్ని బాబిలోనియన్లు ఆక్రమించేశారు. "మీ దేశం మీకు తిరిగి వచ్చేలా చేస్తాను" అని ఇశ్రాయేలీయులకు దేవుడు వాగ్దానం చేశాడు. ఆ మాట నెరవేరడం కోసం... అక్కడి ప్రజలు తన ఆజ్ఞలను అనుసరించి నడుచుకొనేలా చేయాలని అనుకున్నాడు. అందుకు మధ్యవర్తిగా యిర్మియాను వారి దగ్గరకు పంపించాడు. ఇది క్రీస్తుపూర్వం 700 నాటి సంగతి.

దైవాదేశాన్ని అందుకున్న యిర్మియా... ఇశ్రాయేలీయులను కలుసుకున్నాడు. దుష్కార్యాలను, విగ్రహారాధనను మానుకోవాలని హితవు చెప్పాడు. రాబోయే విపత్తుల గురించి సూచించి హెచ్చరించాడు. కానీ ఇశ్రాయేలీయులు ఆయన మాటలు పట్టించుకోలేదు. విగ్రహాలను ఆరాధించడానికే ఇష్టపడ్డారు. వ్యక్తుల చెడు నడతను బట్టి వారిని యెహోవా శిక్షిస్తాడని యిర్మియా చెప్పినప్పుడు... వారు నవ్వి, ఆయనపై రాళ్ళు



రువ్వారు. హింసించారు. 'యిర్మియా మనకు వ్యతిరేకంగా మాట్లాడాడు కాబట్టి అతణ్ణి చంపాలి' అని నిర్ణయించుకున్నారు. కానీ యిర్మియా ఎలాంటి జంకూ లేకుండా... దేవుని ఆదేశాన్ని అనుసరిస్తూ ముందుకు సాగిపోయాడు. ఇశ్రాయేలీయులు తమ చెడు మార్గాలను మార్చుకోకపోవడంతో... దుర్దశవైపు వెళ్తున్న ఆ ప్రజల కోసం ఆయన విలపించాడు. అందుకే ఆయనను 'విలాప ప్రవక్త' అని పిలుస్తారు. పెద్దల మాటను అనుసరించి, వారు అందించిన నైతిక విలువలను పాటించకపోతే వినాశనం తథ్యం. యిర్మియా చెప్పిన మంచిని తిరస్కరించిన ఆ ప్రజలు... పర రాజ పాలనకు దాసులై, వినాశనాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది.

● డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్, 9866755024

సందేశం

శ్రేయస్సు, శుభాల కోసం...

మానవ జీవితం అంటేనే అనేక సంఘటనల సమాహారం. ఒక్కోసారి శుభాలు జరుగుతాయి. అశుభాలు కూడా చోటు చేసుకుంటూ ఉంటాయి. ఎటువంటి చెడు లేకుండా జీవితం సజావుగా సాగాలని దేవుణ్ణి ప్రార్థించాలి. దానికోసం 'ఇస్తిఖారా' చేయాలని పెద్దలు నిర్దేశించారు. 'ఇస్తిఖారా' అంటే... 'శ్రేయస్సును, శుభాలను, మేలును అర్థించడం' అని అర్థం. ఉద్యోగం, వ్యాపారం, వివాహం, ప్రయాణం... ఇలా అన్ని విషయాల్లో ఇస్తిఖారా చేస్తూ ఉండాలి. అయితే మన కోరిక ధర్మసమ్మతమై ఉండాలి. ఉదాహరణకు... ఒక వ్యక్తి తనకు మంచి ఉద్యోగం దొరకాలని ఇస్తిఖారా చేశాడు. అతనికి ఉద్యోగం వచ్చింది. కానీ దాన్ని దైవం తనకు అనుగ్రహించిన మహా ప్రసాదంగా సంతృప్తి చెందడు. ఆ ఉద్యోగం కష్టంగా ఉందని మనసులో మధనపడుతూ ఉంటాడు. కొన్నాళ్ళకు పదోన్నతులతో పెద్ద స్థాయికి చేరుకుంటాడు. అప్పుడు అతను తృప్తి పడవచ్చు. కానీ మొదట్లో కష్టపడకుండా ఆ స్థితికి రాలేడు కదా! దైవానికి ఎవరికి ఏ సమయంలో ఏ విధంగా సాయం అందించాలో తెలుసు. కానీ మనిషికి సహనం ఉండదు. తనకు మేలు జరిగితే ఆనందిస్తాడు. లేకుంటే దేవుణ్ణి నిందిస్తాడు. ఇది సాధారణమైన మానవ స్వభావం. అలాంటి వైఖరిని విడిచిపెట్టి... అంతా దైవ నిర్ణయమేనని భావించినవారే ఆనందంగా ఉంటారు.

"ఒక పని చెయ్యాల్సి వస్తుంది. అది మనకు ఎంత మేలు చేస్తుందనేది స్పష్టంగా తెలీదు. అప్పుడు తప్పనిసరిగా ఇస్తిఖారా పాటించాలి. దీనికోసం ముందుగా రెండు విడతలు నఫిల్ నమాజ్ చేయాలి. తరువాత ఇస్తిఖారా 'దుఆ' (ప్రార్థన) పఠించాలి. ఆ తరువాత మన హృదయం ఎటువైపు ఆకర్షితం అవుతుందో... దాన్నే దైవ నిర్ణయంగా భావించి అనుసరించాలి. ఇస్తిఖారా చేసే వ్యక్తి ఎన్నటికీ విఫలం కాడు. ప్రతి పని చేసే ముందు దైవనామంతో దాన్ని ప్రారంభిస్తే... ఆ కార్యం తప్పకుండా విజయవంతం అవుతుంది" అని ఇస్లాం ధర్మం చెబుతోంది. "దైవ ప్రవక్త మహమ్మద్ మాకు ఏ విధంగానైతే ఖుర్ఆన్ బోధించేవారో... అదే విధంగా ప్రతి పనిలో 'ఇస్తిఖారా' ప్రార్థన చేయడం గురించి కూడా చెప్పేవారు. "మీలో ఎవరైనా ఏదైనా ముఖ్యమైన విషయం గురించి సందిగ్ధంలో ఉంటే... వారు రెండు విడతలు నఫిల్ నమాజ్ చేసి తరువాత ప్రార్థన చేయాలి" అని వివరించేవారు. సరైన నిర్ణయం తీసుకోలేని సమయాల్లో... దేవునిపైనే భారం వేసి, నిర్ణయాన్ని ఆయనకే వదిలిపెడితే... పరిష్కారమార్గాన్ని కచ్చితంగా నిర్దేశిస్తాడు" అని మహనీయుడైన హజ్రత్ జాబిర్ స్పష్టం చేశారు.



● మహమ్మద్ వహీదుద్దీన్

స్పోర్ట్స్

విజయవాడ ● శుక్రవారం 29 ఆగస్టు 2025


ట్రోఫీతో కబడ్డీ జట్ల సారథులు

విశాఖలో నేటి నుంచి ప్రొ. కబడ్డీ

విశాఖపట్నం-స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): విశాఖ పోర్టు రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం వేదికగా శుక్రవారం నుంచి ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) సీజన్-12 జరగనున్నది. తొలి అంచెలో భాగంగా సెప్టెంబరు 11 వరకు ఇక్కడ పోటీలు నిర్వహిస్తున్నారు. బీచ్‌రోడ్డులోని ఐఎన్ఎస్ కురుసురా సబ్‌మెరైన్ వద్ద ట్రోఫీని ఆవిష్కరించారు. అనంతరం పీకేఎల్ చైర్మన్ అనుపమ గోస్వామితోపాటు 12 జట్ల సారథులు, ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్సుకు చెందిన ఆటగాళ్లు భారత సాయుధ దళాలకు నివాళులర్పించారు. ఈ సీజన్‌లో అన్ని జట్లు పటిష్ఠంగా ఉన్నాయని తెలుగు టైటాన్స్ కెప్టెన్ విజయ్ మాలిక్, తమిళ్ తలైవాస్ సారథి పవన్ సెహ్రావత్ అన్నారు. జొమోటా డిస్ట్రిక్ట్ వెబ్‌సైట్‌లో టికెట్ల అమ్మకాలు ప్రారంభించారు. శుక్రవారం రాత్రి 8 గంటలకు ప్రారంభమయ్యే తొలి మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్‌తమిళ్ తలైవాస్, 9 గంటలకు జరిగే రెండో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్‌-పుణెరి పల్టన్ జట్లు తలపడతాయి.

అదరగొట్టిన సింధు

- వరల్డ్ నెం: 2పై విజయంతో క్వార్టర్స్‌కు..
- సాత్విక్, ధ్రువ్ జోడీలు కూడా..
- వరల్డ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్



పారిస్: గత కొంత కాలంగా ఫామ్ కోసం తంటాలుపడుతున్న భారత ఏస్ షట్లర్ పీవీ సింధు ఈ సీజన్‌లో తొలి సారి తన స్థాయికి తగ్గ ప్రదర్శన కనబరచింది. అలనాటి పవర్ గేమ్‌ను మరో సారి ప్రదర్శించిన సింధు.. వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో రెండో సీడ్ వాంగ్ జి యి (చైనా)కు షాకిస్తూ క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. పురుషుల డబుల్స్‌లో తొమ్మిదో సీడ్ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ జోడీ, మిక్స్‌డ్‌లో ధ్రువ్ కపిల జంట సంచలన విజయాలతో రౌండ్-8కు చేరుకొన్నాయి. గురువారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో 15వ ర్యాంకర్ సింధు 21-19, 21-15తో వాంగ్ జి యిని వరుస గేముల్లో చిత్తు చేసింది. శుక్రవారం జరిగే క్వార్టర్స్‌లో పుత్రి కుసుమవర్ధని (ఇండోనేసియా)తో సింధు తలపడనుంది. పురుషుల డబుల్స్ రౌండ్-16లో సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ 21-15, 21-17తో ఆరో సీడ్. చైనా జోడీ లియాంగ్ వి కెంగ్-వాంగ్ చాంగ్‌కు ఝలక్ ఇచ్చింది. తొలి గేమ్‌లో ఓడినా.. భారత జంట అద్భుతంగా పుంజుకొని మిగతా రెండు గేమ్‌లు గెలిచింది. ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో జంట 19-21, 21-12, 21-15తో హాంకాంగ్‌కు చెందిన టాంగ్ చున్ మన్-సె యింగ్ సూట్‌పై నెగ్గింది. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ప్రణయ్ 7-21, 21-17, 21-23తో వరల్డ్ నెం:2 అంటాన్‌సెన్ (డెన్మార్క్) చేతిలో పోరాడి ఓడాడు.

గ్రాండ్ చెస్ టూర్ ఫైనల్‌కు ప్రజ్ఞానంద అర్హత

సెయింట్ లూయిస్ (యూఎస్): భారత గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద గ్రాండ్ చెస్ టూర్ ఫైనల్‌కు అర్హత సాధించాడు. సింక్వెఫీల్డ్ కప్‌లో రన్నరప్‌గా నిలవడంతో ప్రజ్ఞానందకు గ్రాండ్ చెస్ టూర్ ఫైనల్ బెర్త్ ఖాయమైంది. అమెరికా గ్రాండ్‌మాస్టర్ వెస్లీ సో సింక్వెఫీల్డ్ కప్ టైటిల్ దక్కించుకున్నాడు. తొమ్మిదో, తుది రౌండ్‌లో అబ్దుసత్తొరోవ్‌పై నెగ్గిన వెస్లీ సో..ప్రజ్ఞానంద, తన దేశానికే చెందిన కరువానాతో కలిసి 5.5 పాయింట్లతో సమంగా నిలిచాడు. దాంతో..ప్లేఆఫ్ నిర్వహించగా రెండు పాయింట్లకుగాను వెస్లీ 1.5 పాయింట్లు సాధించి కప్ అందుకున్నాడు. ఇక..టైబ్రేకర్‌లో లెవాన్ అరోనియన్ (అమెరికా)తో డ్రా చేసుకున్న ప్రజ్ఞానంద..కరువానపై నెగ్గి రన్నరప్‌గా నిలిచాడు.

సబలెంక, అల్కారజ్
ముందంజ

ఓస్టాపెంకో తిరుగుముఖం ● యూఎస్ ఓపెన్


సబలెంక


స్వియటెక్

న్యూయార్క్: ఈ ఏడాది ఆఖరి గ్రాండ్‌స్లామ్ యూఎస్ ఓపెన్‌లో సీడెడ్‌ల పయనం సాఫీగా సాగుతోంది. గురువారం జరిగిన రెండో రౌండ్‌లో టైటిల్ ఫేవరెట్ అల్కారజ్ 6-1, 6-0, 6-3తో మాటియా బెలూసీ (ఇటలీ)పై గెలుపొందాడు. షెల్టన్ 6-4, 6-4, 6-2తో కరెనోపై, జ్వెరెవ్ 6-2, 7-6 (4), 6-4తో తిబీలోపై, టేలర్ ఫ్రిట్జ్ 4-6, 7-6 (3), 6-2, 6-4తో హారిస్‌పై, జొకోవిచ్ 6-7 (7), 6-3, 6-3, 6-1తో సజ్జాపై, 17వ సీడ్ టియఫో 6-4, 7-5, 6-7 (10), 7-5తో మార్టిన్ డామ్‌పై నెగ్గి మూడో రౌండ్‌కు చేరారు. ఐదో సీడ్ జాక్ డ్రేపర్ ప్రత్యర్థికి రెండో రౌండ్‌లో వాకోవర్ ఇచ్చాడు.

మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ సబలెంక 7-6 (4), 6-2తో కుడెర్మెటోవాపై సునాయాసంగా నెగ్గగా, లామెన్స్‌పై గెలిచేందుకు రెండో సీడ్ స్వియటెక్ 6-1, 4-6, 6-4తో మూడు సెట్లు పోరాడాల్సి వచ్చింది. ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో పెగుల 6-1, 6-3తో బ్లింకోవాని, ఆండ్రీవా 6-1, 6-3తో పొటపోవాని, పోలిని 6-3, 6-3తో జోవిక్‌ని, రిబకినా 6-3, 7-6 (7)తో వలెంటోవాని ఓడించి ముందంజ వేశారు. అన్‌సీడెడ్ అన్ లీ 6-3, 6-3తో 16వ సీడ్ బెన్సిక్‌ని, మరో అన్‌సీడెడ్ టేలర్ టౌన్‌సెండ్ 7-5 6-1తో ఫ్రెంచ్ ఓపెన్ మాజీ విజేత జెలెనా ఓస్టాపెంకోని కంగుతినిపించారు.

మెద్వెదెవ్‌కు రూ. 37 లక్షల జరిమానా: అనుచితంగా ప్రవర్తించిన రష్యా స్టార్ డానిల్ మెద్వెదెవ్‌కు టోర్నీ రెఫరీ రూ. 37 లక్షల జరిమానా విధించారు. ఫ్రాన్స్ ఆటగాడు బెంజమిన్ బోన్జీ-మెద్వెదెవ్ తొలి రౌండ్ మ్యాచ్ జరుగుతున్న సమయంలో ఫొటోగ్రాఫర్ ఒకరు కోర్టులోకి వచ్చారు. దాంతో బోన్జీకి అంపైర్ గ్రెగ్ అదనంగా మొదటి సర్వీస్ ఇవ్వడంతో..మెద్వెదెవ్ తీవ్ర ఆగ్రహానికి లోనయ్యాడు. అంపైర్ వద్దకు వెళ్లి వాదన పెట్టుకోవడమే కాదు అతడిని దూషించాడు. ఇక..మ్యాచ్ ఓడిపోయిన తర్వాత అసహనంతో రాకెట్‌ను సైతం విరగ్గొట్టాడు. దాంతో అంపైర్‌తో వాగ్వాదానికి దిగినందుకు రూ. 26 లక్షలు, రాకెట్ విరగ్గొట్టినందుకు రూ. 11 లక్షల జరిమానాను మెద్వెదెవ్‌కు విధించారు.

నీరజ్‌కు రెండో స్థానం



డైమండ్ లీగ్ విజేత వెబర్

జ్యూరిచ్ (స్విట్జర్లాండ్): డైమండ్ లీగ్ ఫైనల్లో భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా రెండో స్థానంలో నిలిచాడు. గురువారం జరిగిన ఈవెంట్‌లో ఆరో, ఆఖరి ప్రయత్నంలో నీరజ్ 85.01 మీటర్ల దూరం విసిరాడు. జర్మన్ త్రోయర్ జూలియన్ వెబర్ 91.51 మీటర్లతో విజేతగా నిలిచాడు. వాల్కాట్ (84.95) మూడోస్థానం సాధించాడు. ఇక తొలి ప్రయత్నంలోనే 84.35 మీటర్లు దూరం విసిరిన చోప్రా ఆ తర్వాత తడబడ్డాడు. రెండో త్రోలో 82 మీటర్లు మాత్రమే నమోదు చేసిన నీరజ్.. మూడు, నాలుగు, ఐదు త్రోలు ఫౌల్ చేశాడు.

అజయ్ బాబుకు స్వర్ణం

జూహితకు పసిడి ● కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్


జూహిత


అజయ్‌బాబు

అహ్మదాబాద్: కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్స్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వల్లూరి అజయ్‌బాబు స్వర్ణం సాధించాడు. గురువారం జరిగిన పురుషుల 79 కిలోల కేటగిరీలో అజయ్ 335 (152+183) కిలోల బరువునెత్తి అగ్రస్థానంలో నిలిచాడు. అజయ్‌బాబుది విజయనగరం జిల్లాలోని కొండవెలగాడ గ్రామం. కాగా యూత్ విభాగంలో మహిళల 69 కిలోల్లో రాజమండ్రికి చెందిన సి. జూహిత గుణ పసిడి పతకం సాధించింది.

గెలుపే లక్ష్యంగా..!

- తొలి మ్యాచ్‌లో చైనాతో భారత్ ఢీ
- ఆసియాకప్ హాకీ నేటినుంచే

మ. 3 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..



రాజ్‌గిర్ (బిహార్): ఇటీవలి కాలంలో వరుస ఓటములతో డీలాపడ్డ భారత హాకీ జట్టు బలంగా పుంజుకోవాలనుకొంటోంది. ఆసియా కప్ నెగ్గడం ద్వారా వచ్చే ఏడాది జరిగే వరల్డ్ కప్ బెర్త్‌ను సాధించే ఆఖరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకొంటోంది. శుక్రవారం ఆరంభమయ్యే ఈ టోర్నీ పూల్-ఎలో తమ తొలి మ్యాచ్‌లో చైనాతో భారత్ తలపడనుంది. ఈ మ్యాచ్‌లో భారత్ ఫేవరెట్‌గా కనిపిస్తున్నా.. అటాకింగ్ గేమ్ ఆడే చైనాను ఏ మాత్రం తక్కువగా అంచనా వేసినా ఫలితం తారుమారయ్యే ప్రమాదముంది. భారత్, చైనాలోపాటు జపాన్, కజకిస్థాన్ పూల్-ఎలో.. దక్షిణ కొరియా, మలేసియా, బంగ్లాదేశ్, చైనీస్ తైపీ పూల్-బిలో ఉన్నాయి.

26 పతకాలు ఖరారు

అంతర్జాతీయ యూత్ బాక్సింగ్

న్యూఢిల్లీ: చైనాలో జరుగుతున్న అంతర్జాతీయ యూత్ బాక్సింగ్ టోర్నీలో భారత బాక్సర్లు 26 పతకాలు ఖాయం చేశారు. అండర్-17 కేటగిరీలో 20 మంది బాలురు, 20 మంది బాలికల బృందాలను భారత్ ఈ టోర్నీకి పంపింది.

గురుప్రీత్ గురి అదిరె..




- రెండు స్వర్ణాలు కొల్లగొట్టిన భారత షూటర్
- పసిడితో మెరిసిన మురళీధర్
- ఆసియా చాంపియన్‌షిప్స్

షిమ్‌కెంట్ (కజకిస్థాన్): ఆసియా చాంపియన్‌షిప్స్‌లో గుర్‌ప్రీత్ సింగ్ రెండు పసిడి పతకాలు కొల్లగొట్టాడు. జూనియర్ విభాగంలో తెలంగాణకు చెందిన మురళీధర్ నాయుడు స్వర్ణ, కాంస్యాలతో మెరిశాడు. 25మీ. స్టాండర్డ్ పిస్టల్ కేటగిరీ ఫైనల్లో గురుప్రీత్ స్వర్ణం, అమన్‌ప్రీత్ రజతం అందుకున్నారు. ఇక గురుప్రీత్, అమన్‌ప్రీత్, హర్ష్ గుప్తాతో కూడిన భారత జట్టు 25 మీ. స్టాండర్డ్ పిస్టల్ టీమ్ విభాగంలో స్వర్ణం నెగ్గింది.

మురళీధర్ భళా..: జూనియర్ విభాగంలో మురళీధర్ నాయుడు రెండు పతకాలతో సత్తా చాటాడు. 25 మీ. స్టాండర్డ్ పిస్టల్ టీమ్ కేటగిరీలో మురళీధర్ నాయుడు, సూరజ్ శర్మ, ముకేష్‌తో కూడిన భారత త్రయం (1703 పాయింట్లు) స్వర్ణం చేజిక్కించుకుంది. ఇక 25 మీ. స్టాండర్డ్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో మురళీధర్ (568) కాంస్యం నెగ్గాడు. జూనియర్ పురుషుల 50 మీ. రైఫిల్ ప్రోన్‌లో సమీవుల్లా, కర్మాకర్, కుశాగ్ర త్రయం పసిడి పతకాన్ని సాధించింది.

ట్రంప్ బెదిరింపులకు
లొంగొద్దు

- మన గౌరవ మర్యాదలే ముఖ్యం
- జీఎస్టీ తగ్గిస్తే చిన్న కార్లకు మేలే
- మారుతి సుజుకీ చైర్మన్ భార్గవ



న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలపై భారత కార్పొరేట్ వర్గాల్లోనూ అసహనం వ్యక్తమవుతోంది. ఈ బెదిరింపులకు ఏ మాత్రం లొంగకూడదని మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) చైర్మన్ ఆర్‌సీ భార్గవ ప్రభుత్వాన్ని కోరారు. వాణిజ్యం కంటే దేశ గౌరవ మర్యాదలే ముఖ్యమన్నారు. ఈ కీలక సమయంలో దేశమంతా ఒక్కటిగా నిలవాలని కోరారు. మారుతి సుజుకీ ఇండియా వాటాదారుల 44వ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని (ఏజీఎం) ఉద్దేశించి మాట్లాడుతూ భార్గవ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక అనిశ్చితికి ట్రంప్ సుంకాల పోటే కారణమన్నారు. దౌత్య సంబంధాల్లో సుంకాలను ఆయుధంగా ఉపయోగిస్తున్న తొలి నేత ట్రంపేనని భార్గవ విమర్శించారు. భారత్-బ్రిటన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ).. అమెరికాతో సహా ఇతర దేశాలతో కుదుర్చుకునే ఎఫ్‌టీఏలకు ప్రాతిపదికగా ఉండాలని భార్గవ స్పష్టం చేశారు. రేర్ ఎర్త్ మాగ్నెట్ల సరఫరాపై చైనా ఆంక్షలను ఒక హెచ్చరికగా తీసుకోవాలని కోరారు.

చిన్న కార్లకు మేలు: ప్రతిపాదిత జీఎస్టీ సంస్కరణలపైనా భార్గవ మాట్లాడుతూ.. ఈ సంస్కరణలు జీడీపీ వృద్ధి రేటు, ఉపాధి కల్పన వేగం పుంజుకునేందుకు దోహదం చేస్తాయన్నారు. ఈ సంస్కరణల్లో భాగంగా చిన్న కార్లపై ప్రస్తుతం ఉన్న 28 శాతం జీఎస్టీ.. 18 శాతానికి తగ్గుతుందని ఆశిస్తున్నట్టు తెలిపారు. అయితే దీనిపై ప్రభుత్వం ఇంకా అధికారికంగా ప్రకటన చేయాల్సి ఉందన్నారు. చిన్న కార్లపై జీఎస్టీ 18 శాతానికి తగ్గిస్తే ఈ తరగతి కార్ల మార్కెట్ మళ్లీ పుంజుకుంటుందన్నారు. ప్రస్తుతం తమ ప్రయాణాల కోసం స్కూటర్లు, బైకులపై ఆధారపడిన అనేక మంది చిన్న కార్లు కొనేందుకు ముందుకు వచ్చే అవకాశం ఉందన్నారు. జపాన్ అనుభవమే ఈ విషయంలో మనకు ఆదర్శమన్నారు.

బిజినెస్

బీఓబీ వడ్డీ రేట్ల తగ్గింపు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) కారు, తనఖా రుణాలు సహా కొన్ని ఎంపిక చేసిన రుణాలపై వడ్డీ రేటును 0.25% మేరకు తగ్గించింది. ఈ తగ్గింపు తక్షణం అమల్లోకి వస్తుంది. ఈ తగ్గింపుతో కారు రుణాలపై ఫ్లోటింగ్ రేటు 8.15% నుంచి మొదలవుతుందని బ్యాంక్ తెలిపింది. ప్రాపర్టీని తనఖా పెట్టి తీసుకునే రుణాలపై వడ్డీరేటు 9.85% నుంచి 9.15 శాతానికి తగ్గింది.

విశాఖలో అమెజాన్ ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్

న్యూఢిల్లీ: రానున్న పండగ సీజన్లలో డెలివరీ సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ ఇండియా తన లాజిస్టిక్స్ ఆపరేషన్స్ నెట్‌వర్క్‌ను విస్తరించింది. ఇందులో భాగంగా హైదరాబాద్, విశాఖపట్నం సహా దేశవ్యాప్తంగా మరో 12 నగరాల్లో కొత్త ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు, ఆరు కొత్త సార్ట్ సెంటర్లను ప్రారంభించింది. ఈ విస్తరణతో కొత్తగా 84 లక్షల చదరపు అడుగుల అదనపు నిల్వ సామర్థ్యం అందుబాటులోకి వచ్చిందని అమెజాన్ తెలిపింది. ఈ ఏడాది రూ.2,000 కోట్ల పెట్టుబడితో కార్యకలాపాలు విస్తరించాలన్న ప్రణాళికలకు అనుగుణంగా వీటిని ప్రారంభించినట్లు వెల్లడించింది.

సుంకాల సంకటం

2 రోజుల్లో సెన్సెక్స్ 1,555 పాయింట్లు పతనం

- రూ..69 లక్షల కోట్ల మార్కెట్ సంపద ఆవిరి
- టెక్స్‌టైల్స్, రొయ్యలు, తోలు, జెమ్స్ అండ్ జువెలరీ షేర్లలో భారీగా అమ్మకాలకు పాల్పడిన మదుపరులు



ముంబై: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు స్టాక్ మార్కెట్‌ను కుదిపేస్తున్నాయి. భారత ఎగుమతులపై ట్రంప్ అదనంగా 25 శాతం జోడించి 50 శాతానికి పెంచిన సుంకాలు బుధవారం నుంచి అమలులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈక్విటీ మదుపరులు ఎగుమతి ప్రభావిత కంపెనీల షేర్లలో పెద్దఎత్తున అమ్మకాలకు పాల్పడటంతో ప్రామాణిక ఈక్విటీ సూచీలు భారీగా నష్టపోయాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) కూడా పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం మార్కెట్‌పై ఒత్తిడిని మరింత పెంచింది. దాంతో బీఎస్ఈ సెన్సెక్స్ గురువారం మరో 705.97 పాయింట్లు పతనమై 80,080.57 వద్దకు జారుకుంది. నిఫ్టీ 211.15 పాయింట్లు కోల్పోయి 24,500.90 స్థాయికి పడిపోయింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 23 నష్టపోయాయి..

వినాయక చవితి సందర్భంగా స్టాక్ ఎక్స్ఛేంజీలు బుధవారం సెలవు పాటించాయి. సుంకాల పోటుతో గడిచిన రెండు ట్రేడింగ్ సెషన్లలో (మంగళవారం, గురువారం) సెన్సెక్స్ 1,555.34 పాయింట్లు, నిఫ్టీ 466.85 పాయింట్లు క్షీణించాయి. రెండు రోజుల్లో ఈక్విటీ వర్గాల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.9.69 లక్షల కోట్లు తగ్గి రూ.445.17 లక్షల కోట్లకు (5.08 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

ఈ రంగాలపై అధిక ప్రభావం

ట్రంప్ సుంకాల పోటుతో టెక్స్‌టైల్స్, రొయ్యలు, తోలు, జెమ్స్ అండ్ జువెలరీ రంగ కంపెనీల షేర్లు తీవ్ర ఒత్తిడికి లోనయ్యాయి. రంగాల వారీగా కంపెనీల షేర్ల నష్ట వివరాలు..

కంపెనీ షేరు	నష్టం(%)
టెక్స్‌టైల్స్	
కిటెక్స్ గార్మెంట్స్	5.0
పర్ల్ గ్లోబల్	2.94
సియారామ్ సిల్క్ మిల్స్	2.56
రేమండ్ లైఫ్‌స్టైల్	2.37
అలోక్ ఇండస్ట్రీస్	1.59
రూప అండ్ కంపెనీ	1.43
వెల్‌స్పన్ లివింగ్	1.09
ట్రైడెంట్ లిమిటెడ్	1.01
రొయ్యలు	
అపెక్స్ ఫ్రోజెన్ ఫుడ్స్	5.36
వాటర్‌బేస్ లిమిటెడ్	3.38
అవంతి ఫీడ్స్	0.82
తోలు, పాదరక్షలు	
ఖదీమ్ ఇండియా	1.95
రిలాక్సో ఫుట్‌వేర్	1.84
మయూర్ యూనికోటర్స్	0.83
సూపర్‌హౌస్ లిమిటెడ్	0.56
మీర్జా ఇంటర్నేషనల్	0.50
జెమ్స్ అండ్ జువెలరీ	
బ్లూస్టోన్ జువెలరీ	3.51
స్కై గోల్డ్ అండ్ డైమండ్స్	3.23
కాంతి గోల్డ్	3.05
త్రిభువన్‌దాస్ భీమ్‌జీ జవేరీ	0.84
రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్	0.37

ఎగుమతిదారులకు అండగా ప్రభుత్వం

- రూ.25,000 కోట్లతో ప్రత్యేక ప్యాకేజీ !
- హామీ ఇచ్చిన కేంద్ర ఆర్థిక మంత్రి

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల పోటుతో దెబ్బతిన్న ఎగుమతి కంపెనీలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. గురువారం తనను కలిసిన భారత ఎగుమతిదారుల సమాఖ్య (ఫియో) జాతీయ అధ్యక్షుడు ఎస్‌సీ రల్హాన్ నాయకత్వంలోని ఎగుమతిదారుల బృందానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ మేరకు హామీ ఇచ్చారు. ఈ కష్ట సమయంలో మీకు అండగా నిలబడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్టు సీతారామన్ చెప్పినట్టు ఫియో ఒక ప్రకటనలో తెలిపింది. ఇందుకోసం ఆరేళ్లపాటు అమల్లో ఉండేలా రూ.25,000 కోట్ల నిధితో ఎగుమతుల ప్రోత్సాహక మిషన్ (ఈపీఎం) పేరుతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నట్టు అధికార వర్గాలు చెప్పాయి.

సాయం ఇలా!

ఎగుమతుల కోసం ఈ కంపెనీలు తీసుకున్న రుణ వసూళ్లపై విరామం (మారటోరియం) ప్రకటించే విషయాన్నీ ప్రభుత్వం పరిశీలిస్తోంది. వీటికి తోడు అమెరికా సుంకాల పోటును దృష్టిలో ఉంచుకుని ఇతర దేశాల మార్కెట్లపైనా ప్రభుత్వం దృష్టి పెట్టింది. భారత్-బ్రిటన్ ఎఫ్‌టీఏ తరహాలో ఈయూ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జపాన్‌లతోనూ ఎఫ్‌టీఏలు కుదుర్చుకునేందుకు చర్చలను త్వరితం చేస్తున్నట్టు అధికార వర్గాలు చెప్పాయి. మరోవైపు జీఎస్టీ సంస్కరణల ద్వారా దేశీయ వినియోగాన్ని పెంచి ఈ కంపెనీలకు అండగా నిలవాలని ప్రభుత్వం యోచిస్తోంది.

ఎంఎస్ఎంఈల కోసం..

అమెరికా సుంకాల పోటుతో ఎగుమతుల రంగంలో ఉన్న ఎంఎస్ఎంఈ కంపెనీలు తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. దీంతో ఈ కంపెనీలను ఆదుకునేందుకు అవి తీసుకునే రుణ చెల్లింపుల కోసం అత్యవసరంగా ప్రత్యేక రుణ చెల్లింపుల హామీ పథకం తీసుకువచ్చేందుకూ కసరత్తు చేస్తున్నట్టు అధికార వర్గాలు చెప్పాయి. అమెరికా ఆంక్షల ప్రభావం పెద్ద పెద్ద కంపెనీలపై కంటే అన్‌లిస్టెడ్ కంపెనీలు, ఎంఎస్ఎంఈలపైనే ఎక్కువగా ఉంటుందని పరిశ్రమ వర్గాల అంచనా. దీనికి తోడు ఈ కంపెనీల్లోనే ఎక్కువ మంది పని చేస్తున్నారు. దీంతో కొవిడ్ సమయంలోలా ఈ కంపెనీలకు ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోబోతున్నట్టు అధికార వర్గాలు చెప్పాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



29 తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	560
వరంగల్	512	గోదావరి	550
చిత్తూరు	568	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ.	72

రష్యా చమురు దిగుమతులతో
ప్రయోజనం కొంతే..

- వార్షిక లబ్ధి 250 కోట్ల డాలర్లే..
- గత అంచనాల్లో పదో వంతే..
- వెల్లడించిన సీఎల్ఎస్ఏ నివేదిక

న్యూఢిల్లీ: డిస్కౌంట్ ధరకు రష్యా నుంచి దిగుమతి చేసుకుంటున్న ముడి చమురుతో భారత్‌కు వార్షిక ప్రయోజనం కేవలం 250 కోట్ల డాలర్లేనని (సుమారు రూ.21,875 కోట్లు), దేశ జీడీపీలో 0.6 శాతానికి సమానమని బ్రోకరేజీ సంస్థ సీఎల్ఎస్ఏ గురువారం విడుదల చేసిన అధ్యయన నివేదికలో వెల్లడించింది. గతంలో పలు మీడియా కథనాలు అంచనా వేసిన 1,000-2,500 కోట్ల డాలర్ల (రూ.87,500-2,18,750 కోట్లు) స్థాయి భారీ లబ్ధితో పోలిస్తే చాలా తక్కువని పేర్కొంది. భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు దిగుమతిదారు. వినియోగదారు కూడా. రష్యా నుంచి దిగుమతిని నిలిపివేస్తే, భారత్ ప్రస్తుతం అందుబాటులో ఉన్న పరిమిత ప్రత్యామ్నాయాలపైనే ఆధారపడాల్సి ఉంటుంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలైనప్పటి నుంచి రష్యా నుంచి భారత్‌కు ముడి చమురు దిగుమతులు అనూహ్యంగా పెరిగాయి. ఈ యుద్ధానికి ముందు భారత్ మొత్తం ముడి చమురు దిగుమతుల్లో రష్యా వాటా కేవలం ఒక శాతం కాగా.. ప్రస్తుతం అది దాదాపు 40 శాతానికి పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత్ రోజుకు సగటున 54 లక్షల పీపాల ముడి చమురును దిగుమతి చేసుకోగా.. అందులో రష్యా వాటా 18 లక్షల పీపాలుగా (36 శాతం) నమోదైంది. సౌదీ అరేబియా వాటా 14 శాతం, ఇరాక్ వాటా 20 శాతం, యూఏఈ వాటా 9 శాతం, అమెరికా వాటా 4 శాతంగా ఉంది.

పవర్ మెక్ ప్రాజెక్ట్స్‌కు రూ.370 కోట్ల ఆర్డర్

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా ఉన్న పవర్ మెక్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్.. అదానీ పవర్ అనుబంధ సంస్థ అయిన మహాన్ ఎనర్జెన్ నుంచి రూ. 370.84 కోట్ల విలువైన ఆర్డర్‌ను దక్కించుకుంది. ఆర్డర్‌లో భాగంగా మధ్యప్రదేశ్‌లోని సింగ్రౌలిలో ఉన్న మహాన్ ఫేజ్-3 థర్మల్ పవర్ ప్రాజెక్టులో నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంటుందని పవర్‌మెక్ తెలిపింది.

భారత స్టాక్ మార్కెట్‌కు ఢోకా లేదు

ఎన్ఎస్ఈ సీఈఓ చౌహాన్

దేశీయ స్టాక్ మార్కెట్‌కు ఢోకా లేదని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) సీఈఓ, ఎండీ ఆశిష్ కుమార్ చౌహాన్ అన్నారు. స్థిరమైన అధిక వృద్ధి రేటు, సమగ్ర పొదుపు నిల్వలు, బలమైన బ్యాంకుల బ్యాలెన్స్‌షీట్లు, ప్రభుత్వ సంస్కరణల ఎజెండా, శరవేగ డిజిటలీకరణ వంటి పటిష్ఠ మూలాలు మన మార్కెట్‌కు దన్నుగా నిలుస్తాయన్నారు. ట్రంప్ టారిఫ్‌ల ప్రభావంతో ప్రస్తుతం ప్రతికూలతలు ఎదురవుతున్నప్పటికీ, మన మార్కెట్ అంతర్జాతీయ అనిశ్చితులను తట్టుకుంటూనే ఇన్వెస్టర్లకు దీర్ఘకాలిక స్థిరత్వంతో పాటు పెట్టుబడి అవకాశాలను కల్పించగలదన్నారు.

నేటి నుంచి అబ్రిల్ పేపర్ టెక్ ఐపీఓ

అబ్రిల్ పేపర్ టెక్ పబ్లిక్ ఇష్యూ శుక్రవారం ప్రారంభమై వచ్చే నెల 2న ముగియనుంది. ఇష్యూ ధరను రూ.61గా ఖరారు చేసింది. ఇష్యూలో భాగంగా కంపెనీ కొత్తగా రూ.10 ముఖ విలువతో కూడిన 22 లక్షల ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. బీఎస్ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్‌పై కంపెనీ తన షేర్లను లిస్ట్ చేయనుంది. ఇష్యూ ద్వారా మొత్తం రూ.13.42 కోట్లను సమీకరించనుంది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	92	విజయవాడ	112
వరంగల్	92	గుంటూరు	107
కరీంనగర్	92	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	92	చిత్తూరు	94
కర్నూలు	92	నెల్లూరు	99
విశాఖపట్నం	116	అనంతపురం	99
గోదావరి	112		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,02,600 ▲	94,050 ▲	1,30,000 ▼
విజయవాడ	1,04,700 ▲	98,000 ▲	1,20,070 ▲
విశాఖపట్నం	1,04,590 ▲	94,050 ▲	1,30,000 ▲
రాజమండ్రి	1,02,600 ▲	94,050 ▲	1,12,000 ▼
ప్రొద్దుటూరు	1,02,450 ▲	94,250 ▲	1,19,100 ▲
ముంబై	1,01,506 ▲	92,980 ▲	1,17,110 ▲

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

సంప్రదాయ లుక్‌లో శంకర వరప్రసాద్



చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు'. నయనతార కథానాయిక. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. వినాయక చవితి సందర్భంగా చిత్రబృందం కొత్త పోస్టర్‌ను పంచుకొంది. పట్టుపంచె, కండువా ధరించి పడవపై స్టైలిష్ లుక్‌తో చిరంజీవి అలరించారు. వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సినిమాటోగ్రఫీ: సమీర్‌రెడ్డి

విడుదల వాయిదా



బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'అఖండ 2'. గతంలో వీరి కలయికలో వచ్చిన 'అఖండ' చిత్రానికి ఇది కొనసాగింపు. ముందు ప్రకటించిన విధంగా సెప్టెంబర్ 25న 'అఖండ 2' ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. అయితే ఇప్పుడు ఈ చిత్రం విడుదల వాయిదా పడింది. 'ప్రేక్షకులకు అద్భుతమైన అనుభవాన్ని అందించేందుకు వీఎఫ్ఎక్స్, రీ రికార్డింగ్‌లో మెరుగులు దిద్దేందుకు మరింత సమయం అవసరం పడుతుంది, అందుకే సినిమాను వాయిదా వేస్తున్నాం. కొత్త విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తాం' అని నిర్మాణ సంస్థ 14 రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్ తెలిపింది. ఈ చిత్రంలో సంయుక్త కథానాయికగా నటిస్తున్నారు. తేజస్విని నందమూరి, రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు.

గ్యాంగ్‌స్టర్ డ్యూయెట్



పవన్ కల్యాణ్ గ్యాంగ్‌స్టర్ పాత్ర పోషిస్తున్న చిత్రం 'ఓజీ'. సుజీత్ దర్శకత్వంలో డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ప్రియాంక అరుల్ మోహన్ కథానాయిక. పవన్, అరుల్ మోహన్‌పై చిత్రీకరించిన ప్రేమగీతాన్ని వినాయక చవితి సందర్భంగా చిత్రబృందం విడుదల చేసింది. 'సువ్వీ సువ్వీ' అంటూ సాగే ఈ గీతానికి తమన్ స్వరాలు అందించారు. కల్యాణ్ చక్రవర్తి త్రిపురనేని సాహిత్యం అందించగా, శ్రుతిరంజని ఆలపించారు. ఇమ్రాన్ హష్మీ, ప్రకాశ్‌రాజ్, శ్రియా రెడ్డి కీలకపాత్రలు పోషిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రవి కెచంద్రన్, మనోజ్ పరమహంస, ఎడిటర్ నవీన్ నూలీ.

వైవాహిక బంధంలోకి నివేదా



కథానాయిక నివేదా పేతురాజ్ త్వరలో వైవాహిక బంధంలోకి అడుగు పెట్టబోతున్నారు. తనకు కాబోయే భాగస్వామి రాజ్‌హిత్ ఇబ్రాన్‌ను పరిచయం చేస్తూ సోషల్ మీడియాలో ఫొటోలు షేర్ చేశారు. 'ఇప్పటి నుంచి జీవితమంతా ప్రేమమయమే...'అనే క్యాప్షన్‌తో రాజ్‌హిత్‌తో ఉన్న ఫొటోలు పోస్ట్ చేశారు. రాజ్‌హిత్ దుబాయ్‌లో ప్రముఖ వ్యాపారవేత్త అని తెలుస్తోంది. ఈ ఏడాది చివర్లో వీరి వివాహం జరగనున్నట్లు సమాచారం. 2016లో తమిళ సినిమా 'ఒరు నాళ్ కోత్తు'తో నివేదా చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టారు. ప్రస్తుతం 'పార్టీ' అనే చిత్రంలో నటిస్తున్నారు.

'వేదవ్యాస్' ఆరంభం



ఎస్వీ కృష్ణారెడ్డి తెరకెక్కిస్తోన్న 43వ సినిమా 'వేదవ్యాస్' గురువారం ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమానికి ప్రముఖ నిర్మాత దిల్‌రాజు, దర్శకులు వీవీ వినాయక్, అనిల్ రావిపూడి, మురళీ మోహన్, అలీ, సాయికుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ చిత్రాన్ని కె.అచ్చిరెడ్డి సమర్పణలో సాయిప్రగతి ఫిల్మ్స్ బేనర్‌పై కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నిర్మిస్తున్నారు. ముహూర్తపు షాట్‌కు వీవీ వినాయక్ క్లాప్ కొట్టగా, అనిల్ రావిపూడి దర్శకత్వం వహించారు. నిర్మాత జెమినీ కిరణ్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ సందర్భంగా ఎస్వీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ 'తొలిసారిగా ఈ సినిమాలో కొరియన్ నటి జున్ హ్యాన్‌జీని హీరోయిన్‌గా పరిచయం చేస్తున్నాం' అని చెప్పారు. నిర్మాత కె.అచ్చిరెడ్డి మాట్లాడుతూ 'కృష్ణారెడ్డి నుంచి ప్రేక్షకులు ఆశించే విధంగానే 'వేదవ్యాస్' ఉంటుంది. హీరో పేరు త్వరలో వెల్లడిస్తాం' అని అన్నారు.

మానవాళిని రక్షించే సూపర్ యోధ




తేజ సజ్జా కథానాయకుడిగా కార్తిక్ ఘట్టమనేని తెరకెక్కిస్తోన్న పాన్ ఇండియా సినిమా 'మిరాయ్'. రితికా నాయక్ కథానాయిక. మంచు మనోజ్ కీలక పాత్రలో నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. సినిమా సెప్టెంబరు 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. నిస్వార్థంగా సాయం చేసే ఓ యువకుడి పరిచయంతో ట్రైలర్ ప్రారంభం అవుతుంది. ట్రైలర్‌లో యువకుడి నుంచి సూపర్ యోధ వరకు తేజ సజ్జా ట్రాన్స్‌ఫర్మేషన్‌ని అద్భుతంగా చూపించారు. ఈ సందర్భంగా తేజ సజ్జా మాట్లాడుతూ 'నేను తెలుగు ప్రేక్షకుల కోసమే నటిస్తున్నాను. నా సినిమా మిగతా భాషల వారికి నచ్చితే అది బోనస్' అని అన్నారు. మంచు మనోజ్ మాట్లాడుతూ "హనుమాన్ లాంటి హిట్ అందుకున్న తర్వాత వరుసగా సినిమాల్లో నటించి డబ్బులు సంపాదించాలని చాలా మంది అనుకుంటారు. అలా అనుకోవడంలో తప్పు లేదు. కానీ, తేజ 'మిరాయ్' కోసం మరో ప్రాజెక్టును అంగీకరించకుండా మూడేళ్లు వేచి చూశాడు. కార్తీక్ ఈ సినిమాని అద్భుతంగా తెరెక్కించారు. అశోకుడు రాసిన 9 గ్రంథాల గురించి ప్రపంచానికి చెప్పాలనే సంకల్పంతో ఈ చిత్రాన్ని రూపొందించారు' అని అన్నారు.



రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న 'పెద్ది' చిత్రం షూటింగ్ మైసూర్‌లో జరుగుతోంది. జానీ మాస్టర్ నేతృత్వంలో వెయ్యిమందికి పైగా డాన్సర్లతో పాటను చిత్రీకరిస్తున్నారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ సెట్‌లో దిగిన ఫొటోను అభిమానులతో పంచుకున్నారు.

ఆస్కార్ బరిలో 'పాపా బుకా'



కోలీవుడ్ దర్శకుడు పా.రంజిత్ సహ నిర్మాతగా వ్యవహరించిన 'పాపా బుకా' 98వ ఆస్కార్ పురస్కారాల పోటీకి అర్హత సాధించింది. పపువా న్యూ గినీ (పీఎన్‌జీ) దేశం నుంచి ఆస్కార్‌కు అర్హత పొందిన తొలి సినిమాగా ఈ చిత్రం రికార్డు నెలకొల్పింది. పపువా న్యూ గినీకి చెందిన నోయెలెన్ తౌలాతాతో కలసి పా.రంజిత్, అక్షయ్ కుమార్ పరిజా, ప్రకాశ్ బరే నిర్మించారు. బిజు మార్ దామోదరన్ తెరకెక్కించారు. రెండో ప్రపంచ యుద్ధంలో పీఎన్‌జీలో పోరాడిన భారతీయ సైనికులకు సంబంధించిన కథ ఇది. సినిమా సెప్టెంబరు 19న విడుదల కానుంది.

శక్తిమంతమైన మహిళ కథ



ఆమని ప్రధాన పాత్ర పోషించిన చిత్రం 'బ్రహ్మాండ'. రాంబాబు దర్శకత్వంలో దాసరి సురేశ్ నిర్మించారు. బన్నీ రాజు కీలకపాత్ర పోషించారు. ఈనెల 29న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఆమని మాట్లాడుతూ 'సామాజిక బాధ్యతతో కూడిన కథతో తెరకెక్కిన చిత్రమిది. మానవ సంబంధాలను చర్చిస్తూ సందేశాత్మకంగా సాగుతుంది. అట్టడుగు వర్గాల కోసం పోరాడే శక్తిమంతమైన మహిళ పాత్రను పోషించాను' అన్నారు.

కొత్త లోకం



కల్యాణి ప్రియదర్శన్ సూపర్ విమెన్ పాత్రలో నటించిన చిత్రం 'కొత్త లోక 1: చంద్ర'. నస్లెన్.కె.గఫూర్ కీలక పాత్రను పోషించారు. అరుణ్ డొమినిక్ దర్శకత్వంలో వేఫేరర్ ఫిల్మ్స్ పతాకంపై మలయాళ కథానాయకుడు దుల్కర్ సల్మాన్ నిర్మించారు. పాన్ ఇండియా స్థాయిలో ఈ శుక్రవారం చిత్రం విడుదలవుతోంది. తాజాగా, ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. భారతదేశంలోనే తొలి మహిళా సూపర్ హీరోయిన్ చిత్రం ఇదని మేకర్స్ తెలిపారు. సితార ఎంటర్టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు.

రక్తంతో రాసిన చరిత్ర



రిచర్డ్ రిషి, రక్షణ ఇందుసూదన్ ప్రధాన పాత్రల్లో మోజన్.జి తెరకెక్కిస్తున్న చిత్రం 'ద్రౌపది 2'. 2020లో విడుదలై విజయం సాధించిన 'ద్రౌపది'కి ఇది సీక్వెల్. చోళ చక్రవర్తి, జి.ఎం.ఫిల్మ్ కార్పొరేషన్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. తాజాగా, ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మోహన్.జి మాట్లాడుతూ 'రక్తంతో రాసిన చారిత్రక సంఘటనల ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఈ ఏడాది చివర్లో తెలుగు, తమిళ భాషల్లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని అన్నారు.

ఆకట్టుకునే కంటెంట్‌తో...



రాజ్ వేంకటాచ్చ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన చిత్రం 'ధర్మవరం'. ప్రసాద్ నిర్మించారు. తాజాగా ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను దర్శకుడు అనిల్ రావిపూడి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'సినిమా ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నా. కంటెంట్ బాగుంది' అని అన్నారు.

మెప్పించే మిస్టర్ రాము



క్రైమ్, అపరాధపరిశోధనాత్మక కథనంతో రూపొందిన చిత్రం 'మిస్టర్ రాము'. బొంత రాము హీరోగా నటిస్తూ నిర్మించారు. అజయ్ ఘోష్ విలన్ పాత్ర పోషించారు. అజయ్ కౌండిన్య దర్శకుడు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రబృందం ఇటీవలే ఆడియో విడుదల వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా బొంత రాము మాట్లాడుతూ 'కథ మీద నమ్మకంతో సినిమా నిర్మించాను. ప్రేక్షకులు ఆశించే అంశాలతో ఆసక్తికరంగా సాగుతుంది' అన్నారు. ఇప్పటివరకూ తెలుగులో రాని విభిన్న కథ, కథనాలతో సినిమా రూపొందుతోంది అని దర్శకుడు తెలిపారు.

గణేశా గప్ చుప్



రోహన్, రిదా జంటగా సూరి.ఎస్ తెరకెక్కిస్తున్న చిత్రం 'గప్ చుప్ గణేశా'. కేఎస్ హేమ్రాజ్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్, ట్రైలర్‌ను ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ దామోదరప్రసాద్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ చిత్రం టైటిల్ చాలా క్యాచీగా ఉంది. సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. ఒక మొహమాటస్తుడు పడే ఇబ్బందులను హాస్యభరితంగా చూపించడమే ఈ చిత్ర కథాంశం అని మేకర్స్ తెలిపారు.

డీఎస్సీ కాల్‌లెటర్లపై గందరగోళం!

- ఈ నెల 26 నుంచి కొనసాగుతున్న ప్రక్రియ
- విడుదల పూర్తిపై ప్రకటన చేయని పాఠశాల విద్యాశాఖ
- ఓవైపు కాల్‌లెటర్లు.. మరోవైపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్
- తమకూ వస్తాయేమోనని కొందరి ఎదురుచూపులు
- వెరిఫికేషన్ జాబితాలు లేకపోవడంతో అయోమయం

అమరావతి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నోటిఫికేషన్ నుంచి ఫలితాల విడుదల వరకూ సజావుగా సాగిన మెగా డీఎస్సీ ప్రక్రియ చివర్లో గందరగోళంగా మారింది. ఎవరికి కాల్ లెటర్లు వచ్చాయో, ఇంకా ఎవరికి వస్తాయో తెలియక అభ్యర్థులు అయోమయానికి గురవుతున్నారు. పాఠశాల విద్యాశాఖ అధికారులు కూడా దీనిపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం ఈ గందరగోళాన్ని ఇంకా పెంచుతోంది. ఇటీవల జారీచేసిన ప్రకటన ప్రకారం సర్టిఫికెట్ల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థులకు మంగళవారమే కాల్ లెటర్లు విడుదల కావాలి. కానీ ఆరోజు ప్రారంభమైన ప్రక్రియ గురువారం సాయంత్రం వరకూ కొనసాగింది. ఓవైపు గురువారం ఉదయం 9 గంటల నుంచే జిల్లాల్లో సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం కాగా.. మరోవైపు అదే సమయంలో కాల్‌లెటర్లు ఇంకా విడుదలవుతూ ఉండటం అభ్యర్థులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. మెరిట్ జాబితా ప్రకారం తమకు ఉద్యోగం వచ్చే అవకాశం ఉందని చాలా మంది అంచనా వేసుకున్నారు. మార్కుల్లో బోర్డర్‌లో ఉన్నవారు అవకాశం ఉండొచ్చని భావించారు. వీరంతా కాల్ లెటర్ల కోసం ఎదురుచూశారు. వీరిలో కాల్ లెటర్లు అందిన వారు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కాగా.. రాని వారు ఇంకా వస్తాయేమోనని ఎదురు చూస్తున్నారు. పాఠశాల విద్యా శాఖ ఎంత మందికి కాల్‌లెటర్లు అందాయనే దానిపై ప్రకటన చేయకపోవడమే ఈ గందరగోళానికి దారితీసింది. అందరికీ కాల్ లెటర్లు వెళ్లాయని.. తొలి విడతలో ఇక ఎవరికీ రావని స్పష్టత ఇస్తే ఎదురుచూపులు ఉండవు. కానీ ఆ వివరాలను అధికారులు ప్రకటించలేదు. కాల్‌లెటర్ల విడుదల ప్రక్రియ మంగళ, బుధవారాల్లోనే పూర్తయి ఉంటే.. రాని వారు ఇక తమకు రావనే నిర్ణయానికి వచ్చేవారు. కానీ గురువారం కూడా విడుదల కావడంతో తమకూ వస్తాయేమోనని అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. దీంతో సర్టిఫికెట్ల పరిశీలనకు ఎంపికైన వారి జాబితాలు ప్రకటించాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. పాఠశాల విద్యాశాఖ అటు జాబితాలు ప్రకటించకుండా, ఇటు సకాలంలో కాల్‌లెటర్లు ఇవ్వకుండా సాగదీసింది.

తీవ్ర ఒత్తిడిలో అభ్యర్థులు

కాల్ లెటర్లపై స్పష్టత లేకపోవడంతో కొందరు అభ్యర్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. గురువారం ఉదయం సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం కాగా.. ఎంత మంది హాజరయ్యారు? ఎంత మంది అర్హత సాధించారు? ఎంత మంది అనర్హులు? అనే వివరాలను కూడా పాఠశాల విద్యాశాఖ వెల్లడించలేదు. ఆ వివరాలు వెల్లడించినా అభ్యర్థులకు ఎవరు ఎంపికయ్యారనే దానిపై స్పష్టత వస్తుంది.

జాబితాను బహిర్గతం చేయాలి

అమరావతి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాల్సిన అభ్యర్థుల జాబితాలను బహిర్గతం చేయాలని ఏపీటీఎఫ్-1938 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి డిమాండ్ చేశారు. జాబితాలను బయటపెట్టకపోవడం వల్ల ఏ కేటగిరీలో ఎంత వరకు పిలిచారో, రోస్టర్, కటాఫ్ మార్కులు తెలియక అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారని, ఇది అనుమానాలకు దారితీస్తోందన్నారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించండి: టీఎన్‌యూఎస్

అమరావతి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టీఎన్‌యూఎస్) అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్ కోరారు. గురువారం విద్యాభవన్‌లో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌ను కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

పిల్లల అక్రమ రవాణా కేసుల విచారణను ఆర్నెల్లలో పూర్తి చేయాలి: హైకోర్టు

అమరావతి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పిల్లల అక్రమ రవాణాకు సంబంధించిన కేసుల విచారణను ఆరు నెలల వ్యవధిలో పూర్తి చేయాలని సంబంధిత ట్రయల్ కోర్టులను హైకోర్టు ఆదేశించింది. పింకీ వర్సెస్ స్టేట్ ఆఫ్ ఉత్తరప్రదేశ్ కేసులో సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా పిల్లల అక్రమ రవాణా కేసుల విచారణను న్యాయాధికారులు ఆర్నెల్లలో పూర్తి చేసేలా సూచనలు చేయాలని జిల్లాల ప్రధాన న్యాయమూర్తులకు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ పార్థసారథి సర్క్యులర్ జారీచేశారు.

ఎంఈవోల బదిలీలు చేపట్టాలి

అమరావతి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఎంఈవో-1లకు వెంటనే సాధారణ బదిలీలు చేపట్టాలని ఎంఈవో-1 సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం డిమాండ్ చేశారు. 2017 నుంచి అదే స్థానాల్లో కొనసాగుతూ ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

ఫారెస్ట్ ఉద్యోగాల హాల్‌టికెట్లు విడుదల

అమరావతి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నోటిఫికేషన్లకు సంబంధించిన స్క్రీనింగ్ పరీక్షల హాల్‌టికెట్లను విడుదల చేసినట్లు ఏపీపీఎస్సీ కార్యదర్శి పి.రాజాబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు పోలవరం రానున్న విదేశీ నిపుణులు

పోలవరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విదేశీ నిపుణుల బృందం శుక్రవారం పోలవరం ప్రాజెక్టు ప్రాంతానికి రానుంది. సెప్టెంబరు 1వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు అక్కడే మకాం వేస్తుంది. అమెరికాకు చెందిన జియాస్ ఫ్రాన్కో డి సిస్కో, డేవిడ్ బి.పాల్, కెనడాకు చెందిన రిచర్డ్ డొనెల్లీ ప్రాజెక్టు కీలక పనులను, నాణ్యతను పరిశీలించనున్నారు.

మృత్యువుతో పోరాడి.. ఏఎస్పీ మృతి

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని చౌటుప్పల్‌లో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి.. 33 రోజులుగా మృత్యువుతో పోరాడుతున్న ఏపీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఏఎస్పీ) కోక దుర్గా మల్లేశ్వర రాంప్రసాద్ (58) కన్నుమూశారు. జూలై 26న డీఎస్పీలు మేక చక్రధర్‌రావు, జెల్ల శాంతారావుతో కలిసి స్కార్పియోలో ఆయన అమరావతి నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా చౌటుప్పల్ వద్ద డివైడర్‌ను వాహనం ఢీకొంది. ఈ ఘటనలో చక్రధర్‌రావు, శాంతారావు అక్కడికక్కడే మృతి చెందారు. ఏఎస్పీ, డ్రైవర్ నర్సింగ్‌రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. అప్పటినుంచి అక్కడ చికిత్స పొందుతున్న ఏఎస్పీ బుధవారం (27న) మృతి చెందారు. డ్రైవర్ కోలుకున్నారు.

కేంద్ర శాసన శాఖ అదనపు కార్యదర్శిగా 'కొడాలి'

న్యూఢిల్లీ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన డాక్టర్ కొడాలి విజయ్‌కుమార్‌ను కేంద్ర శాసన శాఖ అదనపు కార్యదర్శిగా కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు అపాయింట్మెంట్ కమిటీ ఆఫ్ కేబినెట్ అధికారిక ప్రకటన విడుదల చేసింది.

పరిశ్రమల శాఖలో 9 మంది డీడీలకు పదోన్నతి

అమరావతి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పరిశ్రమలశాఖలో తొమ్మిది మంది డిప్యూటీ డైరెక్టర్లకు ప్రభుత్వం జాయింట్ డైరెక్టర్లుగా పదోన్నతి కల్పించింది. వీరంతా పదిహేను రోజుల్లో కేటాయించిన స్థానాల్లో చేరాలని, లేకుంటే పదోన్నతులు కోల్పోతారని ఉత్తర్వుల్లో పేర్కొంది.

పశుసంవర్ధకశాఖలో పదోన్నతులకు గ్రీన్‌సిగ్నల్

అమరావతి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధకశాఖలో పదోన్నతులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 2024-25 ప్యానల్ సంవత్సరానికి 17 మంది డిప్యూటీ డైరెక్టర్లు, ముగ్గురు అసిస్టెంట్ డైరెక్టర్ల పదోన్నతులకు ఆమోదం తెలిపింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నేడు దక్షిణాది రాష్ట్రాల డీజీపీల సమావేశం

తిరుపతి (నేరవిభాగం), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాల డీజీపీలు, విజయవాడ సీపీ, ఐదు రాష్ట్రాల అదనపు డీజీలు, ఐజీలు, ఎస్పీలతో ప్రాంతీయ సమన్వయ కమిటీ సమావేశం శుక్రవారం తిరుపతిలో జరగనుంది.

రాజమార్గంలో అతి పే..ద్ద సొరంగం

- బెజవాడ-బెంగళూరు 544-జీ హైవేలో రెండు వరుసలుగా నిర్మాణం
- నెల్లూరు-కడప సరిహద్దులో శరవేగంగా పనులు
- 3.7 కిలోమీటర్ల మేర నిర్మాణం
- 100 కి.మీ తగ్గనున్న దూరం

ఉదయగిరి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విజయవాడ-బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే 544-జీ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా నెల్లూరు, కడప సరిహద్దు ప్రాంతమైన సీతారామపురం (నెల్లూరు జిల్లా) సమీపంలో అతిపెద్ద సొరంగం పనులు శరవేగంగా సాగుతున్నాయి. 518 కిమీ మేర ఈ ఆరు వరుసల జాతీయ రహదారిని నిర్మిస్తుండగా.. అందులో భాగంగా సీతారామపురం వద్ద ఉన్న కొండను తొలచి రూ.857.75 కోట్లతో రెండు వరుసలుగా ఈ సొరంగ మార్గాన్ని నిర్మిస్తున్నారు. రాష్ట్రంలో జాతీయ రహదారి నిర్మాణాల్లో నిర్మించిన టన్నెళ్లలో ఇదే అతిపెద్దదని అధికారులు చెబుతున్నారు. దీని పొడవు 3.7 కిలోమీటర్లు. రెండు వరుసల్లో ఒక్కోదాని వెడల్పు 16.7 మీటర్లు.. ఎత్తు 9.8 మీటర్లు. ఈ పనులను మ్యాక్స్ ఇన్‌ఫ్రా కంపెనీ రూ.857.75 కోట్లతో దక్కించుకుంది. 2027 ఫిబ్రవరిలోపు పూర్తి చేయనున్నారు. ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంతో విజయవాడ-బెంగళూరు వాహనదారులకు 100 కిలోమీటర్ల దూరం తగ్గడంతోపాటు 3 గంటల సమయం ఆదా అవుతుంది. ఈ రహదారిపై 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించవచ్చు. అనంతపురం జిల్లా కొడికొండ వద్ద ప్రారంభమయ్యే ఈ రహదారి.. కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాల మీదుగా బాపట్ల జిల్లాలోని ముప్పవరం వద్ద ఎన్‌హెచ్-16లో కలుస్తుంది.



నెల్లూరు జిల్లా సీతారామపురం వద్ద జరుగుతున్న సొరంగ మార్గం పనులు

ఉల్లి రైతు కన్నీరు

ధర భారీగా పతనం

- క్వింటా కనిష్ఠంగా రూ.500
- అధిక వర్షాలకు తగ్గిన దిగుబడి
- పెరిగిన పెట్టుబడి.. దక్కని గిట్టుబాటు

(కర్నూలు-ఆంధ్రజ్యోతి)



ఉల్లి బస్తాలపై దిగులుగా కూర్చున్న రైతు

అధిక వర్షాలకు ఉల్లి కుళ్లిపోయింది. దిగుబడులు భారీగా తగ్గాయి. అరకొర పంటను మార్కెట్‌కు తీసుకెళ్తే నాణ్యత లేదంటూ వ్యాపారులు ధరలు తగ్గిస్తున్నారు. ధర భారీగా పతనం కావడంతో రవాణా కూలీలు కూడా గిట్టుబాటు కాక పొలంలోనే పంటను వదిలేసే పరిస్థితి వచ్చింది. పెట్టుబడి కూడా చేతికి రాక ఉల్లి రైతులు అప్పులపాలై తీవ్ర ఆందోళనకు లోనవుతున్నారు. కర్నూలు మార్కెట్‌లో గురువారం క్వింటా కనిష్ఠంగా రూ.520 పలికితే గరిష్ఠంగా రూ.1,149కు మించడంలేదు. అత్యధికంగా రూ.550-750 మధ్య అమ్ముడుబోతోంది.

సాగు విస్తీర్ణం రెట్టింపు..

రాష్ట్రంలోనే ఉల్లిసాగులో కర్నూలు జిల్లా అగ్రస్థానంలో ఉంది. రోజురోజుకు ధర పతనం కావడంతో ఉల్లి రైతు కంట కన్నీళ్లు పెట్టిస్తోంది. జిల్లాలో గతేడాది 5,911 హెక్టార్లలో ఉల్లి సాగుచేయగా, ఈ ఏడాది 10,797 హెక్టార్లలో సాగు చేశారు. ఇప్పుడిప్పుడే పంట దిగుబడులు చేతికొస్తున్నాయి. అయితే 20 రోజులుగా జిల్లాలో కురుస్తున్న అధిక వర్షాల వల్ల భూమిలో తేమశాతం పెరిగి ఉల్లిగడ్డ కుళ్లిపోతోంది. ఫలితంగా దిగుబడులు భారీగా తగ్గిపోతున్నాయి. అలాగే, కోత అనంతరం గ్రేడింగ్ కోసం రైతులు భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది. సాధారణంగా ఎకరాకు 250-300 బస్తాలకుపైగా దిగుబడి వచ్చేది. అయితే, అధిక వర్షాల వల్ల 80-120 బస్తాలకు మించి రావడంలేదు. కొన్ని పొలాల్లో అయితే 50 బస్తాలు కూడా రావడంలేదు. ప్రధానంగా గోనెగండ్ల, దేవనకొండ, ఎమ్మిగనూరు, బెళగల్, మంత్రాలయం, కోసిగి, ఆదోని, ఆస్పరి, ఆలూరు మండలాల్లో ఉల్లిని అధికంగా సాగుచేస్తున్నారు. ఎకరాకు సగటున రూ.75వేల నుంచి రూ.లక్షకుపైగా పెట్టుబడి పెడుతున్నారు. దిగుబడి తగ్గడం.. ధరలు పతనం కావడంతో అన్నదాత నష్టాల ఊబిలో కురుకుపోయి అప్పులపాలవుతున్నారు.

ధర పతనం..

గతేడాది ఇదే సమయంలో క్వింటా రూ.1,550 నుంచి రూ.2,500కుపైగా విక్రయించారు. ఈ ఏడాది కూడా అదే స్థాయిలో ధరలు ఉంటాయని ఆశించడంతో సాగుబడి రెట్టింపు అయింది. అయితే, వ్యాపారుల మాయాజాలం కారణంగా ఒక్కసారిగా ధర పతనమైంది. కర్నూలు ఉల్లి మార్కెట్‌కు 8,428 బస్తాల(3793 క్వింటాళ్లు) దిగుబడులను రైతులు అమ్మకానికి తెచ్చారు. క్వింటా ధర కనిష్ఠంగా రూ.520, గరిష్ఠంగా రూ.1,149, సగటున రూ.739 పలికినట్లు మార్కెట్ అధికారుల లెక్కలు వెల్లడిస్తున్నాయి. అయితే, కనిష్ఠంగా రూ.350 కూడా పలకలేదని, పెట్టుబడి మాట దేవుడెరుగు పంట కోత కూలీలు, రవాణా ఖర్చులు కూడా చేతికి రావడంలేదనిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు పొలాల్లోనే పంటను వదిలేయగా.. మరికొందరు కల్లాల్లోనే వచ్చినకాడికి అమ్మేస్తున్నారు. ప్రభుత్వం తమకు అండగా నిలిచి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నిలువునా ముంచిన వాన



రెండెకరాల్లో ఉల్లి సాగుచేశాను. రూ.1.70 లక్షలు పెట్టుబడి పెట్టాను. దిగుబడి చేతికొచ్చే సమయంలో వర్షం నిలువునా ముంచేసింది. 80 క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. కల్లంలోనే క్వింటా రూ.500కు వ్యాపారులు కొన్నారు. రూ.40వేలు మాత్రమే చేతికొచ్చింది. పెట్టుబడి, చేసిన కష్టం మట్టిపాలయ్యాయి. ప్రభుత్వం ఆదుకోవాలి.

- రంగన్న, రైతు, ఈరంపల్లి, గోనెగండ్ల మండలం, కర్నూలు జిల్లా

క్వింటా రూ.450కు కూడా అడగట్లేదు



రెండెకరాల్లో ఉల్లిసాగు చేశాను. రూ.1.50 లక్షలు పెట్టుబడి పెట్టాను. అధిక వర్షాలకు ఆశలు నీటిపాలయ్యాయి. ఎకరాకు 300 బస్తాళ్లు వస్తాయని ఆశిస్తే 80 బస్తాలు కూడా రాలేదు. క్వింటా రూ.450కు కూడా అడగడంలేదు. వచ్చినకాడికి సరిపెట్టుకుని పొలాల్లోనే అమ్మేశాను.

-మిన్నల్లా, రైతు, కప్పట్రాళ్ల, దేవనకొండ మండలం



ఉల్లి రైతుల సమస్యలపై అధికారులతో చర్చిస్తున్న సీఎం

ఉల్లి రైతు నష్టపోకూడదు

- తక్షణమే క్వింటా రూ.1,200కు కొనుగోలు
- మార్కెటింగ్‌శాఖకు సీఎం ఆదేశాలు

అమరావతి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతుల్ని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. క్వింటాకు రూ.1,200 చొప్పున చెల్లించి, రైతుల నుంచి తక్షణమే కొనుగోలు చేయాలని, వాటిని రైతుబజార్లలో విక్రయించాలని మార్కెటింగ్‌శాఖను ఆదేశించారు. రాష్ట్రంలో ఉల్లి రైతుల ఇబ్బందులపై గురువారం అమరావతి సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఉల్లి పంట దెబ్బతినడం, మహారాష్ట్రలో ఉల్లి ఎక్కువగా ఉన్నందున ధరల విషయంలో మన రాష్ట్ర రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారులు చెప్పారు. 10 రోజుల్లో 5 వేల టన్నుల ఉల్లి పంట వచ్చే అవకాశం ఉందని వివరించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ 'ఉల్లి రైతులకు నష్టం వాటిల్లకూడదు. క్వింటా రూ.1,200 చొప్పున తక్షణం కొనుగోలు చేయండి. మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ నుంచి నష్టాన్ని భరించండి. కమ్యూనిటీ హాళ్లను అద్దెకు తీసుకుని ఉల్లిని ఆరబెట్టండి. అనంతరం రైతుబజార్లకు తరలించి విక్రయించాలి. ఉల్లి రేటు వచ్చేంత వరకూ కమ్యూనిటీ హాళ్లలో నిల్వ చేసుకునేలా రైతులకు అవకాశం కల్పించండి. అన్ని పంటల ధరల స్థిరీకరణ కోసం వేర్ హౌసింగ్ సదుపాయం కల్పించాలి' అని నిర్దేశించారు. వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖల స్పెషల్ సీఎస్ రాజశేఖర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతుబజార్ల సంఖ్య 200కు పెంచాలి

రాష్ట్రంలోని రైతుబజార్ల సంఖ్య పెంచేందుకు చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు మార్కెటింగ్‌శాఖను ఆదేశించారు. 'ప్రస్తుతం ఉన్న 150 రైతుబజార్ల సంఖ్యను 200కు పెంచేలా ప్రణాళిక సిద్ధం చేయాలి. రైతులకు, వినియోగదారులకు ఉపయోగపడేలా మార్కెట్ యార్డు స్థలాలను వినియోగించాలి. ధరల నియంత్రణకు ఇది ఉపయోగపడుతుంది' అని సీఎం పేర్కొన్నారు.



జనసేన కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

మరో 15 ఏళ్లు కూటమే!

- 3 పార్టీలూ కలిసే ఉంటాయి: పవన్
- విశాఖలో 'సేనతో సేనాని' సమావేశాలు

◆ కూటమి పార్టీలు విడిపోతాయన్న ఆలోచనలకు జనసైనికులు తావివ్వొద్దు. కూటమి అవసరం రాష్ట్రానికి మాత్రమే కాదు.. దేశానికి కూడా ఉంది. జనసేనకు తుఫాన్‌కు ఉన్నంత శక్తి ఉంది. దీనిని దేశవ్యాప్తంగా విశ్వసిస్తున్నారు.

◆ పదవిని బాధ్యతగా తీసుకోవాలి. ఈ రాష్ట్రం కూటమి వల్లనే అభివృద్ధి సాధించిందనే మాట కోసం, అందులో మనమూ ఉన్నామనే తృప్తి కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలి.

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

విశాఖపట్నం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో పదిహేనేళ్ల కూటమి ప్రభుత్వమే ఉంటుందని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మరోసారి తేల్చిచెప్పారు. మూడు పార్టీలూ కలిసే ఉంటాయని, అందులో అనుమానమేమీ పెట్టుకోవద్దని స్పష్టంచేశారు. 'సేనతో..సేనాని' పేరిట జనసేన విశాఖపట్నంలో నిర్వహిస్తున్న సమావేశాలు గురువారం ప్రారంభమయ్యాయి. బీచ్‌రోడ్డులోని బే వ్యూ హోటల్‌లో ఉదయం మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో పవన్ లెజిస్లేచర్ సమావేశం నిర్వహించారు. మధ్యాహ్నం మిగిలిన నాయకులతోనూ భేటీ అయ్యారు. ఆయా సందర్భాల్లో ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ నిలకడగా అభివృద్ధి సాధించాలంటే స్థిరమైన ప్రభుత్వం అవసరమని, ప్రస్తుత రాష్ట్ర పరిస్థితుల రీత్యా టీడీపీ, బీజేపీతో కలిసే జనసేన ముందుకు నడుస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని నడిపించే కూటమి విషయంలో ఎవరు, ఎక్కడ, ఏమి మాట్లాడినా జాగ్రత్తగా వ్యవహరించాలని.. అంతా ఏకాభిప్రాయంతో ఉండాలని చెప్పారు. సోషల్ మీడియాలో ప్రభుత్వంపై, మహిళలపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని అసెంబ్లీలో ఎండగట్టాలని, దానిపై చట్టం తీసుకొచ్చేలా యత్నించాలని సూచించారు. 'దీనిపై నిపుణులతో ప్రత్యేక రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటుచేసి, సూచనలు తీసుకుందాం. జనసేన సిద్ధాంతాల ఆధారంగా నిర్మితమైంది. ఆ భావజాలానికి ప్రజలు కనెక్ట్ అయ్యారు. పార్టీని ముందుకు నడిపించడంతో యువతదే కీలక పాత్ర. ఆ యువశక్తికి నాయకులు అండగా నిలవాలి' అని సూచించారు. నియోజకవర్గాల్లో సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారం చూపిస్తానని ఎమ్మెల్యేలకు హామీ ఇచ్చారు.

త్వరలో కార్యకర్తల ఇంట్లో జనసేనాని బస: సుందరపు

పవన్ నిర్వహించిన లెజిస్లేచర్ సమావేశంలో చర్చించిన విషయాలను ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, ఎమ్మెల్సీ హరిప్రసాద్ వివరించారు. సోషల్ మీడియాలో మహిళలపై పెడుతున్న పోస్టుల వల్ల ఎదురవుతున్న సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించడం, యువతకు ఉపాధి అవకాశాలు, మహిళలకు భద్రతపై మంత్రి నాదెండ్ల మనోహర్ మూడు తీర్మానాలు ప్రతిపాదించగా.. ఆమోదించినట్లు తెలిపారు. భవిష్యత్‌లోతమ అధినేత జిల్లాల పర్యటనలు చేసినప్పుడు కార్యకర్తల ఇంట్లో బస చేయాలన్న ప్రతిపాదన వచ్చిందని, దానికి ఆయన అంగీకరించారని వెల్లడించారు. శనివారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జరిగే సభకు 14,500 మంది ముఖ్య కార్యకర్తలను ఆహ్వానించాం. మరో పది వేల మంది కూడా హాజరవుతారు. వారినుద్దేశించి పవన్ మాట్లాడతారు' అని చెప్పారు. 30న నిర్వహించే సమావేశ ప్రాంగణానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టినట్టు మంత్రి నాదెండ్ల వెల్లడించారు. ప్రీతి అనుమానాస్పద మృతిపై మొదట స్పందించి, అక్కడకు వెళ్లి 2లక్షల మందితో సమావేశం నిర్వహించింది తమ అధినేతేనని విజయకుమార్ చెప్పారు. ఆమె కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు.

విశాఖపై ప్రత్యేక అభిమానం

విశాఖపట్నం అంటే తనకు ప్రత్యేక అభిమానమని, గతంలో ఇక్కడ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించాలని వస్తే నోవాటెల్ హోటల్ నుంచి బయటకు రాకుండా కట్టడి చేశారని పవన్ కల్యాణ్ గుర్తు చేసుకున్నారు. 2019 ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత తొలుత విశాఖే వచ్చానని, అప్పుడు కూడా ఇక్కడి ప్రజలు అండగా నిలిచారని, అందుకే పార్టీ సమావేశాలు ఇక్కడ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇక్కడి నుంచి ఏమి చేసినా పార్టీకి, రాష్ట్రానికి మేలు జరుగుతుందనే విశ్వాసం ఉందన్నారు.

పార్టీ లైన్ దాటుతున్నారు!

- కొందరు జనసేన ఎమ్మెల్యేలపై పవన్ గుర్రు

పార్టీకి నష్టం తెచ్చే చర్యలకు పాల్పడవద్దని జనసేన ఎమ్మెల్యేలకు పవన్ కల్యాణ్ హితవు పలికారు. వారి పనితీరుపై ఆయన ప్రత్యేకంగా సర్వే చేయించి నివేదికలు తెప్పించుకున్నారు. గురువారంనాటి సమావేశంలో వాటిని వారికి అందించారు. కొందరు ఎమ్మెల్యేలు పార్టీ విధానాలను దాటి వ్యవహరిస్తున్నారని ఈ సందర్భంగా ఆక్షేపించారు. పనితీరు మార్చుకుని, ప్రజలకు మేలు చేసేలా వ్యవహరించాలని సూచించారు.

చేయూతనిచ్చిన వారినే తిడితే ఎలా?

సుగాలి ప్రీతి కేసులో సాక్ష్యాలు తారుమారుచేశారని పవన్ తెలిపారు. పండ్లున్న చెట్టుకే రాళ్ల దెబ్బలన్నట్లుగా చేయూతనిచ్చినవారినే తిడితే ఎలాగని ప్రశ్నించారు. ఆ తల్లి ఆవేదన చూసి లక్షల మందితో కర్నూలు నడిబొడ్డుకు వెళ్లి బలంగా గళం వినిపించానని గుర్తుచేశారు. తమ పోరాటాల ఫలితంగానే నాటి ప్రభుత్వం సీబీఐకి అప్పగించాలని నిర్ణయించిందన్నారు. చట్టప్రకారం సర్కారు నుంచి వారికి పరిహారాలు అందాయన్నారు. ఎకరా రూ.2కోట్ల విలువ చేసే ఐదెకరాలు, 5సెంట్ల ఇంటి స్థలం, ప్రీతి తండ్రికి జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం.. ఇవన్నీ తమ ఒత్తిడి కారణంగానే అందాయని తెలిపారు. సీబీఐ దర్యాప్తు నిర్ణయాన్ని జగన్ ప్రభుత్వం లాకర్‌లో పెట్టిందన్నారు. ఉపముఖ్యమంత్రి అయ్యాక డీజీపీ, హోం మంత్రితో మాట్లాడి త్వరగా న్యాయంచేయాలని కోరినట్లు చెప్పారు. సీఐడీ విచారణలో అనుమానితుల డీఎన్‌ఏలు సరిపోలడం లేదని తెలిసిందని.. సాక్ష్యాలు కూడా తారుమారు చేశారని తెలిపారు.

పోలీసు కస్టడీకి కి'లేడీ'!

- కోవూరు స్టేషన్‌లో తొలిరోజు విచారణ
- నేడు, రేపూ ప్రశ్నించనున్న పోలీసులు



కోవూరు పోలీసు స్టేషన్ నుంచి నెల్లూరు జైలుకు అరుణను తీసుకెళ్తున్న పోలీసులు

కోవూరు/ఒంగోలు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అనేక అరాచకాలకు పాల్పడిందనే ఆరోపణలు ఎదుర్కొంటున్న కి'లేడీ' నిడిగుంట అరుణను గురువారం పోలీసులో కస్టడీకి తీసుకుని విచారించారు. నెల్లూరు జిల్లా కోవూరు మండల పరిధిలోని పడుగుపాడులోని ఓ అపార్టుమెంట్‌లో ఫ్లాటును ఆక్రమించిన కేసులో ఈ నెల 19న ఆమె అరెస్టయి రిమాండ్‌పై ఒంగోలు జైల్లో ఉన్న సంగతి తెలిసిందే. ఆమెను కస్టడీలో విచారించేందుకు కోవూరు పోలీసులు అభ్యర్థించడంతో కోర్టు మూడ్రోజుల కస్టడీకి అనుమతించింది. అరుణను గురువారం ఒంగోలు జైలు నుంచి కోవూరు పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చారు. ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రాథమిక సమాచారం తీసుకున్న అనంతరం ఆమెను నెల్లూరులోని జిల్లా జైలుకు తరలించారు. శుక్ర, శనివారాల్లోనూ పోలీసు ఉన్నతాధికారులు ఆమెను ప్రశ్నించనున్నారు. పలు నేరాలతో సంబంధమున్న అరుణ విచారణలో ఏం చెబుతుందోనని ఇటు పోలీసులు, అటు రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

రౌడీషీటర్లను ఉపేక్షించకండి.. మీ వెనుక నేనున్నా!

- నెల్లూరు పోలీసులకు డీజీపీ భరోసా.. అరుణ, శ్రీకాంత్‌పై ఆరా

నెల్లూరు క్రైం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): కి'లేడీ' అరుణ, రౌడీషీటర్ శ్రీకాంత్ వ్యవహారాలపై డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా ఆరా తీశారు. గురువారం ఆయన తిరుపతికి వెళ్తూ మార్గమధ్యంలో నెల్లూరు వచ్చారు. పోలీసు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే రౌడీలు, ట్రబుల్ మాంగర్స్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదని, వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. అవసరమైతే వారి ఆస్తులను కూడా జప్తు చేయాలన్నారు. 'రౌడీషీటర్ల కోసం ఏ రాజకీయ నాయకుడూ ఫోన్ చేయడు.. మీ వెనుక నేనున్నాను... రౌడీషీటర్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలి..' అని స్పష్టం చేశారు.

యూరియా వచ్చింది

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా గురువారం గంగవరం పోర్టుకు యూరియా చేరుకుంది. నౌక నుంచి యూరియాను శుక్రవారం దిగుమతి చేసుకోనున్నారు. వారం ముందుగానే యూరియాను సరఫరా చేసినందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు కేంద్రానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 'యూరియాను గంగవరం పోర్టులో దిగుమతి చేస్తున్నాం. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లోని వ్యవసాయ సాగు పరిస్థితి, వాటి దశలను బట్టి యూరియా అవసరాలను శాస్త్రీయంగా బేరీజు చేసుకుంటూ ప్రణాళిక బద్ధంగా అత్యంత అవసరమున్న ప్రాంతాలకు సరఫరా చేయాలి' అని వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావును మంత్రి ఆదేశించారు. అలాగే, సెప్టెంబరు మొదటి వారంలో కాకినాడ పోర్టుకు మరో 25వేల టన్నుల యూరియా పంపేందుకు కేంద్రం హామీ ఇచ్చిందని అచ్చెన్నాయుడు తెలిపారు. తక్షణం పంటలకు అవసరమైన మేరకు మాత్రమే యూరియాను కొనుగోలు చేయాలని రైతులకు మంత్రి సూచించారు. రబీ సీజన్ కోసం ముందే కొనుగోలు చేయాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రానికి వచ్చిన యూరియాను ఇతర రాష్ట్రాలకు దారి మళ్లించకుండా, అధిక ధరలకు విక్రయించకుండా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిఘా కొనసాగుతోందని తెలిపారు. అన్ని జిల్లాల్లో కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో వ్యవసాయ, పోలీసు, విజిలెన్స్, రెవెన్యూ, పరిశ్రమల అధికారులతో సంయుక్త టీమ్‌లను ఏర్పాటు చేసి తనిఖీలు చేయిస్తున్నామ వివరించారు.

ఆయిల్‌పామ్ కంపెనీలకు మరో 7 మండలాల కేటాయింపు

అమరావతి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్-ఆయిల్‌పామ్ నోటిఫికేషన్ మేరకు.. రాష్ట్రంలోని మూడు జిల్లాల్లోని మరో ఏడు మండలాలను ఆయిల్‌పామ్ కంపెనీలకు తిరిగి కేటాయించడానికి ఉద్యాన శాఖ డైరెక్టర్‌కు ప్రభుత్వం అనుమతించింది. బాపట్ల జిల్లా బల్లికురవ, అద్దంకి, సంత మాగులూరు, నెల్లూరు జిల్లా గుడ్లూరు, లింగసముద్రం, తిరుపతి జిల్లా నారాయణపురం, నాగులాపురం మండలాలను వివిధ ఆయిల్‌పామ్ కంపెనీలకు కేటాయిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

మద్యం కేసులో దిలీప్‌కు షరతులతో బెయిల్

» కసిరెడ్డి, సజ్జల బెయిల్ పిటిషన్లు కొట్టివేత

విజయవాడ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో మొదటిసారి ఒకరికి బెయిల్ మంజూరైంది. ఈ కేసులో ఏ-30గా ఉన్న పైలా దిలీప్‌కు విజయవాడ ఏసీబీ కోర్టు షరతులతో బెయిల్ మంజూరు చేస్తూ గురువారం తీర్పు వెలువరించింది. బెయిల్ కోసం కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి (ఏ-1), సజ్జల శ్రీధర్‌రెడ్డి (ఏ-6) దాఖలుచేసిన పిటిషన్లను మాత్రం కొట్టివేసింది. దిలీప్‌కు పలు షరతులు విధించింది. లక్ష రూపాయల చొప్పున రెండు పూచీకతులు సమర్పించాలని.. అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లకూడదని, పాస్‌పోర్టును కోర్టుకు అప్పగించాలని స్పష్టం చేసింది. దిలీప్ ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కసిరెడ్డికి పీఏ. తనకు కొత్తగా వివాహమైందని, బెయిల్ ఇవ్వాలని పలుమార్లు పిటిషన్లు దాఖలు చేశాడు. వాటిని న్యాయస్థానం కొట్టివేసింది. కొద్దిరోజుల క్రితం కసిరెడ్డి, శ్రీధర్‌రెడ్డితో పాటు మరోసారి బెయిల్ పిటిషన్ వేశాడు. వాటిపై వాదప్రతివాదనలు పూర్తికావడంతో న్యాయాధికారి తన నిర్ణయం వెల్లడించారు.

నారాయణస్వామి ఫోన్ సీజ్

విజయవాడ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఎక్సైజ్ శాఖ మంత్రిగా పనిచేసిన ఉపముఖ్యమంత్రి కె.నారాయణస్వామి సెల్‌ఫోన్‌ను సిట్ అధికారులు సీజ్ చేశారు. దీనిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపడానికి అనుమతి ఇవ్వాలని విజయవాడ ఏసీబీ కోర్టులో గురువారం పిటిషన్ దాఖలు చేశారు.

సుగాలి ప్రీతి కేసును సీబీఐకి అప్పగించాలి

» సుగాలి పార్వతి



విజయవాడ(గాంధీనగర్), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): సుగాలి ప్రీతి కేసును సీబీఐకి అప్పగించి నిందితులను కఠినంగా శిక్షించాలని ఆమె తల్లి సుగాలి పార్వతి కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వికలాంగురాలినైన తాను ఎనిమిదేళ్లుగా పోరాడుతున్నా న్యాయం జరగడం లేదని కన్నీటిపర్యంతమయ్యారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 'అధికారంలోకి వచ్చిన వెంటనే నిందితులకు శిక్షపడేలా చేసి న్యాయం చేస్తానని పవన్ కల్యాణ్ గతంలో హామీ ఇచ్చారు. ఇప్పటికైనా ఆయన స్పందించాలి. లేదంటే జనసేన పార్టీ కార్యాలయం ఎదుట అమరణ నిరాహారదీక్ష' అని పార్వతి చెప్పారు.



ఫ్యామిలీ బెనిఫిట్ మానిటరింగ్ వ్యవస్థపై అధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

అర్హత ఉండీ పెన్షన్ అందలేదంటే కలెక్టర్లదే బాధ్యత: సీఎస్

రాష్ట్రంలో అర్హత గల ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా పింఛన్ అందించాలని.. ఎక్కడైనా అర్హత ఉండి పింఛన్ రాలేదని ఫిర్యాదు వస్తే అందుకు సంబంధింత జిల్లా కలెక్టర్లే బాధ్యత వహించాలని సీఎస్ విజయానంద్ స్పష్టం చేశారు. పింఛన్లు, మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, భూగర్భ జలాలు, పీఎం కుసుమ్ పథకం, జిల్లా జువెనైల్ జస్టిస్ కమిటీలు తదితర అంశాలపై గురువారం ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్లు, జిల్లా, మండల ప్రత్యేక అధికారులు ప్రతినెలా పింఛన్ల పంపిణీలో తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు. 'కలెక్టర్లు అర్హత గలవారందరికీ తప్పనిసరిగా పెన్షన్ అందేలా చూడాలి. పెన్షన్ల తనిఖీకి సంబంధించి 1.35లక్షల మందికి నోటీసులు జారీచేసి నెలరోజుల్లోగా ఎంపీడీవోలకు అప్పీల్ చేసుకోవాలని తెలియజేశాం. వారిలో 88,319 మంది అప్పీలు చేసుకున్నారు. వాటిని నెల రోజుల్లోపు పరిష్కరించాలి' అని నిర్దేశించారు.

ఒక్క అర్హుడికీ అన్యాయం జరగదు

» దివ్యాంగుల పింఛన్లపై చంద్రబాబు భరోసా

» టీడీపీ ముఖ్య నేతలతో టెలికాన్ఫరెన్స్

అమరావతి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): అర్హుడైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని.. పింఛను అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు. వైసీపీ హయాంలో చాలా మంది అనర్హులకు పింఛన్లు ఇచ్చారని.. దీనివల్ల అర్హులకు నష్టం కలుగుతోందని అన్నారు. ఏ ఒక్క అర్హుడికీ నష్టం జరుగకూడదంటే.. అనర్హులను తప్పించాల్సి ఉందని చెప్పారు. అనర్హులను గుర్తించే ప్రక్రియలో ఎక్కడైనా లోపాలున్నా.. అధికార యంత్రాంగం పొరపాట్లు చేసినా.. దానిని గుర్తించి సరిదిద్దే బాధ్యతను టీడీపీ యంత్రాంగం తీసుకోవాలని పిలుపిచ్చారు. తాత్కాలిక సర్టిఫికెట్లు ఉన్న వారికి నోటీసులతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ పింఛను ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. వినాయకచవితిని పురస్కరించుకుని బుధవారం ఆయన మంత్రులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ ముఖ్యనేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. దివ్యాంగుల పింఛన్లపై వైసీపీ ప్రచారంపై తీవ్రంగా స్పందించారు. దీనిపై ఆ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అబద్ధాల పునాదుల మీద రాజకీయం చేస్తోందన్నారు. 'వైసీపీ తప్పులు చేస్తూ.. వాటిని ఎదుటివారిపైకి నెడుతోంది. దీన్ని మనం సమర్థంగా తిప్పికొట్టాలి. దేశంలో మరే ఇతర రాష్ట్రంలోనైనా.. గతంలో ఏ ప్రభుత్వాలైనా.. ఈ స్థాయిలో పింఛన్లు ఇచ్చాయా? సీఎంగా ప్రభుత్వ విధానాలను అమలు చేస్తాను. పార్టీ అధినేతగా పార్టీ యంత్రాంగం ఇచ్చే ఫీడ్‌బ్యాక్ తీసుకుంటాను. లోపాలుంటే సరిదిద్దుతాను' అని వివరించారు. సీఎం ఇంకా చెప్పారంటే..

సంక్షేమాన్ని పరిచయం చేసిందే టీడీపీ

తెలుగు ప్రజలకు సంక్షేమాన్ని పరిచయం చేసింది టీడీపీయే. ప్రతి ఇంటికీ మనం చేసే మంచి పని చేరాలి. ప్రభుత్వం ఇబ్బందులున్నా సంక్షేమం అందిస్తుందనే విషయం ప్రజలు అర్థం చేసుకునేలా వివరించాలి. మరే రాష్ట్రంలోనూ ఇవ్వనంత పెద్దఎత్తున పింఛన్లు ఇస్తున్నాం. దివ్యాంగులకు గత ప్రభుత్వం రూపాయి కూడా పెంచలేదు. వైసీపీకి పింఛన్లపై నోరెత్తి మాట్లాడే అర్హత లేదు. దివ్యాంగుల పింఛన్లను రూ.500 నుంచి రూ.6 వేలు చేసింది టీడీపీ ప్రభుత్వాలే. డయాలసిస్ రోగులకు పింఛన్‌ను రూ.10 వేలకు పెంచిందీ టీడీపీయే. మంచానికే పరిమితమైన వారికి పింఛన్లు ఇవ్వడం మొదలుపెట్టిన టీడీపీ ప్రభుత్వమే.. ఆ మొత్తాన్ని రూ.15 వేలకు పెంచింది. 63 లక్షల మంది లబ్ధిదారులకు ప్రతినెలా 1నే పింఛన్లు ఇస్తున్నాం. ఏడాదికి రూ.35 వేల కోట్లు పింఛన్లకే ఖర్చు చేస్తున్నాం.

> సామాజిక భద్రత, వృద్ధాప్య పింఛన్లను రూ.300 నుంచి రూ.4 వేలకు మనమే పెంచాం. వృద్ధులకు ఇస్తున్న రూ.4 వేలలో రూ.2,875ని టీడీపీ ప్రభుత్వాలే పెంచాయి. ఎన్నికల ముందు టీడీపీ యంత్రాంగం సూపర్ సిక్స్ హామీలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించింది. చెప్పిన విధంగా ఆ హామీలను అమలు చేసి మాట నిలబెట్టుకున్నాం. పింఛన్ల విషయంలో కూడా పార్టీ కేడర్ ఇదే విధంగా పనిచేయాలి. - సీఎం చంద్రబాబు

6న సూపర్ సిక్స్ సభ

ప్రజల కోసం పనిచేయడం ఎంత ముఖ్యమో.. చేసిన పని చెప్పుకోవడమూ అంతే ముఖ్యం. 'సుపరిపాలనలో తొలి అడుగు' విజయవంతమైంది. ఇందులో భాగంగా 1.12 కోట్ల ఇళ్లకు పార్టీ యంత్రాంగం వెళ్లి.. చేస్తున్న మంచిని వివరించింది. 6న అనంతపురంలో 'సూపర్ సిక్స్- సూపర్‌హిట్' సభ నిర్వహిస్తున్నాం. మేనిఫెస్టోలో చెప్పిన దాని కంటే ఎక్కువ చేశాం. మెగా డీఎస్సీ నిర్వహించాం. 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తున్నాం. ఎంత మంది పిల్లలున్నా.. తల్లికి వందనం ఇచ్చాం. అన్న క్యాంటీన్, అన్నదాత సుఖీభవ అమలు చేశాం. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం. చేనేతలకు ఉచిత విద్యుత్, మత్స్యకారుల సేవలో భాగంగా వేట విరామ సమయంలో రూ.20 వేలు.. ఇలా ఎన్నో మంచి పనులు చేస్తున్నప్పుడు ప్రజల్లోకి వెళ్లి వివరించాలి.

ప్రజల కోసమే రాజకీయం చేయాలి

కార్యకర్తలు, నేతలు గట్టిగా పనిచేసి పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించారు. ఏ ఎన్నిక వచ్చినా కూటమే గెలవాలి. మనం ఏ చిన్న తప్పు చేసినా భూతద్దంలో చూపించి దెబ్బతీయాలని ప్రత్యర్థులు చూస్తున్నారు. వారి కుట్రల పట్ల జాగ్రత్తగా ఉండాలి. కొందరు తాత్కాలిక రాజకీయాలు చేయాలనుకుంటారు. దీని వల్ల ఇబ్బందులు వస్తాయి. శాశ్వత రాజకీయాలు చేయాలి. ప్రజల కోసమే రాజకీయాలు చేయాలి. టీడీపీ జిల్లా కమిటీల ఎంపిక ప్రక్రియ దాదాపు పూర్తయింది. త్వరలోనే ప్రకటిస్తాం. రాష్ట్ర కమిటీ ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నాం.

1,129 కోట్లతో విలేజ్ హెల్త్ క్లినిక్స్

» 4,472 గ్రామాల్లో నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్

» ఏడాదిలోగా పూర్తి చేయాలి: సత్యకుమార్

రాష్ట్రంలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్న కూటమి ప్రభుత్వం 4,472 గ్రామాల్లో రూ.1,129 కోట్లు వ్యయంతో విలేజ్ హెల్త్ క్లినిక్స్‌కు సొంత భవనాలు నిర్మించాలని నిర్ణయించిందని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో 10,032 విలేజ్ హెల్త్ క్లినిక్స్ ఉండగా.. వాటిలో 1,086 ప్రభుత్వ భవనాల్లో ఉన్నాయని, మిగిలినవి అద్దె భవనాల్లో నడుస్తున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో సమీక్షించి 4,472 గ్రామాల్లో హెల్త్ క్లినిక్‌లకు సొంత భవనాలు నిర్మించడానికి ఆమోదం తెలిపామన్నారు. గత ప్రభుత్వం నిర్మాణ పనులు చేపట్టి.. నిధుల విడుదలలో ఆలస్యం కారణంగా అసంపూర్తిగా నిలిచిపోయిన 2,309 భవనాలతోపాటు, నూతనంగా మరో 2,163 కలిపి మొత్తం 4,472 భవనాలను ప్రభుత్వం నిర్మించనుందని తెలిపారు. ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ (పీఎం ఏబీహెచ్ఐఎం), 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ నిర్మాణాలు చేపట్టనున్నామని పేర్కొన్నారు. ఈ భవనాలను ఏడాదిలోపు పూర్తి చేయాలని, ఈ మేరకు నిర్మాణ పనులు చేపట్టనున్న పంచాయతీరాజ్ శాఖతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని మంత్రి సూచించారు.

ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ కార్డు

» పథకాల వివరాలన్నీ అందులో నిక్షిప్తం: సీఎం

అమరావతి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్ని సంక్షేమ పథకాలను సంతృప్త స్థాయిలో అందించాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించాలన్నారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో ఫ్యామిలీ బెనిఫిట్ మానిటరింగ్ వ్యవస్థపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రతి కుటుంబానికి ఒక ఫ్యామిలీ స్కోర్ కేటాయించాలన్నారు. ఆయా కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలపై పారదర్శకంగా ఉండాలన్నారు. దీని కోసం ఫ్యామిలీ కార్డు అందించాలన్నారు. ప్రభుత్వ పథకాలను ఆ కార్డులో పొందుపరచడంతో పాటు.. పూర్తి వివరాలు అందులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కుటుంబంలో ఎంత మంది ఉంటే అంతమందికీ ఆ కార్డును ఇవ్వాలని ఆదేశించారు. ఆధార్‌కార్డ్ తరహాలో వారి అవసరాలకు ఉపయోగించుకుంటారని అన్నారు. ఆ కుటుంబాలను ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయాలన్నారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబ సంక్షేమం, కనీస అవసరాలు తెలుసుకునేలా క్షేత్రస్థాయిలో సమాచార వ్యవస్థను పటిష్ఠపరచాలని అధికారులను ఆదేశించారు. బీసీ, ఎస్సీల్లో ఉన్న కొన్ని కులాలు చాలా వెనుకబడి ఉన్నాయని, ఆర్థికంగా, సామాజికంగా వారికి లబ్ధి అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓసీల్లో కూడా ఇంకా ఆర్థికంగా వెనుకబడిన వారున్నారని తెలిపారు. అలాంటి వారందరినీ గుర్తించి వెనుకబాటుతనాన్ని రూపుమాపాలంటే కచ్చితమైన సమాచారం అవసరమన్నారు.

కుటుంబాలు విడిపోవడం బాధాకరం

ప్రజలే ఆస్తి అని, వారి ద్వారానే రాష్ట్రాభివృద్ధి, దేశాభివృద్ధి జరుగుతుందని సీఎం చెప్పారు. జనాభా పెరిగితే సంపద పెరిగే రోజులొచ్చాయని, ఇది కొనసాగాలంటే చక్కటి కుటుంబ వ్యవస్థ ఉండాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల కోసం కుటుంబాలు విడిపోయే పరిస్థితి కొన్ని చోట్ల కనిపిస్తోందని, అలా జరగడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పరిస్థితిని తప్పించాలన్నారు. దీని కోసం పాపులేషన్ పాలసీని త్వరలో తెస్తామని వెల్లడించారు. అధికారులు ఆ దిశగా కసరత్తు చేయాలని ఆదేశించారు. ఉమ్మడి కుటుంబాలు ఉంటే పథకాలు రావనే ఆందోళన లేకుండా ఉండేందుకు అవసరమైతే ప్రభుత్వ సంక్షేమ పథకాలను రీడిజైన్ చేస్తామన్నారు. సమీక్షలో సీఎస్ విజయానంద్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మరో 53,922 కోట్ల పెట్టుబడులు

83,437 మందికి ఉద్యోగాలు

» 27 సంస్థల ప్రతిపాదనలకు ఎస్ఐపీబీ ఆమోదం

అమరావతి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. కొత్తగా రూ.53,922 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. ఈ పెట్టుబడులతో 83,437 మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి. దీనికోసం 27 సంస్థల ప్రతిపాదనలకు రాష్ట్రస్థాయి పారిశ్రామిక ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) తాజాగా ఆమోదం తెలిపింది. వెలగపూడి సచివాలయంలో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్రస్థాయి ఎస్ఐపీబీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రూ. 2,181 కోట్లతో 2,783 మందికి ఉద్యోగాలు కల్పించేలా ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ సంస్థలు చేసిన ప్రతిపాదనలకు ఎస్ఐపీబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అదేవిధంగా ఇదివరకే ఆమోదం పొందిన సంస్థలు చేసిన సవరణలతో సహా.. క్లీన్‌ఎనర్జీ రంగంలో రూ. 42,171 కోట్ల పెట్టుబడులకు అనుమతి లభించింది. మొత్తం 19,835 మందికి ఈ సంప్రదాయేతర ఇంధన వనరుల సంస్థల ద్వారా ఉద్యోగాలు రానున్నాయి. పర్యాటక రంగంలో రూ. 550 కోట్లతో 775 మందికి ఉద్యోగాలను కల్పించేలా చేసిన ప్రతిపాదనలకూ ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. రూ. 314 కోట్లతో 11,000 మందికి ఉద్యోగాలను ఇచ్చే ఎంఎస్ఎంఈ ప్రైవేటు ఇండస్ట్రియల్ పార్కులకు చేసిన ప్రతిపాదనలను గ్రీన్‌సిగ్నల్ లభించింది. అదేవిధంగా రూ. 2,713 కోట్లతో రెండు ప్రైవేట్ మెగా ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు సమ్మతి తెలిపింది. ఏపీఐఐసీ ప్రతిపాదించిన రూ. 1,597 కోట్ల ప్రతిపాదనలతో 1,179 మందికి ఉద్యోగాలను ఇచ్చే పరిశ్రమల స్థాపనకూ ఆమోదం లభించింది. ఇక రాష్ట్రంలో రూ. 3,183 కోట్లతో పరిశ్రమలు స్థాపించి 2,694 మందికి ఉద్యోగాలు ఇచ్చినందుకుగాను ఆయా సంస్థలకు ప్రోత్సాహకాలను ఇచ్చేందుకు ఎస్ఐపీబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

ఐఫోన్ చాసిస్.. మేడిన్ కుప్పం

» రూ. 586 కోట్లతో హిందాల్కో యూనిట్

ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గం కుప్పం ముఖచిత్రం మారుతోంది. ఇకపై ఐఫోన్ల తయారీలోనూ కుప్పం ముద్రపడనుంది. ఇక్కడ యాపిల్ సంస్థకు చెందిన ఐఫోన్ చాసిస్ తయారీకి వినియోగించే ముడిపదార్థం ప్లాంట్ రాబోతోంది. ఇందుకోసం రూ. 586 కోట్లతో సమీకృత అల్యూమినియం యూనిట్‌ను ప్రఖ్యాత కంపెనీ హిందాల్కో స్థాపించబోతోంది. ఈ సంస్థ ప్రతిపాదనలకు గురువారం ఎస్ఐపీబీ ఆమోద ముద్ర వేసింది. ఈయూనిట్‌తో 613 మందికి ఉపాధి లభించనుంది. హిందాల్కో ప్లాంట్‌లో 2027 నాటికి ఉత్పత్తి ప్రారంభమవుతుంది. ఈ ప్రాజెక్టుకు ఏపీ ఎలక్ట్రానిక్స్ కాంపొనెంట్ మాన్యుఫాక్చరింగ్ పాలసీ 2025-30 కింద ఆమోదం తెలిపారు. ఇప్పటికే బెంగళూరులో ఐఫోన్ తయారీ యూనిట్ ప్రారంభమైంది. ఇక్కడికి సమీపంలోని కుప్పంలో ఈ ప్లాంట్ రాబోతుండడం ప్రాముఖ్యం సంతరించుకుంది.

ఎస్ఐపీబీలో ఆమోదం లభించిన కంపెనీల్లో కొన్ని..

- మదర్ డెయిరీ ఫ్రూట్ అండ్ వెజిటబుల్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు రాయితీలు. ఈ సంస్థ రూ. 427 కోట్ల పెట్టుబడితో 160 మందికి ఉద్యోగాలు కల్పిస్తుంది.
- ఏసీఈ ఇంటర్నేషనల్ రూ.786 కోట్లతో 1,000 మందికి ఉద్యోగాలు కల్పించే పరిశ్రమకూ ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిర్ణయించారు.
- అపోలో టైర్స్, ఎర్లీబర్డ్‌కూ ప్రోత్సాహకాలు.
- అనకాపల్లిలో రూ.485 కోట్లతో 500 మందికి ఉద్యోగాలు కల్పించే బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్‌కు ఆమోదం.
- నెల్లూరులో రూ.578 కోట్లతో 265 మందికి ఉపాధిని ఇచ్చే అదానీ విల్‌మార్‌కు ఓకే.
- చిత్తూరులో రూ. 85 కోట్లతో 120 మందికి ఉపాధినిచ్చే టైరోమెర్ లిమిటెడ్‌కు గ్రీన్‌సిగ్నల్.
- కడపలో రూ. 369 కోట్లతో 600 మందికి ఉద్యోగాలు కల్పించే రామ్‌షై బయో ప్రైవేటు లిమిటెడ్ ప్రతిపాదనకు ఆమోదం లభించింది.
- కోనసీమ జిల్లాలో రూ.161 కోట్లతో 189 మందికి ఉద్యోగాలను ఇచ్చే శ్రీసర్వారాయ షుగర్స్ లిమిటెడ్‌కూ అనుమతి.
- టెలీకమ్యూనికేషన్స్ సంస్థ హెచ్ఎఫ్‌సీఎల్‌కు 1,000 ఎకరాలు కేటాయించేందుకు అనుమతి.
- రూ. 32 కోట్లతో 3,500 ఉద్యోగాలను కల్పించే వరాహ ఆక్వా ప్రతిపాదనలకు ఆమోదం.
- జే కుమార్ ఇన్‌ఫ్రా ప్రతిపాదించిన రూ. 237 కోట్ల పెట్టుబడి ద్వారా 5,000 మందికి ఉద్యోగాల కల్పించే ప్రతిపాదనకు సమ్మతి.
- కుప్పంలో రూ. 45 కోట్లతో 2500 మందికి ఉద్యోగాలు కల్పించే అలీప్ ప్రతిపాదనకు ఓకే.
- ఇఫ్కో కిసాన్ సెజ్ చేసిన రూ. 370 కోట్ల పెట్టుబడి, 25,000 మందికి ఉద్యోగాల కల్పన ప్రతిపాదనలకు సమ్మతించారు.
- ధీరూభాయ్ అంబానీ గ్రీన్‌టెక్ పార్క్ లిమిటెడ్ రూ. 1,843 కోట్లతో 19,000 మందికి ఉద్యోగాలను కల్పించే ప్రతిపాదనలకు ఆమోద ముద్ర.
- భోగాపురం విమానాశ్రయం సమీపంలో తాజ్ వివాంతా ఎన్‌కామ్ వైజాగ్ హోటల్ పేరిట ఫోర్‌స్టార్ హోటల్ స్థాపనకు ఆమోదం.
- అమరావతిలో మంజీరా హాస్పిటాలిటీ ప్రైవేటు లిమిటెడ్ హాలిడే ఇన్ బ్రాండ్‌తో హోటల్ నిర్మాణానికి ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టులో రూ. 276 కోట్ల పెట్టుబడి పెట్టనున్నారు. 225 మందికి ఉద్యోగాలు దక్కుతాయి.
- ముంతాజ్ హోటల్స్ (ఒబెరాయ్ గ్రూప్) విల్లాలు, రిసార్టులు నిర్మించేందుకు అనుమతి.
- సెకీ 600 మెగావాట్లు/1200 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్స్‌ను రూ. 1500 కోట్లతో ఏర్పాటు చేయడానికి, 960 మందికి ఉద్యోగాలు ఇచ్చే ప్రతిపాదనలకు అలాగే, సెకీ రూ. 800 కోట్లతో 200 మందికి ఉద్యోగాలు కల్పించే 50 మెగావాట్ల పవన, 60 మెగావాట్లు /72 మెగావాట్ల సౌర విద్యుత్, 10 మెగావాట్లు/20 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ ఏర్పాటుకు ఆమోదం లభించింది.
- సెరెంటికా రెన్యూవబుల్స్ ఇండియా రూ. 2,000 కోట్లతో 250 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టుకు, అలాగే రూ. 2,400 కోట్లతో 380 మందికి ఉద్యోగాలు ఇచ్చే 300 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టులకు ఆమోదం.
- హెక్సా ఎనర్జీ బీహెచ్ ఫైవ్ లిమిటెడ్ రూ. 1,200 కోట్లతో 400 మందికి ఉద్యోగాలు ఇచ్చే సోలార్ హైబ్రీడ్ పవర్ ప్రాజెక్టుకు ఓకే.
- రిఫెక్స్ సోలార్ ఎస్పీవీ ప్రైవేటు లిమిటెడ్ రూ. 480 కోట్లతో 345 మందికి ఉపాధిని ఇచ్చే 100 మెగావాట్ల సోలార్ పవర్‌కు ఆమోదం.
- బ్రైట్ ఫ్యూచర్ రూ. 3,286 కోట్లతో అనంతపురంలో 440 మందికి ఉద్యోగాలు ఇచ్చే 349 మెగావాట్ల విండ్‌పవర్ ప్రాజెక్టుకు ఆమోదం.
- నవయుగ ఇంజనీరింగ్ రూ. 15,455 కోట్లతో 8,400 మందికి ఉపాధి కల్పించే గుజ్జిలి పీఎస్పీని 1500 మెగావాట్ల నుంచి 2400 మెగావాట్ల సామర్థ్యానికి పెంచేందుకు ఆమోదం.
- చింతా గ్రీన్ ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ రూ. 15,050 కోట్లతో 8,400 మందికి ఉపాధిని ఇచ్చే కొప్పోలు పీఎస్పీని 360 నుంచి 2,400 మెగావాట్ల సామర్థ్యానికి పెంచేందుకు అనుమతి.
- సైర్మా ఎస్‌జీఎస్ టెక్నాలజీ రూ.1,500 కోట్లతో 2,170 మందికి ఉద్యోగాలు కల్పించే ప్రతిపాదనలకు ఆమోదం.

మహిళలకు భరోసా మన విశాఖ

» దేశంలోనే సురక్షిత నగరంగా విశాఖపట్నం

» మరో ఆరు నగరాలతో కలిసి మొదటి ర్యాంకు

» నారి-2025 సర్వేలో వెల్లడి

విశాఖపట్నం/మహారాణిపేట, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): దేశంలో మహిళల జీవనానికి అత్యంత సురక్షిత నగరంగా విశాఖ నిలిచింది. మహిళల భద్రత విషయంలో దేశంలోనే సురక్షిత నగరాలుగా కోహిమా, విశాఖపట్నం, భువనేశ్వర్, ఐజ్వాల్, గాంగ్‌టాక్, ఈటానగర్, ముంబై సంయుక్తంగా మొదటిస్థానంలో నిలిచాయి. దేశంలో మహిళల భద్రత, సురక్షిత జీవన పరిస్థితులపై నేషనల్ యాన్యువల్ రిపోర్ట్ అండ్ ఇండెక్స్ (నారి)-2025 పేరుతో 31 నగరాల్లో 12,770 మంది మహిళలను సర్వే చేశారు. వారు వెల్లడించిన వివరాలు, అభిప్రాయాలను బట్టి దేశంలో మహిళల భద్రతకు సంబంధించి సురక్షిత నగరాల జాబితాను కమిటీ చైర్‌పర్సన్ విజయ్ రహాట్కర్ గురువారం ఢిల్లీలో విడుదల చేశారు. మహిళల భద్రత స్కోరు జాతీయ స్థాయిలో 65 శాతం ఉండగా విశాఖపట్నం, కోహిమా, ముంబై, భువనేశ్వర్ వంటి నగరాల్లో మెరుగైన స్త్రీ-పురుష సమానత్వం, మహిళా అనుకూల మౌలిక సదుపాయాలు, పకడ్బందీ పోలీసింగ్, పౌర భాగస్వామ్యం కలిగివున్నట్టు సర్వేలో తేలింది. జాబితాలో తొలిస్థానంలో నిలిచిన ఏడు సిటీల్లో విశాఖ మాత్రమే దక్షిణ భారతం నుంచి ఏకైక నగరం కావడం విశేషం.

మహిళల భద్రతకు చర్యలు: విశాఖ సీపీ

మహిళలకు సురక్షిత నగరంగా విశాఖ నిలిచిన సందర్భంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రతబాగ్చి గురువారం సాయంత్రం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. మహిళ భద్రతకు నగరంలో అమలుచేస్తున్న కార్యక్రమాలను వివరించారు. తాను సీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నగరవాసులతోపాటు మహిళలు, విద్యార్థినులు, సీనియర్ సిటిజన్‌లు ఎవరైనా పోలీస్ సహాయం కావాలంటే నేరుగా తనను సంప్రతించేందుకు వీలుగా పర్సనల్ నంబర్‌ను అందుబాటులోకి ఉంచానన్నారు. ఎంతోమంది మహిళలు ఆత్మహత్యకు సిద్ధపడి తనకు ఫోన్‌చేస్తే వారిని సకాలంలో రక్షించగలిగామన్నారు. నగరంలో మహిళల భద్రత కోసం టూ వీలర్స్, ఫోర్ వీలర్ పెట్రోలింగ్ ఏర్పాటుచేశామన్నారు. నగరానికి వచ్చే టూరిస్టుల భద్రత కోసం ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నాని చెప్పారు. తాము తీసుకుంటున్న చర్యలతోపాటు నగరవాసుల సహకారంతోనే విశాఖ నగరానికి జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు దక్కిందన్నారు.

'డేటా సిటీ' విశాఖ!

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి చట్టాల సవరణపై చర్చలు జరుగుతున్నాయని, గూగుల్ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటు అవుతుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ నిర్ధారించారు. తాజాగా గూగుల్ విశాఖలో రూ.51 వేల కోట్లు పెట్టుబడి పెడుతుందనే వార్త ప్రచారంలోకి వచ్చింది. ఒక గిగావాట్ సామర్థ్యం కలిగిన డేటా సెంటర్ వస్తుందని... ఇది దక్షిణ ఆసియాలోనే అతి పెద్ద డేటా సెంటర్ అవుతుందని తెలుస్తోంది.

అదానీ డేటా సెంటర్...: అదానీ డేటా సెంటర్ ఏర్పాటు దిశగా 2019-2024లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే అడుగులు పడ్డాయి. అప్పుడూ, ఇప్పుడూ ఐటీ మంత్రిగా ఉన్న నారా లోకేశ్ అదానీ గ్రూపుతో ఒప్పందం చేసుకొని రూ.70 వేల కోట్లతో డేటాసెంటర్‌కు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ ఒప్పందాన్ని రద్దు చేసి కేవలం రూ.14,634 కోట్ల పెట్టుబడులనే అనుమతించింది. భూకేటాయింపును 130 ఎకరాలకు పరిమితం చేసింది. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు డేటా సెంటర్ ఏర్పాటు ముందుకు కదల్లేదు. ఇప్పుడు మళ్లీ దీనిపై కదలిక వచ్చింది. ఈ సంస్థ 200 మెగావాట్లతో ఒక డేటా సెంటర్‌ను, 100 మెగావాట్లతో మరో సెంటర్‌ను ఏర్పాటుచేస్తామని ప్రకటించింది. దీని ద్వారా 1,240 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. దీని కోసం ప్రత్యేకంగా ఎస్పీవీ ఏర్పాటు చేశారు.

రూ.16,466 కోట్లతో సిఫీ టెక్నాలజీస్: నెల రోజుల క్రితం ఐటీ శాఖ మంత్రి లోకేశ్ సిఫీ టెక్నాలజీస్‌కు చెందిన ఇన్ఫినిట్ స్పేసెస్ అనుబంధ సంస్థతో చర్చలు జరిపి విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుకు ఒప్పించారు. ఈ సంస్థ రూ.16,466 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. మొదటి దశలో రూ.1,466 కోట్లు వెచ్చిస్తారు. దీని ద్వారా 600 మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయి.

హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో ఏర్పాటు చేసిన 69 అడుగుల వినాయక విగ్రహం వద్ద పూజలు చేస్తున్న తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



విజయవాడ సితారా సెంటర్‌లో డూండీ గణేష్ సేవా సమితి ఏర్పాటు చేసిన 72 అడుగుల వినాయక విగ్రహం వద్ద పూజలు చేస్తున్న సీఎం చంద్రబాబు



దొంగ దండాలు పెడితే వినాయకుడు

క్షమించడు

- గత ఐదేళ్లూ వినాయక చవితి వేడుకలకు ఆంక్షలు
- మేమొచ్చాక ఆనందంగా పండుగ: చంద్రబాబు

విజయవాడ (విద్యాధరపురం), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): దొంగ దండాలు పెట్టినంత మాత్రాన వినాయకుడు క్షమించడని, వాళ్ల సంగతి చూస్తాడని సీఎం చంద్రబాబు అన్నారు. డూండీ గణేశ్ సేవా సమితి ఆధ్వర్యంలో విజయవాడలో ఏర్పాటు చేసిన 72 అడుగుల మహాగణపతి మట్టి విగ్రహాన్ని సీఎం బుధవారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చవితి ఉత్సవాలు చేసుకోవాలంటే అన్నీ విఘ్నాలేనని, పండుగ చేసుకోవాలన్నా, మైక్ పెట్టాలన్నా సవాలక్ష ఆంక్షలు పెట్టేవారని ఆరోపించారు. విజయవాడలో డూండీ సేవా సమితి ఆధ్వర్యంలో ఐదేళ్ల పాటు చవితి ఉత్సవాలు జరగలేదని గుర్తుచేశారు. 72 అడుగుల మట్టి గణపతిని ఏర్పాటు చేయడంతో పాటు అక్కడే నిమజ్జన ఏర్పాట్లు చేసిన డూండీ సేవా సమితి సభ్యులను చంద్రబాబు అభినందించారు. కార్యక్రమంలో ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.



వినాయకుడి చెంతనే.. ఎలుక

వినాయక చవితి పండుగ రోజున వినాయకుడి వాహనమైన ఎలుక.. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం రామచంద్రాపురంలోని గెడా సుబ్రహ్మణ్యం ఇంట్లో సందడి చేసింది. ఇంట్లోని పూజ గదిలో పసుపు ముద్దతో చేసిన వినాయకుడి ప్రతిమపై ఎక్కుతూ దిగుతూ విన్యాసాలు చేసింది. ఇంట్లో వాళ్లు పెట్టిన కుడుములు, యాపిల్ కొద్దిగా తిని, గిన్నెలో పెట్టిన నీరు తాగింది. సుమారు మూడు గంటలపాటు గదిలో నుంచి కదలకుండా ఉన్న ఆ ఎలుకకు ఆ ప్రాంత మహిళలు హారతులు ఇచ్చి పూజలు చేశారు. కొద్దిగా చప్పుడు విని పిస్తేనే పారిపోయే ఎలుక.. అంతసేపు కదలకుండా ఉండటం ఆశ్చర్యానికి గురి చేసింది.

\- జంగారెడ్డిగూడెం, ఆంధ్రజ్యోతి



జగన్‌కు టెంకాయతో తంటా!

- అప్పుడు నిలబడి... ఇప్పుడు కూర్చొని..
- కొబ్బరికాయ కొట్టలేక అవస్థలు

అమరావతి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌కు మరోసారి 'కొబ్బరికాయ' పరీక్ష ఎదురైంది. ఆయన సీఎంగా ఉండగా... ఉగాది పర్వదినంరోజున తాడేపల్లి ప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన వేంకటేశ్వరస్వామి విగ్రహం ముందు పురోహితుడు రాయిపట్టుకుని నిలబడగా... జగన్ కూడా నిలబడే కొబ్బరికాయ కొట్టారు. దీని కోసం ఆయన నానా కష్టాలు పడ్డారు. ఇక... బుధవారం వినాయకచవితి రోజు తాడేపల్లి ప్యాలెస్‌ను ఆనుకుని ఉన్న వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణపతి ప్రతిమ వద్ద జగన్ పూజలు చేశారు. పార్టీ నేతలు వెలంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, దేవినేని అవినాశ్ పక్కన కూర్చొని.. ఆయన కొబ్బరి కాయను కొట్టేందుకు ప్రయత్నించారు. అది పూర్తిగా పగల్లేదు. దీంతో పక్కనే ఉన్న వెలంపల్లి కొబ్బరికాయను జగన్ చేతి నుంచి తీసుకుని.. పగలగొట్టే ప్రక్రియ పూర్తి చేశారు. ఇక... విజయవాడ రాణిగారితోటలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపంలో పూజలు చేయాలని జగన్ భావించారు. కానీ... వర్షం కురుస్తుండటంతో అక్కడికి వెళ్లకుండా ఆగిపోయారు.

భారతితో కలిసి చెన్నైకి జగన్

చెన్నై, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్ గురువారం చెన్నై వచ్చారు. వ్యక్తిగత పనులపై బెంగళూరు నుంచి ప్రత్యేక విమానంలో సతీమణి భారతితో కలసి వచ్చిన జగన్‌కు విమానాశ్రయం వద్ద వైఎస్ఆర్ సేవాదళం కార్యకర్తలు స్వాగతం పలికారు. అనంతరం 'ఇండియా సిమెంట్స్' చైర్మన్ శ్రీనివాసన్ నివాసానికి వెళ్లారు. అక్కడినుంచి ఇంజంబాక్కంలో తన సమీప బంధువు వైఎస్ అనిల్‌రెడ్డి నివాసానికి వెళ్లిన జగన్.. సాయంత్రం సునీల్‌రెడ్డి పెద్ద కుమారుడు సాహల్‌కు, మురుగప్పా గ్రూపు చైర్మన్ మనవరాలికి జరిగిన నిశ్చితార్థ కార్యక్రమానికి హాజరయ్యారు. శుక్రవారం బెంగళూరు వెళ్లనున్నారు.

ప్రమాదంలో అరకు కాఫీ

- గిరిజన ప్రాంతంలో తొలిసారిగా బయటపడ్డ కాఫీ బెర్రీ బోరర్ తెగులు
- గుర్తించిన కేంద్ర కాఫీ బోర్డు శాస్త్రవేత్తలు
- యుద్ధప్రాతిపదికన నివారణ చర్యలు

చింతపల్లి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): అరకు కాఫీకి కొత్త సమస్య వచ్చింది. గిరిజన ప్రాంతంలో తొలిసారి కాఫీ బెర్రీ బోరర్ తెగులు బయటపడింది. ప్రపంచవ్యాప్తంగా కాఫీ పంటను తీవ్ర స్థాయిలో నాశనం చేసే తెగులు కాఫీ బెర్రీ బోరర్ (హైపోథెనెమస్). కాఫీ బెర్రీ బోరర్ అనే కీటకం వల్ల ఈ తెగులు వ్యాప్తి చెందుతుంది. 2000లో ఈ తెగులును హవాయిలో గుర్తించారు. ఈ కీటకం కాఫీ కాయ/పండు దశలో రంధ్రం చేసుకుని లోపలకు ప్రవేశిస్తుంది. కాఫీ పండు/కాయలో ఉన్న గింజను పూర్తిగా తొలిచివేసి సొరంగం మాదిరిగా చేసుకుని గుడ్లు పెడుతుంది. ఒక్కో కీటకం 50కి పైగా కాఫీ కాయ/పండు లోపల ఏర్పాటు చేసుకున్న సొరంగంలో గుడ్లు పెడుతుంది. 35 రోజులకు ఒక గింజ



నుంచి 30-40 కీటకాలు బయటకు వస్తాయి. బయటకు వచ్చిన కీటకాలు ఇతర కాఫీ కాయల్లోకి ప్రవేశిస్తాయి. ఈ పద్ధతిలో కాఫీ కాయలు/పండ్లను కీటకాలు పూర్తిగా నాశనం చేస్తాయి. ఈ తెగులు అత్యంత ప్రమాదకరం. ఇది కాఫీ తోటల్లో వేగంగా వ్యాప్తి చెందుతుంది. పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధి అరకులోయ మండలం చినలబుడు పంచాయతీ పకనకుడి గ్రామంలో ప్రప్రథమంగా కాఫీ బెర్రీ బోరర్ తెగులును వారం క్రితం కేంద్ర కాఫీ బోర్డు అధికారులు గుర్తించారు. పకనకుడి గ్రామంలోని సిరగం సువర్ణకు చెందిన ఎకరా కాఫీ తోటలో గింజలకు కాఫీ బెర్రీ బోరర్ తెగులు కనిపించింది. పకనకుడి గ్రామంతో పాటు పరిసర మాలిసింగరం, మాలివలస, తుర్రయిగూడ, మంజగూడ లోనూ కొన్ని మొక్కల్లో ఈ తెగులు కనిపించినట్టు కేంద్ర కాఫీ బోర్డు అధికారులు చెబుతున్నారు. కాఫీ బోర్డు శాస్త్రవేత్తలు, యుద్ధప్రాతిపదికన నివారణ చర్యలు ప్రారంభించారు. ఏజెన్సీ పదకొండు మండలాల్లో కాఫీ బెర్రీ బోరర్ తెగులు గుర్తించేందుకు ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నారు. ఈ తెగులుపై గిరిజన రైతులు అప్రమత్తం కావాలని కేంద్ర కాఫీ బోర్డు అధికారులు సూచిస్తున్నారు.

కృష్ణా, గోదావరికి మళ్లీ భారీ వరద

- ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు 4.25 లక్షల క్యూసెక్కులు
- పోలవరం నుంచి దిగువకు 6.98 లక్షల క్యూసెక్కులు
- 18 గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- నేడు కోస్తా, రాయలసీమలో వర్షాలు
- నిమజ్జనంలో హెచ్చరికలు పాటించాలి: విపత్తుల సంస్థ

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

తీవ్ర అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు కృష్ణా, గోదావరి నదుల్లో వరద ఉధృతి మళ్లీ పెరిగింది. కృష్ణానదిలో శ్రీశైలం డ్యాం వద్ద ఇన్‌ఫ్లో 2.38 లక్షలు, ఔట్‌ఫ్లో 3.21 లక్షల క్యూసెక్కులు ఉంది. నాగార్జునసాగర్ నుంచి పులిచింతల ప్రాజెక్టుకు 3,67,940 క్యూసెక్కుల నీరు వస్తోంది. పులిచింతల నుంచి 3,74,212 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజ్‌కు ఎగువ నుంచి 4,25,165 క్యూసెక్కుల నీరు వస్తుండటంతో బ్యారేజీ 69 గేట్లను ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్టే దిగువకు విడుదల చేస్తున్నారు. గోదావరిలోనూ నీటిమట్టం అనూహ్యంగా పెరిగింది. భారీ వర్షాలకు గోదావరి ఉప నదులు ఉధృతంగా ప్రవహిస్తూ గోదావరిలో కలుస్తున్నాయి. పోలవరం ప్రాజెక్టులోకి వస్తున్న 6,98,782 క్యూసెక్కులను అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద నీటిమట్టం 38.6 అడుగులకు చేరుకుంది. వేలేరుపాడు వద్ద గోదావరి వరద ఉధృతి కారణంగా ఎద్దువాగు వంతెన మునిగిపోయింది. వేలేరుపాడు-రుద్రమకోట మధ్య కాజ్‌వేపై వరద నీరు చేరడంతో 18 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఏలూరు జిల్లాలో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్లు ముంపునకు గురయ్యాయి. కాగా, కృష్ణా, గోదావరి నదులకు వరద ఉధృతంగా వస్తోందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. గణపతి విగ్రహాల నిమజ్జన సమయంలో నదులు, కాలువల వద్ద హెచ్చరిక బోర్డులను అనుసరించాలని పేర్కొంది.



ఏలూరు జిల్లా పెదవేగి- కూచింపూడి మధ్య వరదలో రాకపోకలు

3న మరో అల్పపీడనం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం గురువారం సాయంత్రానికి మధ్యప్రదేశ్ పరిసరాల్లో కొనసాగుతోంది. గురువారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురిశాయి. శుక్రవారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. వచ్చే నెల మూడో తేదీన ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని అంచనా వేసింది. ఉత్తర కోస్తాలో భారీవర్షాలు కురుస్తాయంది.

సచివాలయాలపై మూడంచెల్లో పర్యవేక్షణ

- 2,778 పోస్టులు మంజూరు

అమరావతి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): గ్రామ/వార్డు సచివాలయాల పాలనను గాడిలో పెట్టడానికి టీడీపీ కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు సత్ఫలితాల దశకు చేరుకుంటున్నాయి. ఇప్పటికే సిబ్బందిని సర్దుబాటు చేసేందుకు శ్రీకారం చుట్టిన గ్రామ/వార్డు సచివాలయాల శాఖ.. తాజాగా మండల, మున్సిపల్, జిల్లా స్థాయిలో సచివాలయాలను పర్యవేక్షించడానికి వ్యవస్థను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. డిప్యుటేషన్/ఔట్‌సోర్సింగ్ ద్వారా 2,778 పోస్టులు మంజూరుచేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఆయా మండలాలు/పట్టణ స్థానిక సంస్థల నుంచి 1,785 మందిని డిప్యుటేషన్‌పై వినియోగించుకోనున్నారు. 993 కొత్త ఏఎన్ఎం/వార్డు ఆరోగ్య కార్యదర్శి పోస్టులను సృష్టించనున్నారు.

నియామకాలు.. పర్యవేక్షణ ఇలా..

- గ్రామ/వార్డు సచివాలయాల శాఖ నుంచి ఆరుగురిని, డైరెక్టరేట్ నుంచి ఆరుగురిని డిప్యుటేషన్‌పై ఫంక్షనల్ అసిస్టెంట్లుగా తీసుకుంటారు.
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ నుంచి 17 మంది జాయింట్ డైరెక్టర్/డీఎల్‌డీఏ స్థాయి అధికారులను జిల్లా గ్రామ/వార్డు సచివాలయ శాఖ అధికారిగా నియమిస్తారు. ఆ శాఖల నుంచి 26 మంది సూపరింటెండెంట్లు, 26 మంది సీనియర్ అసిస్టెంట్లు, 52 మంది టెక్నికల్ కోఆర్డినేటర్లు, 104 మంది జూనియర్ అసిస్టెంట్లను డిప్యుటేషన్‌పై తీసుకుంటారు. 26 మంది ఆఫీసు సబార్డినేట్లను ఔట్‌సోర్సింగ్ ద్వారా నియమిస్తారు.
- మండల స్థాయిలో పంచాయతీరాజ్‌శాఖ ఫస్ట్ లెవల్ గెజిటెడ్ అధికారిని మండల గ్రామ/వార్డు సచివాలయ అధికారిగా నియమిస్తారు. ఇందుకోసం 660 మందిని డిప్యుటేషన్‌పై తీసుకుంటారు. మండలాల్లో 1,320 మంది జూనియర్ అసిస్టెంట్లను ఇదే శాఖ నుంచి డిప్యుటేషన్‌పై నియమిస్తారు.
- అదే విధంగా పురపాలక శాఖకు చెందిన ఇద్దరు రీజినల్ డైరెక్టర్ కమ్ అప్పిలేట్ కమిషనర్లు, ఆరుగురు సెలెక్షన్ గ్రేడ్/జాయింట్ డైరెక్టర్ స్థాయి అధికారులను అదనపు కమిషనర్లుగా.. మరో 9 మందిని జిల్లా గ్రామ/వార్డు సచివాలయ శాఖ అధికారులుగా డిప్యుటేషన్‌పై నియమిస్తారు.

ఆరోగ్యశాఖలో పదోన్నతుల పండుగ

- 63 మందికి ప్రొఫెసర్లుగా పదోన్నతి
- ఏడుగురు డీడీలకు జేడీలుగా పోస్టింగ్స్

అమరావతి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాల్లో ప్రొఫెసర్ల కొరతను అధిగమించడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలతో 63 మందికి పదోన్నతి లభించింది. జాతీయ వైద్య సంఘం నియమాల మేరకు వివిధ కళాశాలల్లో ప్రొఫెసర్ల అవసరాలను తీర్చడానికి ప్రభుత్వం నిబంధనలు సడలించింది. నిబంధనల ప్రకారం అసోసియేట్ ప్రొఫెసర్‌గా మూడేళ్ల పనిచేసిన వారు మాత్రమే ప్రొఫెసర్ పదోన్నతికి అర్హులు. అయితే ప్రభుత్వం దీన్ని సడలిస్తూ.. ఒక ఏడాది అనుభవమున్న అసోసియేట్ ప్రొఫెసర్లను కూడా ప్రొఫెసర్లుగా నియమించేందుకు అవకాశం కల్పించింది. ఈ మేరకు 11 క్లినికల్ విభాగాలు, 2 నాన్ క్లినికల్ విభాగాల్లో 63 మందిని డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) పదోన్నతికి సిఫారసు చేసింది. ఈ విధంగా పదోన్నతి పొందిన ప్రొఫెసర్లకు పోస్టింగులు ఇచ్చేందుకు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆమోదం తెలిపారు. పదోన్నతి పొందిన వారిలో 35 మంది కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల్లో, 38 మంది పాత ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పని చేయడానికి అంగీకరించగా.. వారందరికీ పోస్టింగ్‌లు ఇచ్చారు. కాగా, ఆరోగ్యశాఖలో సుదీర్ఘకాలంగా పదోన్నతికి నోచుకోని డిప్యూటీ డైరెక్టర్ల (డీడీ)కు ఎట్టకేలకు ప్రమోషన్ లభించింది. సర్వీసు నిబంధనల ప్రకారం రెండేళ్లు డీడీగా పనిచేసిన వారు జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతికి అర్హత లభిస్తుంది. అయినా డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పరిధిలో పనిచేస్తున్న ఐదుగురు డీడీలు 20 ఏళ్లుగా పదోన్నతి కోసం ఎదురుచూస్తున్నారు. మరో ఇద్దరు 11 ఏళ్లుగా పదోన్నతి లేక ఇబ్బంది పడుతున్నారు. కాగా, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్‌లో డిప్యూటీ డైరెక్టర్లుగా ఉన్న రాజాభాను, పాండురంగప్రసాద్‌కు జాయింట్ డైరెక్టర్లుగా పదోన్నతులు కల్పించి, పోస్టింగ్స్ ఇచ్చారు.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar**, RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.*